**నాగర్ కర్నూల్ ప్రతినిధి ఆగస్టు 30 (నినాదం) :** మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై గట్టి నిఘా యువతను మత్తు బారిన పడనివ్వమని కలెక్టర్, స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం లో శనివారం కలెక్టర్ అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, ఇకముందు అవలంబించాల్సిన చర్యలపై అధికారులకు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ దిశానిర్దేశం చేశారు. గడిచిన రెండు మాసాలలో జిల్లాలో ఎక్సైజ్, పోలీస్ శాఖల అధ్వర్యంలో నిర్వహించిన దాడులు, పట్టుబడిన గంజాయి, అల్ప్రాజోలం ఇతర మత్తు పదార్థాలు, నమోదైన కేసుల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యువతను, విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తున్న మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. అవసరమైతే మాదకద్రవ్యాల విక్రేతలు, రవాణ చేసే వారిపై పీ.డీ యాక్టును ప్రయోగించేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలను చైతన్యపరచేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ప్రహరీ క్లబ్స్, యాంటీ డ్రగ్ కమిటీలు క్రియాశీలక పాత్ర పోషించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కమిటీలను బలోపేతం చేస్తూ పూర్తి స్థాయిలో అవి పని చేసేలా చూడాలన్నారు. కొంతమంది యువకులు మత్తు పదార్థాల వంటి హానికారకమైన మత్తు పానీయాల వల్ల యువకుల ఆరోగ్యాన్ని దెబ్బ తీయడంతో ఆరోగ్యం పై కూడా తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని అన్నారు. పాఠశాలలు, కళాశాలలకు 100 మీటర్ల దూరం లోపు సిగరెట్లు, గుట్కాలు వంటి విక్రయాలు జరుగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 4న వినాయక కళ్యాణ మహోత్సవాన్ని జయప్రదం చేయండి



**ఖమ్మం, ఆగస్టు 30(నినాదం):** 4న జరుగు శ్రీ వినాయక కళ్యాణ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని శ్రీ శ్రీ శ్రీ రాజు రాజేశ్వరి గణేష్ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సిద్ధి బుద్ధి వినాయక కళ్యాణ మహోత్సవాన్ని కి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా 3న మండపం ఆవరణంలో కుంకుమార్చన కార్యక్రమం ఉంటుందని, అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు.

## ప్రత్యేకపూజలో పాల్గొన్న తుమ్మల యుగంధర్



**ఖమ్మం, ఆగస్టు 30(నినాదం):** గణేష్ నవరాత్రులు సందర్భంగా నగరంలోని పలు డివిజన్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల్లో రాష్ట్ర మంత్రి తుమ్మల తనయుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాలు దగ్గర ఎలాంటి అవంతినే సంఘటన జరగకుండా నిరాహకులు తగు ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## విజయవంతంగా సెర్ప్ ఉద్యోగుల బదిలీ

**కొత్త స్థానంలో నూతన ఉత్సాహంతో పని చేసి**

**వంద శాతం లక్ష్యాలను సాధించాలి**

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ**



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 30:(నినాదం):** కొత్త స్థానంలో నూతన ఉత్సాహంతో పని చేసి వంద శాతం లక్ష్యాలను సాధించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. స్థానిక టి.టీ.డి.సి. భవనంలో శనివారం జరిగిన సెర్ప్ ఉద్యోగుల బదిలీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీజ మాట్లాడుతూ సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మార్గదర్శకాలు, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఖమ్మం జిల్లాలో 148 మంది సెర్ప్ ఉద్యోగుల బదిలీలు విజయవంతంగా పూర్తి చేసామని అన్నారు. జిల్లాలో 94 మంది యల్ 2, పది మంది యల్ 1, 44 మంది యం.యస్.సి.సి మొత్తం 148 మంది సెర్ప్ ఉద్యోగులను వారు కోరుకున్న స్థానంలో సీనియారిటీ బట్టి కౌన్సిలింగ్ ద్వారా బదిలీ చేయడం జరిగిందని అన్నారు. సెర్ప్ ఉద్యోగులు నూతన స్థానంలో ఉత్సాహంతో పనిచేసి వారికి కేటాయించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎన్. సన్యాసయ్య, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారిణి ఆర్. జయశ్రీ, డిపిఎం, ఏపీఎంలు, సెర్ప్ ఉద్యోగులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అప్పగించాలి

**ఖమ్మం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు**

**జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను పరిశీలించిన జర్నలిస్టుల బృందం**



**ఖమ్మం ప్రతినిధి,ఆగస్టు30:(నినాదం):** ఖమ్మం జర్నలిస్టులకు కేటాయించిన 23.02 ఎకరాల ఇళ్ల స్థలాలను ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు అప్పగించాలని, క్యాబినెట్ ఆమోదం పొంది, జీవో జారీ చేసి దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నా కూడా ఇంతవరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించలేకపోవడం బాధాకరమని ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మంలోని ఎస్ ఆర్ గార్డెన్ సమీపంలోని ఎన్ఎస్ పి కాల్వకట్టపై జర్నలిస్టులకు 23.02 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల ఆస్థలంలోని కొంత భాగంలో అధికారులు ఫెన్సింగ్ చేసి మొక్కలను నాటారు. కొందరు అక్రమార్కులు గుట్టు చప్పుడు కాకుండా విలువైన గ్రావెల్స్‌ను తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న జర్నలిస్టుల బృందం శనివారం జర్నలిస్టులకు కేటాయించిన స్థలాలను పరిశీలించారు. అనేక అడ్డంకులు సృష్టిస్తూ జర్నలిస్టుల స్థలాలను సైతం ఇతరులకు కట్టబెట్టే వ్యవహారాన్ని తక్షణమే విరమించుకోవాలని, కాలయాపన చేయకుండా స్థానిక సంస్థలు ఎన్నికల కంటే ముందే జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలను అప్పగించాలని రమేష్ బాబు విజ్ఞప్తి చేశారు. ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి జర్నలిస్టులు అంతా ఐక్యంగా కలిసి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, కోశాధికారి బిక్కి గోపి, ఉపాధ్యక్షులు ముత్యాల కోటేశ్వరరావు, సాక్షి సబ్ ఎడిటర్ అచ్చిరెడ్డి, నమస్తే తెలంగాణ సబ్ ఎడిటర్లు సముద్రాల శ్రీధర్, ఎస్ కే జానీ, సహాయ కార్యదర్శి మూల జీవన్ రెడ్డి, జర్నలిస్టు నేతలు పి. పానకాలరావు, ఉల్లోజు రమేష్, వెంకటరెడ్డి, ఐ న్యూస్ బ్యూరో కే .నాగేశ్వరరావు, మోహన్, గోవింద్, అప్పారావు, ఎస్ డి యాదగిరి, రోజా, ఫ్రైమ్ 9 సాయి, పులి శ్రీను, పెంటి వెంకటేశ్వర్లు, ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహాలు కేసరి సముద్రంలోనే నిమజ్జనం చేయాలి

**గణేష్ మండపాల నిర్వాహకుల ఏకగ్రీవ తీర్మానం**



**నాగర్ కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 30 (నినాదం):** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని గణేష్ మండపాల నిర్వాహకులు శనివారం రూబీ గార్డెన్‌లో సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సమావేశంలో నిర్వాహకులు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు నిమర్జనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని తెలిపారు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కరెంటు పట్ల జాగ్రత్తగా ఉండి నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని సమావేశంలో మాట్లాడారు.. నాగర్ కర్నూల్ చెరువులోనే నాగర్కర్నూల్ వినాయకులను నిమర్జనం చేయాలని గతంలో నాగర్ కర్నూల్ పట్టణంలో గణేష్ ఉత్సవాలు మొదలైనప్పటి నుండి నాగర్ కర్నూల్ కేసరీ సముద్రం చెరువులోనే నిమర్జనం కార్యక్రమం నిర్వహిస్తూ వచ్చేవారు. ట్యాంక్ బండ్ నిర్మాణంలో భాగంగా ఈ నిమజ్జన కార్యక్రమాన్ని నాగనూల్ చెరువులో ఏర్పాటు చేశారు.. నాగనూల్ చెరువులో నిమర్జనానికి సంబంధించి ఏర్పాట్లు చేసినప్పటికీ ప్రధాన రహదారి నుండి కిలోమీటర్ లోపలికి వెళ్లాలి అలాగే బురుదా, పాములు ఎక్కువగా ఉంటాయని చీకట్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నిర్వాహకులు గుర్తు చేశారు.. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని నాగర్ కర్నూల్ వినాయకులు నాగర్కర్నూల్ చెరువులోనే నిమర్జనం చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని గతంలోని నాగర్ కర్నూల్ ఆర్డీవో మరియు నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రం ఇచ్చామని గుర్తు చేశారు. అనంతరం నాగర్ కర్నూల్ గణేష్ మండపాల నిర్వాహకులు సెప్టెంబర్ 4వ తేదీన 9వ రోజు నిమర్జనం కార్యక్రమం ఉంటుందని ఈ నిమజ్జన కార్యక్రమం నాగర్కర్నూల్ చెరువులోనే నిమర్జనం నిర్వహించుకుంటామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆదివారం 5 రోజులలో నిమజ్జనం చేసేవారు కూడా నాగర్ కర్నూల్ చెరువులోనే చేస్తామని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నాగర్కర్నూల్ పట్టణ వినాయక మండప నిర్వాహకులు అందరూ పాల్గొన్నారు.

## బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



**దమ్మపేట, ఆగస్టు 30 (నినాదం):** బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామ చంద్రరావు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిలుపు మేరకు మండల అధ్యక్షులు పల్లపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన కాంగ్రెస్ గవర్నమెంట్ ఇచ్చిన 6 గ్యారంటీలు వెంటనే అమలు చేయాలనీ నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే నెమలిపేట వరద ముంపు బాధితులకు వెంటనే అధికారులు స్పందించి ముంపుకు గురైన ఇళ్లకు 10,000 చొప్పున తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు తంబళ్ల రవి, సీనియర్ నాయకులు ఉడతనేని విశ్వేశ్వరరావు, పసుపులేటి నాగరాజు, గూడ ముత్యాలరావు, నాగుల చందు, వీరభద్రం, పసుమర్తి పుల్లారావు, ఎస్కే బాజీ, వెంకట్, మడివి రవి, నారం వెంకటేశ్వరరావు, కొమ్మినపల్లి రజిత, కారం రత్నకుమారి, ఆళ్ల సుజాత, పల్లపు శిరీష, సోడియం సాయి లక్ష్మి పాల్గొన్నారు.

## జీపీ ఎన్నికల ప్రక్రియపై అఖిలపక్ష సమావేశం

**ఓటర్ల ముసాయిదా జాబితా,**

**పోలింగ్ కేంద్రాల అభ్యంతరాలు స్వీకరణ**



**మణుగూరు ఆగస్టు 30 (నినాదం):** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల ముసాయిదా జాబితాను మరియు పోలింగ్ కేంద్రాల ప్రచురణ పై అభ్యంతరాలు స్వీకరించడానికి. మణుగూరు మండలంలో శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో అఖిలపక్ష నాయకులు నుంచి వాళ్ళ అభ్యంతరాలను స్వీకరించారు. మణుగూరు మండలంలో అన్ని గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా మరియు పోలింగ్ కేంద్రాల ముసాయిదుపై అభ్యంతరాలు స్వీకరణ కోసం స్థానిక అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలో అన్ని ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు మరియు పంచాయతీ అధికారులు హాజరయ్యారు. సమావేశంలో ముఖ్యంగా చర్చించిన అంశాలు ఓటర్ల జాబితా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల ముసాయిదా ఓటర్ల జాబితా పై తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. కొన్ని కొన్ని గ్రామాల్లో పేర్లు నమోదులో తప్పులు, మరికొన్ని ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోవడం లాంటి సమస్యలపై వాళ్ళ ప్రస్తావించారు. అలాగే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుపై కూడా కొన్ని అభ్యంతరాలు పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు అభిప్రాయం వెల్లబుచ్చారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో కొన్ని పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉన్నాయని వాటిని మార్చాలని రాజకీయ ప్రతినిధులు కోరారు. అభ్యంతరాలు నమోదు సమయంలో వచ్చిన కొన్ని అడ్డంకులను రికార్డులు నమోదు చేయడం జరిగింది. ఈ అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారి డిపిఓ కి సమర్పించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని స్థానిక అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారము అభ్యంతరాల స్వీకరణకు ఈరోజుతో గడువు ముగిసింది అని తెలిపారు. తుది జాబితా ప్రచురణ కోసం సెప్టెంబర్ 2న ఉంటుందని తెలియజేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలు మరియు ప్రజలు పాల్గొనడం ద్వారా ఎన్నికలు సజావుగా పారదర్శకంగా నిర్వహించబడతాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి శ్రీనివాసరావు తెలిపారు.

## పోలీసుశాఖలో చేసిన సేవలు మరువలేనివి

**పోలీసు కమిషనర్ సాయిచైతన్య**



**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 30 (నినాదం) :** పోలీస్ శాఖలో ఎంతో పనివత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా పదవి విరమణ చేయడం ఎంతో గొప్పవిషయమని పోలీసు కమిషనర్ సాయిచైతన్య అన్నారు. నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ లో శనివారం వీఆర్ లో ఉన్న సర్కిల్ ఇన్స్ పెక్టర్ డి.ఎల్లయ్య గౌడ్, సి.సి.ఆర్.బిలో ఉన్న ఎస్సై తాళ్ళ నర్సింలు, టాస్క్ ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ ఎల్.యాకుబ్ రెడ్డి శనివారం పదవి విరమణ " పొందారు. వీరికి పోలీసు కమిషనర్ శాలువలతో సత్కరించి" పదవి విరమణ శుభాకాంక్షలు సర్టిఫికేటు(జ్ఞాపికలతో) " ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ సాయి చైతన్య మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పక ఉంటుందని, మీరు డిపార్టుమెంట్ కు చేసిన సేవలు ఎంతో ఘనమైనయమన్నారు. పదవి విరమణ అనంతరం మీకు ఎలాంటి అవసరం వచ్చిన మీకు ఎల్లవేళల సహాయపడుతామని మీరు మీ కుటుంబ సభ్యులు అయురారోగ్యాలతో ఉండాలని, మీ పిల్లల భవిష్యత్తు భాగుండాలని ఆకాంక్షించారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి,రిజర్వు ఇన్స్పెక్టర్స్ శ్రీనివాస్, తిరుపతి, ఆఫీస్ సూపరింటెండెంట్ లు శంకర్, బషీర్ అహ్మద్, షకీల్ పాషా, పదవి విరమణ వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

## ఆపత్కాలంలో అండగా ఎంపీ అర్వింద్

**అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ ద్వారా వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ**



**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 30 (నినాదం) :** నిజామాబాద్ జిల్లాలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ ద్వారా వరద బాధితులకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముఖ్యంగా సిరికొండ, ధర్పల్లి, ఇందల్ వాయి మండలాల్లో వర్షాలు, వరదల కారణంగా తీవ్ర నష్టం జరుగడంతో నిరాశ్రయులైన ప్రజలకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి తన ఫౌండేషన్ ద్వారా అండగా నిలిచారు. వర్షాలు, వరదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500 నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, మండలాల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తల చేతుల మీదుగా నిరాశ్రయులైన ప్రజలకు నిత్యావసర కిట్లను అందించారు. ఇలాంటి కష్టకాలంలో అండగా నిలిచిన ఎంపీ అర్వింద్ ధర్మపురి కి ప్రజలు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు సన్మానం



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 30 (నినాదం):** ఉద్యోగ విరమణ పొందిన ఆరుగురు పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాధ్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖకు ఎనలేని సేవలతో పోలీస్ అధికారుల మన్ననలు పొందారని కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబసభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందినవారిలో ఇబ్రహీం, ఎస్ఐఎస్‌బి, ఖమ్మం వెంకన్న,ఎస్ ఐ ఖమ్మం. ఎన్.వెంకట్ రెడ్డి ఏ ఎస్ ఐ, ఖమ్మం ఎం సంగయ్య,ఎస్ ఐ జి.శ్రీనివాసరావు ఏఆర్ఎస్ఐవి మాధవ రెడ్డి కానిస్టేబుల్ అర్బన్ గావిధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఏసీపీ మహేష్,సుశీల్ సింగ్, కామరాజు, సురేష్, పోలీస్ అసోసియేషన్ ఇంచార్జి అధ్యక్షుడు వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వీధినాటకోపాధ్యాయుల జిల్లా సంఘం ఏకగ్రీవ ఎన్నిక



**కొడంగల్, ఆగష్టు,30 (నినాదం):** వీధినాటకోపాధ్యాయుల జిల్లా సంఘం నూతన కమిటీ ని బొంరాస్ పేట్ మండలం లోని తుంకిమెట్లలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సంఘం జిల్లా గౌరవ సలహాదారు గా గంజిపల్లి పెద్ద రామయ్య, గౌరవ అధ్యక్షుడు గా చాకలి రాములు, అంజిలప్ప, అధ్యక్షుడు గా కుర్వ అంజిలయ్య,ఉపాధ్యక్షుడు గా ఎం.హన్మయ్య, ప్రధాన కార్యదర్శి గా ఎస్.రాములు, సహాయ కార్యదర్శి గా అమృతయ్య గౌడ్, కోషాధికారిగా చిన్న రాములు, ప్రచార కార్యదర్శిగా జి.శివకుమార్, కార్యదర్శులు గా రఘుపతి రెడ్డి, ఎం.వెంకటయ్య, లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో జరిగే జానపద నృత్యప్రదర్శన కు నూతన కమిటీ సభ్యులు వెళ్ళి, వీధినాటక ప్రదర్శన చేయనున్నట్లు వారు తెలిపారు.

## బాచుపల్లి హైస్కూల్‌ను సందర్శించిన ఎంపీ ఈటెల రాజేందర్

**మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీకి వినతి**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 30 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి లోని జిల్లా పరిషత్ హై స్కూల్ ను మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ సందర్శించి పాఠశాల స్థితిగతులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణతో మాట్లాడి కావాల్సిన మౌలిక వసతుల గురించి చర్చించారు. పాఠశాలలో అనేక ఇబ్బందులు ఎన్నాయని ఈటెల రాజేందర్ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి బాచుపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ కు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించుటకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రధానోపాధ్యాయులు అధ్యాపక బృందం మండల విద్యాశాఖాధికారితో కలిసి ఎంపీకి వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, బీజేపీ సీనియర్ నాయకులు శేఖర్ యాదవ్, సుబ్బారావు, రచ్చ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నిజామాబాద్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి



**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 30 (నినాదం) :** సీఎం రేవంత్ రెడ్డిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి శాసనసభ సమావేశం అనంతరం కలిశారు. నిజామాబాద్ జిల్లాలో జరిగిన వరద నష్టం గురించి సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి తో నిజామాబాద్ జిల్లాలో, నిజామాబాద్ రూరల్ నియోజవర్గంలో గత రెండు రోజులుగా కురిసిన వర్షం వల్ల పంటలు, రోడ్లు, విద్యుత్, కరెంటు స్తంభాలు, బ్రిడ్జ్ లు ఎంత నష్టం జరిగిందో సీఎంకు వివరించడం జరిగిందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి తెలిపారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ శాఖ, విద్యుత్ శాఖ, రోడ్ల భవనాలు శాఖలు సమన్వయంతో పనిచేసి నిజామాబాద్ జిల్లాలో, నిజామాబాద్ రూరల్ నియోజవర్గంలో ఎంత వరద నష్టం జరిగిందో అంచనా వేసి సీఎంకు పంపాలని ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి రూరల్ నియోజకవర్గంలో జరిగిన ఆస్తి నష్టం, పంట నష్టం, రోడ్లు కరెంటు స్తంభాలు ట్రాన్స్ ఫార్ లు ధ్వంసం గురించి సీఎంకు వివరించారు. సిఎం సానుకూలంగా స్పందించి నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కు అన్ని శాఖల సమన్వయంతో వరద వల్ల పూర్తి నష్టాన్ని అంచనాలు వేసి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారని ఆయన అన్నారు. హైదరాబాదులో సోమవారం రోజు సీఎం జిల్లాలో జరిగిన వరద నష్టం పై కలెక్టర్లతో రివ్యూ చేస్తున్నారని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి తెలిపారు.

## క్రీడలతో మానసికోల్లాసం



**వైరా ఆగష్టు 30 (నినాదం):** క్రీడలు మానసిక ఉల్లాసం తో పాటు శారీరక ధృఢత్వానికి దోహదపడతాయని వైరా ఎస్సై పుష్పాల రామారావు ప్రముఖ వైద్యులు కాపా మురళీకృష్ణ పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని వైరాలోని ఇండోర్ స్టేడియంలో కోచ్ షేక్ అంజిత్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన షటిల్ బ్యాట్మెంటన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు శనివారం బహుమతులు ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వైరా ఎస్సై పుష్పాల రామారావు ప్రముఖ వైద్యులు కాపా మురళీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ క్రీడలతో పాటు ప్రతి విద్యార్థి విద్యపై కూడా పట్టు సాధించాలని, అప్పుడే ఉన్నత శిఖరాల అధిరోహణకు మరింత దోహద పడేందుకు కారణం అవుతాయన్నారు. అనంతరం క్రీడాకారులైన బాల బాలికలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు దాదాపు 40 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని క్రీడా ప్రతిభను కనబరిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. యోచన్ శ్రియాన్ అనే ఎనిమిదేళ్ల విద్యార్థి సెటిల్ టోర్నమెంట్లో అత్యుత్తమంగా ప్రతిభ కనబరిచినట్లు కోచ్ తెలిపారు. శనివారం నిర్వహించిన షటిల్ డబుల్స్ టోర్నమెంట్ పోటీల్లో బొర్రా రాజశేఖర్, సుందర్ రావు లు మొదటి బహుమతి సాధించారు. ఉత్తమ క్రీడాకారులను వైరా ఎస్సై పుష్పాల రామారావు కాపా మురళీకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో నీ తోడు వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు నందిగామ మనోహర్, కోచ్ షేక్ అంజిత్ పాషా, కట్ల ప్రియాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమను రతనాల సీమగా మారుస్తా

**ప్రతి చెరువును నీటితో నింపే ప్రయత్నం చేస్తా**

**అభివృద్ధిని అడ్డుకుంటున్న వైకాపాకు అడ్డుకట్ట వేస్తాం**

**పరమసముద్రం సభలో చంద్రబాబునాయుడు**



**కుప్పం, ఆగస్టు 30 (నినాదం):** రాయలసీమను రతనాలసీమగా చేసే బాధ్యత తనదని ముందే చెప్పానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రతి చెరువుకు నీళ్లిచ్చే బాధ్యత నాది. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 110 చెరువులకు నీళ్లిచ్చే అవకాశం ఉంది. కుప్పంలో 520 చెరువులు ఉన్నాయి. గొలుసుకట్టు- చెరువులు ఉన్నాయి. చెక్‌డ్యామ్‌ల ద్వారా నీళ్లిచ్చే అవకాశం ఉంది. కృష్ణా జలాలను 730 కిలోమీటర్లు తీసుకొచ్చిన ఘనత తెదేపాది. ముఠా రాజకీయాలు లేకుండా చేసిన పార్టీ తెదేపా. హంద్రీనీవా ఫేజ్-1, ఫేజ్-2 వల్ల 6 లక్షల ఎకరాలకు సాగునీరు వస్తుంది. 33 లక్షల మందికి తాగునీరు అందుబాటులో- ఉంటుంది. పరిశ్రమలకు కూడా నీళ్లొస్తాయి. ఇప్పుడు కుప్పానికి నీళ్లొచ్చాయి. రాబోయే ఏడాదికి హంద్రీనీవా ద్వారా చిత్తూరుకు కూడా నీళ్లిచ్చే బాధ్యత నాది. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీళ్లిచ్చినరోజే నా జన్మ సార్థకమవుతుందన్నారు. 2014-2019 మధ్య కాలంలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం రూ.12,500 కోట్లు- ఖర్చు పెట్టినట్లు చెప్పారు. కానీ, వైకాపా పాలనలో కేవలం రూ.2 వేల కోట్లు- ఖర్చుపెట్టారని విమర్శించారు. కుప్పం నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. పరమసముద్రం వద్ద కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. అనంతరం ఏర్పాటు- చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గేట్లతో సెట్టింగ్‌లు వేసి నీళ్లు కూడా బయటి నుంచి తీసుకొచ్చి నాటకాలాడిన ఘటనలు చూశాం. విమానం ఎక్కేలోపే నీళ్లన్నీ ఇంకిపోయిన పరిస్థితులు చూశాం. అసత్యాలు చెప్పడంలో వైకాపా దిట్ట. అసాధ్యాలను సుసాధ్యం చేయడం ఎన్డీయే లక్ష్యం అన్నారు. నీళ్లు వచ్చేసరికి వైకాపా నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రతి చెరువుకు నీళ్లిచ్చే బాధ్యత నాది. మల్యాలలో ప్రారంభించి కుప్పం పరమసముద్రానికి నీళ్లు తీసుకొచ్చాం. 27 లిఫ్ట్ ఇరిగేషన్లు పెట్టి ఎక్కడికక్కడ నీళ్లు తరలిస్తున్నాం. కుప్పానికి రెండేళ్ల కంటే ముందే కృష్ణా పుష్కరాలు వచ్చాయి. గతంలో రాయలసీమలో కరవు వస్తే.. పశువుల కోసం రైలులో నీళ్లు తెప్పించి కాపాడుకున్నాం. నేను ఏ పని చేయాలన్నా వెంకన్నపై భారం వేసి బుల్లెట్‌లా దూసుకెళ్తా. పవిత్రమైన సంకల్పం ఉంటే ఏ పనైనా జయప్రదమవుతుందన్నారు. పోలవరం-బనకచర్ల పూర్తయి వంశధార నుంచి పెన్నానది వరకు అనుసంధానం చేయగలిగితే కరవనేదే ఉండదన్నారు. నదుల అనుసంధానం ఉపయోగాన్ని తెలంగాణ నేతలు తెలుసుకోవాలి. నీళ్ల సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచిస్తున్నా. నీళ్లు లేనప్పుడే వాటి విలువ తెలుస్తుంది. జలాశయాల్లో నీటి నిల్వ ఎంత ముఖ్యమో, భూమిని జలాశయంగా తయారు చేసుకోవడం అంతకంటే ముఖ్యం. ఒక యజ్ఞం ద్వారా అభివృద్ధి కోసం ముందుకెళ్తున్నాం. దానిని భగ్నం చేసేందుకు వైకాపా అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. వీరికు చేతనైతే అభివృద్ధి, సంక్షేమంలో పోటీపడండని పిలుపునిస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. వైకాపా ఒక విషవృక్షంగా తయారైంది. మనం ఏ మంచి పని చేస్తున్నా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కోటంరెడ్డి హత్యకు కుట్ర

**లోతుగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**నెల్లూరు, ఆగస్టు 30 (నినాదం):** ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డిపై దాడి చేసేందుకు జరిగిన కుట్ర వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది. ఈ కుట్ర చేసిందెవరు? ఆ కుట్ర వెనుక ఉన్నది ఎవరు? అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. కోటంరెడ్డి హత్య కుట్ర వీడియోపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. వీడియోలో ఉన్న వారిలో ఒకరు ప్రస్తుతం జైలులో ఉండగా.. మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు- సమాచారం అందుతోంది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి హత్యకు కుట్రపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. వీడియోలో ఉన్నది రౌడీషీటర్ శ్రీకాంత్ ముఖ్య అనుచరుడు జగదీశ్, మహేశ్, వినీత్, జకీర్, రాజశేఖర్ రెడ్డిగా గుర్తించారు. వారంతా పాత నేరస్తులు అని నిర్ధారించారు. గతంలో పలు నేరాలకు పాల్పడ్డారు. డిస్ట్రిక్- పోలీసులు వెల్లడించారు. జగదీశ్ ఇటీవలే అరెస్ట్ అయ్యి, గంజాయి కేసులో రిమాండ్‌లో ఉన్నారు. మిగిలిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలో ఉన్న అంశం, కుట్ర వెనుక ఉన్నవారెవరనే వాటిపై పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలాఉండగా.. ఈ వీడియో వైరల్ అవడంతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. హోంమంత్రి అనిత వెంటనే ఎమ్మెల్యే కోటంరెడ్డికి ఫోన్ చేశారు. ప్రభుత్వం మొత్తం అండగా ఉంటు-ందని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. కోటంరెడ్డి అనుచరులు, టీడీపీ శ్రేణులు ఆయన కార్యాలయం వద్దకి ఒక్కొక్కరిగా చేరుకుంటున్నారు.

**హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**
HINDUJA HOUSING FINANCE
ప్రధాన కార్యాలయం: నెం. 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట, చెన్నై- 600015,
www.hindujahousingfinance.com
CIN U65922TN2015PLC100093

అనుబంధం-4 స్వాధీన ప్రకటన (స్థిరాస్తి కొరకు)

[illegible]

| క్ర. సం. | రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/హామీదారు(లు)/ రుణ ఖాతా నెం. | డిమాండ్ నోటీస్ తేది & మొత్తం | స్వాధీనత తేది |
|---|---|---|---|
| 1 | 1. శ్రీ ముక్కరెడ్డి ఉమాకాంత్, తండ్రి ముక్కరెడ్డి మురళీ మోహన్ ....రుణగ్రహీత 2. [illegible] ....సహ రుణగ్రహీత 3. శ్రీమతి ముక్కరెడ్డి సరస్వతమ్మ, భర్త ముక్కరెడ్డి మురళీమోహన్ ....సహ రుణగ్రహీత నివాసం: ఇం.నెం. 1-940, [illegible] 516433. రుణ ఖాతా నెం.లు (AP/KUR/KURL/A000000025) రూ.29,35,562/- [illegible] | 11-09-2024 రూ. 29,35,562/- [illegible] | 30.08.2025 |
| | [illegible] | | |
| 2 | 1. శ్రీ శివనారాయణ దింతల, ...రుణగ్రహీత 2. శ్రీమతి మేరీ దింతల ...సహ-రుణగ్రహీత [illegible] -523292. రుణ ఖాతా నెం. AP/GNT/CHRL/A000000291 రూ.5,59,948/- [illegible] | 21/03/2025 రూ.5,59,948/- [illegible] | 30.08.2025 |
| | [illegible] చదరపు గజాల స్థలం మరియు ఆర్‌సిసి డాబా ఇల్లు యావదాస్తి. సరిహద్దులు: (350 చదరపు అడుగులు) ఆర్‌సిసి తూర్పు: దాసరి పోలయ్య స్థలం 23.01 అడుగులు, దక్షిణం: దార్ల రాములు స్థలం 50.01 అడుగులు, పశ్చిమం: రోడ్డు 44.01 అడుగులు, ఉత్తరం: రోడ్డు 23.01 అడుగులు | | |

ప్రదేశం: ఆంధ్ర ప్రదేశ్; తేది: 31.08.2025, (అధీకృత అధికారి), హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

# ప్రజల కోసం ప్రాణాలు అర్పిస్తా

**నిత్యం ముళ్ల ప్రయాణం నాది**

**ఎన్నో సమ్మెట దెబ్బలు తిన్న రాజకీయం**

**హత్య బెదిరింపు వ్యవహారంపై శ్రీధర్ రెడ్డి వ్యాఖ్యలు**



**నెల్లూరు, ఆగస్టు 30 (నినాదం):** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేని చంపేస్తే డబ్బే డబ్బు అంటూ రౌడీ షీటర్ల సంభాషణకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.. దీనిపై సోషల్ మీడియా వేదికగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. ప్రజల కోసం ప్రాణాలు అర్పించే ఉక్కు సంకల్పం నాది.. నా రాజకీయ జీవితం పూల పాన్పు కాదు.. నిత్యం ముళ్ల మీద ప్రయాణం.. ఎన్నో సమ్మెట దెబ్బ లు ఓర్చుకున్న ఈ గుండె తాటాకు చప్పుళ్ళకు బెదరదు.. ప్రజా సేవలో వెనక్కు తగ్గదు.. అంటూ వ్యాఖ్య చేశారు.. ఇక, ఈ వ్యవహారంపై మీడియాతో మాట్లాడిన ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.. ప్రశాంతమైన నెల్లూరులో కొంతమంది రౌడీ షీటర్లు అరాచకాలు చేస్తున్నారు అని దుయ్యబట్టారు.. జులై 1న రౌడీ షీటర్లు కూర్చుని నన్ను చంపాలని మాట్లాడు కున్నారు.. మూడు రోజుల ముందు పోలీసులకు వస్తే.. ఎందుకు నాకు సమాచారం ఇవ్వలేదు..? అని నిలదీశారు.. అసలు, నన్ను చంపితే డబ్బు ఎవరు ఇస్తారనేది పోలీసుల విచారణలో తెలియాలన్నారు.. రాజ్యాధికారం కోసం సొంత ఇంట్లో కుటుంబ సభ్యులను చంపే సంప్రదాయం మా ఇంట్లో లేదని వ్యాఖ్యానించారు. రౌడీ షీటర్లు నా తమ్ముడు గిరిధర్ రెడ్డి అనుచరులు అని ఓ మీడియా రాసిందని మండిపడ్డారు.. విద్యార్థి దశలోనే ఎన్నో పోరాటాలు చేశాను. రౌడీలకు, గుండాలకు భయపడనన్న ఆయన.. వైఎస్ జగన్ ని ధిక్కరించి వీధుల్లోకి వచ్చి పోరాటం చేశాను.. 16 నెలలు అధికారాన్ని వదులుకుని టీ-డీపీలో చేరాను. వైస్సార్సీపీకి సవాల్ విసిరుతున్నా.. ఎన్ని దుష్ప్రచారాలు చేసినా.. వెనకడుగు వేసేదే లన్నారు.. అసలు, నన్ను చంపితే కోట్లు- రూపాయల డబ్బులు ఇస్తామని ఎవరు చెప్పారో పోలీసులు తేల్చాలని డిమాండ్ చేశారు. ఇలాంటి బెదిరింపులకు భయపడను.. నన్ను హత్య చేస్తామని మాట్లాడిన గుండాలకు మా ఇంట్లో చిన్న పిల్లలు కూడా భయపడరు.. నా చివరి శ్వాస, ఓపిక, ఊపిరి ఉన్నంత వరకు ప్రజా జీవితంలోనే ఉంటాను అని ప్రకటించారు కోటంరెడ్డి.. వైసీపీతో నాకు తీవ్రంగా విబేధాలు ఉన్నాయి.. వాళ్ల సోషల్ మీడియా నా మీద విషం చిమ్ముతుందని ఆగ్ర హం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చి 14 నెలలు అవుతుంటే.. ఒక్కరికి కూడా నేను నష్టం కల్గించలేదన్న ఆయన.. అసలు, వైస్సార్సీపీ నేతలు నన్ను ఎందుకు గెలుకుతున్నారు..? అని ఫైర్ అయ్యారు.. గత ప్రభుత్వంలో సజ్జల రామకృష్ణారెడ్డి నా గన్‌మెన్‌లను తొలగించారని గుర్తుచేశారు. పోలీసులు ఎక్కడా వైఫల్యం చెందలేదు.. రౌడీయిజంపై ఉక్కుపాదం మోపుతున్నారని పేర్కొన్నారు.. పోలీసులు కఠినంగా వ్యవహరించడం వల్లే నిందితులు జైల్లులో ఉన్నారని తెలిపారు.. ఇక, వీడియోలో మాట్లాడిన ఒకరిద్దరు వ్యక్తులు నాకు తెలుసని పేర్కొన్నారు.. నా హత్యకు ఇచ్చిన సుపారీ ఎంత అనేది పోలీసులే తేల్చాలన్నారు.

## తిరుపతిలో మహిళా ఎమ్మెల్యేల సదస్సు

**సెప్టెంబరు 14, 15 తేదీల్లో నిర్వహణ : స్పీకర్**

**అనకాపల్లి, ఆగస్టు 30 (నినాదం):** తిరుపతిలో మహిళా ఎమ్మెల్యేల కోసం ప్రత్యేకంగా ఓ సమావేశాన్ని ఏర్పాటుచేస్తున్నామని, సెప్టెంబరు 14, 15 తేదీల్లో మహిళా ఎమ్మెల్యేలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు-చేస్తున్నట్టు- ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో మీడియాకు విడుదల చేసిన వీడియోలో ఈ వివరాలు వెల్లడించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల పరిధిలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన సుమారు 300 మంది మహిళా ఎమ్మెల్యేలు సదస్సుకు హాజరు కానున్నట్టు-చెప్పారు. ఈ కార్యక్రమానికి తొలిరోజు సీఎం చంద్రబాబు, లోక్‌సభ స్పీకర్ హాజరవుతారని, ముగింపు రోజున గవర్నర్ హాజరుకానున్నారని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. సదస్సుకు హాజరయ్యే ఎమ్మెల్యేలకు శ్రీవారి దర్శనం కల్పించించేందుకు ఏర్పాట్లు- చేస్తున్నామన్నారు. సెప్టెంబరు 18 నుంచి శాసనసభ సమావేశాలు జరుగుతాయని, ఈమేరకు ఎమ్మెల్యేలకు సమాచారం పంపించినట్టు పేర్కొన్నారు.

## ఆసియా కప్ క్రికెట్ మేనేజర్‌గా ప్రశాంత్

**అభినందించిన డిప్యూటీ సీఎం పవన్**



**విశాఖపట్నం, ఆగస్టు 30 (నినాదం):** దుబాయ్, అబుదాబిలో సెప్టెంబరు 9 నుంచి ప్రారంభమయ్యే ఆసియా కప్ టీ-20 క్రికెట్ పోటీలకు టీమిండియా మేనేజర్‌గా నియమితులైన పీవీఆర్ ప్రశాంత్‌ను ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ అభినందించారు. భీమవరం జనసేన ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కుమారుడైన ప్రశాంత్.. విశాఖ పర్యటనలో ఉన్న పవన్‌ను కలిశారు. తెలుగు వ్యక్తికి ఇలాంటి అరుదైన గౌరవం దక్కడం పట్ల డిప్యూటీ- సీఎం ఆనందం వ్యక్తం చేశారు. ఇది మనకు గర్వకారణమని అన్నారు. భవిష్యత్‌లో ప్రశాంత్ మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ఉపాధ్యక్షుడిగా పని చేసిన ప్రశాంత్.. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అల్లుడు. గతంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించారు.

# కుప్పం చేరుకున్న కృష్ణమ్మ

**పరమసముద్రం వద్ద బాబు జలహారతి**

**నీటి చేరికతలో సీమ వాసుల్లో ఆనందం**

**చిత్తూరు, ఆగస్టు 30 (నినాదం):** సొంత నియోజ కవర్గం చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ కుప్పం మండలం పరమసముద్రం చెరువు వద్ద హంద్రీనీవా జలాలకు సీఎం జల హారతి ఇచ్చారు. పంచెకట్టుకుని సంప్రదాయ పద్ధతిలో కృష్ణమ్మకు జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు సీఎం చంద్రబాబు.. వేద మంత్రోచ్ఛారణల మధ్య కృష్ణమ్మకు పసుపు, కుంకమ సమర్పించి జలహారతి ఇచ్చారు.. ఈ జల హారతి కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం స్థానిక టీడీపీ నేతలు, ప్రజలు పాల్గొన్నారు.. తమ నియోజకవర్గానికి కృష్ణా జలాలు రావడంపై సంతోషాన్ని వ్యక్తం చేస్తూ.. జై చంద్రబాబు... జైజై చంద్రబాబు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు కుప్పం ప్రజలు..కుప్పంలో స్త్రీ శక్తి బస్సులో ప్రయాణించారు ముఖ్యమంత్రి చంద్రబాబు .. మహిళలు, రైతులతో కలిసి బస్సులో ప్రయాణించారు.. కుప్పం బ్రాంచ్ కెనాల్ వరకు మహిళలు, రైతులతో సంభాషిస్తూ బస్సులో ప్రయాణం చేశారు. స్త్రీ శక్తి పేరుతో అందిస్తున్న ఉచిత బస్సు సదుపాయం ఎలా ఉందని మహిళలను అడిగి తెలుసుకున్నారు.. తాము ఎక్కడికి వెళ్లినా ఇబ్బంది లేకుండా... ఫ్రీ బస్సులో వెళ్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు మహిళలు.. చక్కటి సదుపాయాన్ని కల్పించారని.. తమకు డబ్బులు ఆదా అవుతున్నాయని సీఎంతో చెప్పారు.. హంద్రీ -నీవా ద్వారా కృష్ణా నీళ్లు తొలిసారి కుప్పానికి వచ్చాయి.. కాల్వల్లో నీళ్లు చూశారా..? చెరువులు నిండాయా అంటూ చంద్రబాబు ఆరా తీశారు.. తొలిసారి కుప్పానికి కృష్ణమ్మ వచ్చిందని... చాలా సంతోషంగా ఉందని రైతులు, మహిళలు సీఎం చంద్రబాబు తెలియజేశారు.. మొత్తంగా సీమ ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. కరువు సీమ కాదు.. ఇక నుంచి ధాన్య రాశులను పండించే రతనాల సీమ అని చెప్పుకునే సమయం ఆసన్నమైంది. కృష్ణా జలాలు కుప్పం చేరటమే అందుకు కారణం. శ్రీశైలం నుంచి కృష్ణమ్మ వందల కిలోమీటర్లు ప్రయాణించి కుప్పం చేరుకోవడంతో రాయలసీమలో ఆనందోత్సాహం నెలకొంది. కృష్ణా జలాలు కుప్పం చేరిన వేళ జలహారతి ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు శుక్రవారం కుప్పం చేరుకున్నారు. సీమకు పూర్తిస్థాయిలో కృష్ణా జలాలు అనే కలను చంద్రబాబు నిజం చేశారని కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. సీమలో ప్రాజెక్టులు మొదలుపెట్టింది ఎన్టీఆర్ అయితే వాటిని ముందుకు తీసుకువెళ్లింది చంద్రబాబు నాయుడు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అతి తక్కువ వర్ష పాతం ఉండే సీమ జిల్లాల్లో నీళ్లతోనే సీమ ప్రజల స్థితిగతులు మారుతాయని హంద్రీ నీవాకు ఉమ్మడి రాష్ట్రంలో 1999 జులై 9 చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2014 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం భారీ ఎత్తున సాగునీటి ప్రాజెక్టులపై నిధుల ఖర్చు చేయడం వల్ల ఇవాళ హంద్రీనీవా నీళ్లు చిత్తూరు జిల్లాలో చివరి ఆయకట్టు-భూములకు చేరాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే లక్ష్యంతో హంద్రీనీవా ప్రాజెక్టుపై 2014-19 మధ్య రూ.4,183 కోట్లు- ఖర్చు పెట్టారు చంద్రబాబు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రికార్డు స్థాయిలో కేవలం 100 రోజుల్లో మెయిన్ కెనాల్ విస్తరణ, లైనింగ్ పనులు పూర్తి చేసి ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 3850 క్యూసెక్కులకు పెంచారు. హంద్రీనీవా కాల్వ విస్తరణ పనులతో సీమకు జలకళ వచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తంగా 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందుతోంది. విస్తరించిన కాల్వల ద్వారా పరుగులు పెడుతున్న కృష్ణమ్మ 19 నియోజకవర్గాలను తాకింది. 10 రిజర్వాయర్‌లను నింపుతోంది. కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, పత్తికొండ, అనంతపురం జిల్లాలో జీడిపల్లి, పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లు నిండాయి. సత్యసాయి జిల్లాలో మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి... అన్నమయ్య జిల్లాలోని శ్రీనివాసాపురం, అడవిపల్లి రిజర్వాయర్లు నిండుతున్నాయి. అలాగే గాజుల దిన్నెకు నీరు చేరింది. హంద్రీనీవా ఆయకట్టు-లో చిట్ట చివరి జిల్లా చిత్తూరు. చిత్తూరు జిల్లాలో 16 లక్షల ఎకరాల సాగుభూమి ఉన్నా... కేవలం 6 లక్షల ఎకరాలకే సాగునీరు అందుతోంది. మిగిలిన 10 లక్షల ఎకరాలకు సాగునీరిస్తే...రైతన్నకు నీటి కొరతే ఉండదు. హంద్రీనీవా రెండో దశ పనులు పూర్తి చేసి జిల్లాలోని 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు ప్రభుత్వం ఇవ్వనుంది. పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, పూతలపట్టు-, చిత్తూరు, జీడీ నెల్లూరు నియోజకవర్గాల ప్రజలకు దీంతో ప్రయోజనం కలుగుతుంది. జులై 17న కర్నూలు జిల్లా మల్యాల ఎత్తిపోతల నుంచి నీటిని విడుదల చేశారు. నాటి నుంచి హంద్రీనీవా కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మ 738 కి.మీ ప్రయాణించి కుప్పానికి చేరింది. పరమ సముద్రంలో సీఎం చంద్రబాబు కృష్ణా జలాలకు హారతి ఇవ్వడంతో కల నెరవేరింది. ప్రభుత్వ చిత్తశుద్ధి సంకల్పంతో 40 టీ-ఎంసీల నీటిని ఒక్క హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా రాయల సీమ జిల్లాలు వినియోగించుకోనున్నాయి. చెరువులు అన్ని నింపే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది. దీంతో సీమలో భూగర్భ జలాలు పెరగనున్నాయి. ఉద్యాన పంటల ఉత్పత్తులు పెంచేందుకు సాగునీటి సౌకర్యం ఎంతో దోహదం చేయనుంది.

## ప్రజలకు అనుగుణంగా పాలన : నారాయణ

**నెల్లూరు, ఆగస్టు 30 (నినాదం):** ప్రజల అవసరాలు తెలుసుకుని అందుకు అనుగుణంగా ముందుకు సాగడమే ప్రజాపాలన అని ఏపీ పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. కూటమి ప్రభుత్వం అదే చేస్తోందని అన్నారు. వైకాపా ప్రభుత్వం మాపై కక్షతో అనేక పనులు నిలిపివేసిందని నారాయణ అన్నారు. నెల్లూరులో పర్యటించిన ఆయన.. 15వ డివిజన్ రౌండ్ తూము వద్ద రోడ్డు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు ఏం కావాలో తెలుసుకొని పనిచేయడమే సుపరిపాలన అన్నారు. నెల్లూరులో 6 వాటర్ ఎ÷-లాంట్ల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామని చెప్పారు. జిల్లాలో మరికొన్ని బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైల్వే ట్రాక్‌ల వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. డ్రెయిన్ల పనులు 10 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు.

**చరిత్ర సృష్టించాలన్నా, తిరగ రాయాలన్నా**

## బాలయ్యకే సాధ్యం : నారా లోకేష్



**అమరావతి,ఆగస్టు 30 (నినాదం):** నటరత్న నందమూరి బాలకృష్ణ సినీ ఇండస్ట్రీలోకి ప్రవేశించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. తాజాగా ఏపీ విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ కూడా బాలయ్యకు అభినందనలు తెలియజేశారు. 'మాస్ హీరో అయిన బాలకృష్ణ గారికి డైహార్ట్ ఫ్యాన్స్ ఉంటారు. బాలకృష్ణ గారు ఎప్పుడూ యంగ్ స్టర్. వారి ఎనర్జీ మాకు లేదు. ఆ సీక్రెట్ ఏంటో ఇప్పటి వరకు మాకు తెలియలేదు. రకరకాల జోనర్ల సినిమాలు, పాత్రల్లో నటించి మెప్పించటం బాలయ్యకే సాధ్యం. బాలయ్య బాబు నిర్మాతలు, దర్శకుల డ్రీమ్ హీరో. ప్రస్తుత ఓటిటి ఏరాలో కూడా బాలయ్య మెప్పిస్తున్నారు అని లోకేష్ ప్రశంసించారు. బాలయ్య బాబు భోళా మనిషి అని, మంచి మనస్సున్న మా మావయ్య అని లోకేష్ అన్నారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా ఒకేలా ఉండగలరని, ప్రజలకు అండగా నిలబడటంలో ముందుండే వ్యక్తి అని ప్రశంసించారు. బాలయ్య లాంటి వ్యక్తి సినిమా ఇండస్ట్రీలో మరొకరు లేరని, బాలయ్య బాబు అన్ స్టాపబుల్ అని, తనకు ముద్దుల మావయ్యగా ఈ అవకాశం ఇచ్చిన బాలకృష్ణ గారికి ధన్యవాదాలని లోకేష్ పేర్కొన్నారు.

## అమ్మో.. ఎంత పెద్ద లడ్డో..!

**గుంటూరు, ఆగస్టు 30 (నినాదం):** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా భక్తులు వివిధ రకాలుగా తమ భక్తిని ప్రదర్శిస్తూ.. ఉంటారు. కోరిన కోరికలు తీర్చాలని వినాయకుడికి ప్రసాదాలతో.. వివిధ రకాల మొక్కులతో వేడుకుంటారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం గాజువాక లంక గ్రౌండ్స్‌లో లక్ష చీరలతో ఏర్పాటు చేసిన సుందర వస్త్ర మహా గణపతికి నైవేద్యంగా 2 వేల కిలోలు భారీ లడ్డూను నిర్వాహకులు తయారు చేయించి వారి భక్తిని చాటుకున్నారు. 2 టన్నుల లడ్డూ చూసిన ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తెనాలిలో ఓ స్వీట్ షాపు నిర్వాహకులు వినాయక చవితి సందర్భంగా భారీ లడ్డూను తయారు చేశారు. సుల్తానాబాద్‌లోని మిర్చి స్నాక్స్ నిర్వాహకులు 2 టన్నుల( 2వేల కిలోలు) బరువుతో శివలింగాకృతిలో భారీ లడ్డూని రూపొందించారు. గాజువాక లంక గ్రౌండ్స్‌లో లక్ష చీరలతో ఏర్పాటు చేసిన సుందర వస్త్ర మహా గణపతికి నైవేద్యంగా ఈ లడ్డూను సిద్ధం చేయించినట్లు తయారీదారులు ఉప్పల కిషోర్ తెలిపారు. తమ ఖారా?నాలోని 15 మంది సిబ్బంది నాలుగు రోజుల పాటు శ్రమించి, 8 అడుగుల ఎత్తు, 2 వేల కిలోల బరువు గల శివలింగం లడ్డూని తయారు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇది దేశంలోనే అత్యంత భారీ లడ్డూ అని, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కూడా లభించే అవకాశం ఉందన్నారు. తాము గతంలో కూడా విభిన్న ఆకృతులలో లడ్డూలు, మహా ప్రసాదాలను తయారు చేసినట్లు తెలియజేశారు. కాగా భారీ లడ్డూను తిలకించేందుకు పరిసర ప్రాంత ప్రజలు తరలివస్తున్నారు. ప్రత్యేక వాహనంలో గాజువాకకు ఈ భారీ లడ్డూను తరలించినట్లు ఆయన స్పష్టం చేశారు.

**మాజీ మంత్రి కొడాలి నాని**

**బెయిల్ షరతులకు నేటితో విముక్తి**



**గుడివాడ,ఆగస్టు 30 (నినాదం):** వైసీపీ నేత, కృష్ణాజిల్లా గుడివాడ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొడాలి నానికు నేటితో విముక్తి లభించింది. ఆయన బెయిల్ షరతుల గడువు నేటితో పూర్తి అయింది. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు వస్త్ర దుకాణంపై దాడి కేసులో బెయిల్ పొందిన కొడాలి నానికు.. గుడివాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ప్రతి మంగళ, శనివారాల్లో సంతకాలు చేయాలని షరతులు విధించి కోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కొడాలి నాని పై కోర్టుకు వెళ్లడంతో శనివారం ఒక్కరోజు సంతకాలు చేస్తే సరిపోతుందంటూ హైకోర్టు షరతుల్ని సడలించింది. అయితే, రెండు నెలలపాటు సంతకాలు చేయాలన్న హైకోర్టు ఆదేశాలు కూడా నేటితో పూర్తి అవడంతో కొడాలి నాని ఇక పోలీస్ స్టేషన్ కు వెళ్లి సంతకాలు చేయాల్సిన పరిస్థితి లేకుండాపోయింది.

# సగానికి తగ్గిన టమోటా ధర..



**మదనపల్లె(చిత్తూరు), ఆగస్టు 30 (నినాదం):** మదనపల్లె టమోటా మార్కెట్‌కు అనంతపురం టమోటా మార్కెట్ దెబ్బతీస్తోంది. గత పది రోజులుగా మదనపల్లె మార్కెట్‌కు విక్రయానికి వస్తున్న టమోటా 80 శాతం తగ్గిపోగా, ధరలు కూడా సగానికి సగం తగ్గిపోయాయి. దీంతో రైతులు బేర్ మంటున్నారు. నిత్యం 1500 టన్నుల టమో టా విక్రయానికి వస్తున్న పరిస్థితి నుంచి నేడు కేవలం నిత్యం 90 టన్నుల టమోటా మాత్రమే విక్రయానికి వస్తుండటం చూస్తే మదనపల్లె మార్కెట్ ఎంత అధ్వాన స్థితికి దిగజారిందో.. తద్వారా మార్కెట్ వార్షిక ఆదాయంపై పెద్ద దెబ్బపడుతోంది.

**మదనపల్లె మార్కెట్ దినదినం తిరోగమనం**

దేశంలోనే అతి పెద్ద టమోటా మార్కెట్‌గా పేరొం దిన మదనపల్లె దినదిన ప్రవర్ధమానం కాకుండా దినదినం తిరోగమనంలోకి పడిపోతోంది. 11 ఎకరాల విస్తీర్ణం వున్న మార్కెట్ ఇరుకుగా మారిపోవడం, లారీ యూనియన్ల మధ్య సమ స్యలు, టమోటా లోడింగ్, అన్‌లోడింగ్, జాక్‌పాట్ విధానం, క్రేట్లకు బాడుగ తీయడం, ముఖ్యంగా ఉదయం మార్కెట్‌కు వచ్చిన రైతులకు టమోటా ట్రేడర్స్ సాయంత్రం వరకు టమోటా బిల్లులకు డబ్బులు చెల్లించకోవడం వెరసి మదనపల్లె మార్కెట్ దినదినం అథోగతి పాలవుతోంది. దీంతో టమోటా సీజన్ ముగియకనే ఇక్కడికి ప్రతిరోజు 1500 టన్నులు నుంచి నేడు 90 టన్నుల వరకు మాత్రమే విక్రయాలకు పడి పోయాయి. ఈ దెబ్బకు ఇక్కడి టమోటా ధరలు కూడా సగానికి సగం పడిపోతున్నాయి. గత రెండు నెలలుగా మదనపల్లె మార్కెట్‌లో టమోటా ధరలు నిలకడగానే సాగాయి. కాని నాలుగు రోజులుగా ధరలు ఒక్కసారిగా సగానికి సగం పడిపోయాయి. గత జూన్, జూలై నెలలు, ఆగస్టు 22వ తేది వరకు మదనపల్లె మార్కెట్‌లో టమోటా గరిష్టంగా కిలో రూ.50 పలుకగా, కనిష్టగా కిలో రూ.20 పలికాయి. ఈ ధరలు పలికిన సమయంలో రైతులకు గిట్టుబాటు ధరలతో పాటు కాస్త లాభాలు కళ్ల చూసారు. కాని ఆగస్టు 22వ తేది నుంచి మదనపల్లె మార్కెట్‌లో టమోటా ధరలు ఒక్కసారిగా పతనం అవుతు న్నాయి. గరిష్ట ధర కిలో రూ. 50 నుంచి రూ.44, రూ.36, రూ.26కు పడిపోయాయి. అలాగే కనిష్ట ధర కూడా కిలో రూ.20 నుంచి కిలో రూ.15 వరకు పడిపోయింది. అంతేకాకుండా జూన్ నెలలో ప్రతిరోజు మార్కెట్‌కు సరాసరిన 1500 మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి రాగా, జూలైలో వెయ్యి మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి వచ్చింది. కాని జూలై 18వ తేది నుంచి మార్కెట్‌కు వచ్చే టమోటా గణనీయంగా తగ్గిపోతూ ప్రతి రోజు 500 మెట్రిక్ టన్నులకు పడిపోయింది. ఇదే ఆగస్టు నెల ప్రారంభంలో 300 టన్నులు రాగా నేడు కేవలం 96 మెట్రిక్ టన్నులకే టమోటా దిగుబడి పడిపోయింది.

**అనంతపురం సీజన్ ఎఫెక్ట్...**

అనంతపురం జిల్లాలో జూలై నెల నుంచి టమోటా దిగుబడి ప్రారంభమవుతుంది. ముఖ్యంగా వేడి వాతావరణం పోయి, వాతావరణం చల్లబడటం, వర్షాలు పడుతుండటంతో అక్కడి టమోటా తోటల్లో దిగుబడి ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో వ్యాపారులు కూడా మదనపల్లె మార్కెట్‌ను వదిలేసి అనంతపురం మార్కెట్‌కు పోలోమంటూ వెళ్లి పోయారు. ఇది కూడా మదనపల్లె మార్కెట్‌లో ధరలు పడిపోవడానికి ఒక కారణంగా చెబుతు న్నారు. అంతేకాకుండా ఇక్కడ సీజన్ ముగుస్తుండడంతో టమోటా నాణ్యత కూడా తగ్గిపోవడం మరో కారణంగా చెప్పవచ్చు. అంతేకాకుండా మదనపల్లె మార్కెట్‌తో పోలిస్తే ములకలచెరువు, అంగళ్లు, గుర్రంకొండ మార్కెట్‌లో రైతులు తీసు కొచ్చే టమోటాలకు మంచి ధరలు వస్తుండటంతో రైతులు ఈ మార్కెట్‌లకే ప్రాధాన్యత ఇస్తూ మదన పల్లె మార్కెట్‌ను తిరస్కరిస్తున్నారు. దీంతో దేశంలో అతిపెద్ద టమోటా మార్కెట్‌గా పేరుపొందిన మదనపల్లె మార్కెట్ తిరోగమనంలో పడిపోతోంది. మదనపల్లె టమోటా మార్కెట్‌కు గతంలో మార్కెట్ సెస్సు కింద వసూలు చేయడం, మండీల అద్దెలు, మార్కెట్‌లో షాపింగ్ గదుల అద్దె కలిపి వార్షిక ఆదాయం రూ.3కోట్లకు పైగా వచ్చేది. భవిష్యత్‌లో పై తెలిపిన పరిస్థితులు కొనసాగితే మదనపల్లె మార్కెట్ వార్షిక ఆదాయం గణనీయంగా పడిపోయి, సగానికి సగం తగ్గిపోయినా ఆశ్చర్యపడనవసరం లేదని విశ్లేషకుల అభిప్రాయం.

## బిలాస్‌పూర్-యల్హాంక మధ్య ప్రత్యేక రైలు



**గుంతకల్లు(అనంతపురం), ఆగస్టు 30 (నినాదం):** దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సెప్టెంబరు 9 నుంచి నవంబరు 19 వరకూ బిలాస్‌పూర్-యల్హాంక (వయా గుంతకల్లు) మధ్య ఓ ప్రత్యేక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బిలాసపూర్-యల్హాంక ప్రత్యేక రైలు (08261) సెప్టెంబరు 9 నుంచి నవంబరు 18 వరకూ ప్రతి మంగళవారం ఉదయం 11 గంటలకు బిలాసపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 7 గంటలకు యల్హాంకకు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (08262) సెప్టెంబరు 10 నుంచి నవంబరు 19 వరకూ ప్రతి బుధవారం ఉదయం రాత్రి 9 గంటలకు యల్హాంకలో బయలుదేరి శుక్రవారం ఉదయం ఐదున్నరకు బిలాసపూర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు భటపర, రాయపూర్, దుర్గ్, రాజనంద్‌గావ్, డోంగర్‌ఘర్, గోండియా, వాడ్సా, చంద ఫోర్ట్, బాలార్షా, సిర్పూర్ కాగజ్ నగర్, మంచిర్యాల, ఖాజీపేట, చర్లపల్లి, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, గుత్తి, అనంతపురరం, ధర్మవరం, హిందూపురం స్టేషన్ల మీదుగా యల్హాంకకు చేరుతుందన్నారు.

**ప్యాసింజరు రైళ్ల రద్దు..**

కర్ణాటకలోని బళ్లారి, తోరణగల్లు స్టేషన్ యార్డుల్లో జరుగుతున్న ఎలెక్ట్రికల్, సిగ్నలింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్ పనుల వల్ల గుంతకల్లు మీదుగా వెళ్లే పలు ప్యాసింజరు రైళ్లను రద్దు పరచినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు-చిగ్జాజుర్-గుంతకల్లు ప్యాసింజరు (57415/16) రైలును సెప్టెంబరు 3న రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

**పాక్షికంగా రద్దయిన రైళ్లు**

తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు (57405)ను సెప్టెంబరు 2న, దీని తిరుగు ప్రయాణపు రైలు (57405)ను సెప్టెంబరు 3న గుంతకల్లు-కదిరిదేవరపల్లి సెక్షన్‌లో రద్దుపరచి, కేవలం గుంతకల్లు-తిరుపతి మధ్యన నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. హుబ్లి-గుంతకల్లు ప్యాసింజరు (56911) రైలును, దీని తిరుగు ప్రయాణపు రైలు (56912)ను సెప్టెంబరు 3న గుంతకల్లు-మునీరాబాద్ సెక్షన్‌లో రద్దుపరచి, మునీరాబాద్-హుబ్లి సెక్షన్‌లో మాత్రమే నడుపుతామన్నారు. హుబ్లి-తిరుపతి (57402) ప్యాసింజరును సెప్టెంబరు 3న గంటన్నరపాటు ఆలస్యంగా నడపనున్నట్లు వివరించారు.

**నాందేడ్-ధర్మవరం రైలు రద్దు**

హైదరాబాద్ రైల్వే డివిజన్‌లో వర్షపు నీరు ట్రాక్‌పై ప్రవహించిన కారణంగా నాందేడ్-ధర్మవరం-నాందేడ్ స్పెషల్ ఫేర్ ఎక్స్‌ప్రెసను ఒక ట్రిప్పు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాందేడ్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (07189) రైలును 29న దీని తిరుగు ప్రయాణపు రైలు (07190)ను ఈ నెల 31న రద్దుపరచినట్లు తెలియజేశారు.

## ప్రకృతి విధ్వంసానికి పరాకాష్ట !



ప్రకృతి విధ్వంసంపై ప్రజల్లో చైతన్యం కానరావడం లేదు. మన చేజేతులా ప్రకృతిని నాశనం చేస్తున్నాం. ఫలితం అనుభవిస్తున్నాం. మనం జీవించి ఉండగానే ఎన్నో విపత్తులను చూస్తున్నాం. ఎక్కడిక్కడ చెరువుల విధ్వంసం, ఆక్రమణలతో ఇప్పుడు ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరుతోంది. ఎందుకిలా జరిగిందో, జరుగుతుందో ఆలోచించడం లేదు. ఇల్లూవాకిలీ, పొలంగట్రా నీట మునిగాక ప్రభుత్వాలను నిందిస్తూ సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం. ప్రతి గ్రామంలో వందల ఏళ్ల క్రిం ఉన్న చెరువులును గుట్టలను, వాగులను వంకలను మాయం చేస్తున్నాం. మనకు లాభం జరిగిందా లేదా అన్న కోణంలోనే ఆలోచన చేస్తున్నాం. అదుకే ప్రకృతి ప్రకోపించి మన ఇళ్లనే మనముందే ముంచేస్తోంది. అందుకు తాజా వర్షాలే నిదర్శనం. చెరువుఉల, వంకలు, వాగులు అలాగే ఉండివుంటే వచ్చిన నీరు వచ్చినట్లు మళ్లీ పోయేది. దానికి దారిలేకుండా చేసిన పాపానికి మనం ఫలితం అనుభవిం చాల్సిందే. తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరాది రాష్ట్రాలు జలప్రళయంతో విలవిల్లాడుతున్నాయి. నిజామాబాద్, మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో వరదలకు ప్రకృతి విధ్వంసం కారణమని గుర్తించాలి. ఇకపోతే క్లౌడ్ బరస్ట్‌తో కుంభవృష్టి కురుస్తోంది. ఉత్తరాదిలోని ఉత్తరాఖండ్ లోని రుద్రప్రయాగ్, చమోలీ జిల్లాల్లో కుంభవృష్టి అనేక గ్రామాలను ముంచెత్తుతోంది. ఉత్తరాఖండ్‌లో తాజాగా మరోసారి క్లౌడ్‌బర్స్ సభవించింది. అనేక చోట్ల ఇళ్లుకూలి అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల్లో అనేక జిల్లాలకు సంబంధాలు తెగిపోయాయి. జమ్మూకశ్మీర్‌లో ఇప్పటివరకు 40 మంది ప్రాణాలు కోల్పోయారు. శ్రీనగర్, అనంత్‌నాగ్‌ల్లో నదులు ప్రమాదస్థాయిని మించి ఉప్పొంగడంతో, గండ్లుపడి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంజాబ్‌లో గ్రామాలన్నీ జలదిగ్బం ధంలో చిక్కుకున్నాయి. వ్యవసాయ భూములు అదృశ్యమయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీలో కూడా భారీ వర్షపాతం నమోదైంది. యమునా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. నైరుతి పవనాల ప్రభావం తీవ్రంగా ఉంటోంది. ఈ ఆగస్టులో ఎప్పుడూ లేనంతగా క్లౌడ్ బరస్ట్ కారణంగా భారీ వర్షాలు ప్రారంభమయ్యాయి. హిమాలయ పర్వత వాలు ప్రాంతాలు ఒరిగిపోయాయి. మైదానప్రాంతాల్లో గట్లు దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంటపొలాలు నీట మునిగాయి. రైతన్నలు పూర్తిగా రోడ్డున పడ్డారు. తక్కువ సమయాల్లో ఎడతెరిపిలేని కుంభవృష్టి స్థానిక నేలకోతను పెంచుతుంది. కొండచరియలు విరిగిపడి సమీప నివాసాలను ధ్వంసం చేస్తున్నాయి. ఊళ్లకు ఊళ్లే కొట్టుకు పోతున్నాయి. పదుల సంఖ్యలో జనం మృత్యువాత పడుతున్నారు. ఒఇలా ఎందుకు జరుగుతుందో ప్రజలు ఆలోచించాలి. ప్రభుత్వాలు చర్చించాలి. కార్యాచరణకు దిగాలి. ప్రకృతి వైపరీత్యాల నుంచి అనుభవాలు నేర్చుకోవడం లేదు. మనం చేస్తున్న విధ్వంసం గురించి మాట్లాడకుండా, వాటిని విస్మరించి ప్రకృతి విపత్తును అసాధారణమైనదిగా చర్చిస్తున్నాం. కొండచరియలు విరిగి పడడానికి కూడా మనం చెట్లను తొలగించడం, బండలను పగుల గొట్టడం అని తెలుసుకోవడం లేదు. దేశంలోని 16 రాష్ట్రాలు, హిమాలయ రీజియన్ లోని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు, ఈశాన్యంలోని హిమాలయ పర్వత దిగువ భాగాలు, పశ్చిమ కనుమలు ఇవన్నీ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలుగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనంలో గుర్తించింది. రోడ్లు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు, ఎలాంటి ప్రణాళిక లేకుండా సాగించే కొండ క్వారీ పనుల కారణంగా కొండచరియలు విరిగిపడడానికి కారణమవుతున్నాయని హెచ్చరించింది. హిమాలయ పర్వత ప్రాంతాల్లో ఇష్టం వచ్చినట్లుగా చెట్లను కూల్చివేశారు. దీంతో కొండలపై ఉన్న సారవంతమైన మట్టి వర్షాలకు కొట్టుకుపోయి, కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతోపాటు- పంట పొలాల్లోకి, ఇళ్లలోకి బురద ప్రవాహంలా వచ్చిచేరుతోంది. ఎన్నో ప్రాణాలు జలసమాధి అవుతున్నాయి. ఇవన్నీ స్వయం కృతాపరాధాలే. పర్యావరణ సున్నితమైన హిమాలయ రాష్ట్రాల్లో కొండవాలు ప్రాంతాలు అత్యంత బలహీనమైనవని, వాటిని తిరిగి పొందలేమని పర్యావరణ శాస్త్రవేత్తలు ఎన్ని హెచ్చరికలు చేసినా పెడచెవిన పెడుతున్నాం. ప్రజలు, ప్రభుత్వం చేస్తున్న విధ్వంసంగా దీనిని గుర్తించాలి. ప్రభుత్వాలు ఈ విధ్వంసాన్ని అడ్డుకోవడం లేదు. అలాగని ప్రజలు కూడా తమ వైఖరి మార్చుకోవడం లేదు. అంతెందుకు మనదగ్గర పోడు వ్యవసాయంతో అడవులను నరికివేస్తున్నాం. దీనిని అడ్డుకుని అడవులను పెంచాల్సిన బాధ్యతలను విస్మరించి, పోడు రైతులను ప్రోత్సహిసతున్నారు. భారీ వర్షాల కారణంగా భూమి కొతకు గురికావ డంతో ఆనకట్టల్లో పూడిక పేరుకుపోతోంది. వరదలతో దిగువ ప్రవాహాలు పెరుగుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు అదే పనిగా సంభవిస్తున్నాయన డానికి ఇదంతా మానవ తప్పిదమని గుర్తించడం లేదు. అవసరాల కోసం అడవులను నరికివేస్తున్నారు. కొండవాలు ప్రాంతాలను తొలగించడం, పరీవాహక ప్రాంతం కుదించుకుపోవడం, జనాభా పెరిగిపోతుండడం వీట న్నిటి ఫలితం ఎంతటి విధ్వంసాన్ని కలిగిస్తుందో ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఈ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఒక ప్రణాళి కతో ప్రకృతి విధ్వంసాన్ని ఆపితే..కొంతయినా తగ్గించు కోవడం సాధ్యం కాగలదు. తరచుగా సంభవిస్తున్న ఈ విపత్తుల నివారణకు ముందస్తు ప్రణాళికలు ఆలోచించడం లేదు. ఇప్పటికీ సమయం మించిపోలేదు. దీనికంతటికీ కారణమైన పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. చెట్లను నరకడం, గుట్టలను పిండిచేయడం, కొండవాలు ప్రాంతాలను ధ్వంసం చేసయడం, అడవులను నరకడం తక్షణం ఆపాలి. కాలువుల, చెరువులను పునరుద్ధరించాలి. అలాగే జనాభా నియంత్రణ కూడా జరగాలి. ఇదంతా పెరుగుతున్న జనాభా వల్ల కూడా జరుగుతోంది. మనిషి తన మనుగడ కోసం ప్రకృతిని విధ్వంసం చేస్తున్నాడని గుర్తించి కఠిన నివారణ చర్యలకు పూనుకోవాలి. అప్పుడే ఈ విధ్వంసం కొంతయినా ఆపగలం.

ఎడిటోరియల్



# మారుతున్న అంతర్జాతీయ సమీకరణాలు

### మోడీ చైనా పర్యటనపై సర్వత్రా ఆసక్తి

### శాశ్వత మిత్రులు, శతృవులు ఉండరన్న రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ:** ట్రంప్ సుంకాల బాదుడు వేళ అంతర్జాతీయ సమీకరణాలు మాతరుతు న్నాయి. మోడీ చైనా పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా శాశ్వత మిత్రులు, శతృవులు ఉండరని రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నారు. ఆయా దేశాల మధ్య శాశ్వత మిత్రత్వం.. శత్రుత్వం అంటూ ఏమీ ఉండదని, అలాగే శాశ్వత మిత్రులు కాని, శత్రువులు కాని ఉండరని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కేవలం ఏదేశానికి తగ్గట్లుగా ఆ దేశానికి ఉపయోగపడే శాశ్వత ప్రయోజనాలే ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే రక్షణ రంగంలోఆత్మనిర్భరత సాధించడం అత్యావశ్యకమని ఓజాతీయ మీడియా సదస్సులో పాల్గొని మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి-ఆపరేషన్ సీందూర్ తదనంతర పరిణామాలు, ట్రంప్ టారిఫ్‌లు, ప్రధాని మోదీ చైనా పర్యటన నేపథ్యంలో భారత్ అనుసరిస్తోన్న వైఖరిని వెల్లడించారు. ప్రపంచం వేగంగా మారుతోంది. అదే సమయంలో కొత్త సవాళ్లు పుట్టుకొస్తున్నాయి. మహమ్మారులు, ఉగ్రవాదం, ప్రాంతీయ ఘర్షణలు వంటి వాటితో ఈ శతాబ్దం అత్యంత సవాలుతో కూడి ఉందని అర్థమవుతోంది. ఈనేపథ్యంలో మన వ్యూహాత్మక అవసరాల దృష్ట్యా.. ఆత్మనిర్భరత అనేది అత్యావశ్యకం అన్నారు. మనకు శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరు. శాశ్వత ప్రయోజనాలే ఉంటాయి. భారత్ ఎవరినీ శత్రువుగా పరిగణించదని కూడా వెల్లడించారు. మన రైతులు, వ్యాపారవేత్తల ప్రయోజనాలే మనకు ముఖ్యం. ప్రస్తుతం మారుతున్న భౌగోళిక రాజకీయాల కారణంగా రక్షణ పరంగా విదేశాలపై ఆధారపడటం సరైన ఎంపిక కాదని స్పష్టమవుతోందని అన్నారు. స్వావలంబన అనేది మన ఆర్థిక వ్యవస్థకు, భద్రతకు అత్యవసరం. 2014లో మన రక్షణ రంగం ఎగుమతుల విలువ రూ.700 కోట్లు-. ఇప్పుడది రూ.24వేల కోట్లకు చేరింది. ఈ గణాంకాలు చూస్తుంటే.. భారత్ ఒక కొనుగోలుదారుగానే మిగలకుండా ఎగుమతిదారుగా మారుతుందని వెల్లడవుతోంది. ఇక మన బలగాలు స్వదేశీ పరికరాలతో లక్ష్యాలపై కచ్చితత్వంతో చేసినదాడులు.. దూరదృష్టి, సమన్వయానికి నిదర్శనం. అలాంటి సన్నద్ధత లేకపోతే ఏ మిషన్ విజయవంతం కాదని మంత్రి రాజస్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. భారత్‌ను మిత్ర దేశం అంటూనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాల మోత మోగించారు. రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు గతంలో విధించిన 25 శాతానికి అదనంగా మరో 25 శాతం సుంకాలు విధించారు. అవి ప్రస్తుతం అమలవుతున్నాయి. ఈ తరుణంలోనే ఏడేళ్ల తర్వాత తొలిసారి ప్రధాని మోదీ చైనా పర్యటనకు వెళ్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఆసియాలో బలమైన కూటమి ద్వారా అమెరికాను ఎదుర్కోవాలన్న అభిప్రాయం కూడా బలపడుతోంది. భారత్, చైనాలు సఖ్యతగా ఉంటే ఎలాంటి ఒత్తిళ్లనైనా తట్టుకోవచ్చి అంటున్నారు.

# జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి లెఫ్ట్ మద్దతు

### ఆయన గెలుపు అవసరముందని వెల్లడి.. ఐదు వామపక్షాల విజ్ఞప్తి



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 30(నినాదం):** ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేస్తున్న జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని వామపక్షాలు పూర్తిగా బలపరిచాయి. ఆయనను తాము పూర్తిగా బలపరుస్తున్నామని సిపిఐ (ఎం), సిపిఐ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్‌పి), అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి) తెలిపాయి. అన్నింటికన్నా జాతీయ ప్రయోజనాలే మిన్నగా భావించి, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని చేసిన ప్రమాణాన్ని గుర్తు చేసుకుని, జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు- వేయాల్సిందిగా ఐదు వామపక్షాల నేతలు ఉప రాష్ట్రపతిని ఎన్నుకునే పార్లమెంట్ సభ్యులను కోరారు. ఈ మేరకు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఎఐఎఫ్‌బి ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్ సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ప్రముఖ న్యాయ నిపుణుడు, భారత రాజ్యాంగం కీలక విలువలైన ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సమానత్వం పట్ల ఆయనకు గల అచంచలమైన నిబద్ధతకుగానూ ప్రజల్లో గౌరవాభిమానాలు మెండుగా వున్నాయి. ఉప రాష్ట్రపతి ఎన్నిక అంటే కేవలం గణాంకాలు కాదు, భవిష్యత్ భారతం గురించి ప్రాథమికంగా రెండు భిన్నమైన అభిప్రాయ ధోరణుల మధ్య గల పోటీని ఇది ప్రతిబింబిస్తోంది. సెక్యులరిజాన్ని పరిరక్షిస్తూ రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని మన దేశం కొనసాగించాలా లేక హిందూత్వ నియంతృత్వ దేశం స్థాయికి దిగజారిపోవాలా అనేది తేల్చుకోవాల్సి వుంది. ఒక పక్క మన సమకాలీన సంస్కృతిని పరిరక్షించేందుకు చేస్తున్న పోరాటం. మరోపక్క ఉప రాష్ట్రపతి, ఎన్నికల కమిషన్, గవర్నర్లు, తదితర రాజ్యాంగ పదవులను దుర్వినియోగం చేయడం ద్వారా నియంతృత్వాన్ని అమలుచేసేందుకు, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు బిజెపి నేతృత్వంలో ఎన్‌డివి ప్రభుత్వం సాగిస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటించేందుకు చేస్తున్న పోరాటం ఇదని వామపక్షాలు ఆ ప్రకటనలో పేర్కొన్నాయి. అందువల్ల అన్నింటికంటే జాతీయ ప్రయోజనాలే మిన్నగా భావించి ఈ ఎన్నికల్లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని వామపక్షాల నేతలు ఆ ప్రకటనలో కోరారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాల్సిం దిగా కోరుతూ లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలందరికీ లేఖలు రాయనున్నట్లు జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉప రాష్ట్రపతిగా పనిచేసే అవకాశం కల్పిస్తే, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముంబయిలో జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండియా బ్లాక్ కూటమికి వెలుపల గల వ్యక్తులు కూడా తనకు మద్దతునిచ్చేందుకు ముందుకు రావడం పట్ల కృతజ్ఞుడినని ఆయన చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ, దేశభవిష్యత్ కోసమే తనకు ఇండియా బ్లాక్ మద్దతిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆయన శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాకరే, ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్‌లను కలిశారు. సెప్టెంబరు 9న జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇరు పార్టీలు తనకు మద్దతి వ్వాలని కోరారు. ఈ భేటీలో మహారాష్ట్ర పిసిసి అధ్యక్షులు హర్షవర్ధన్, ముంబయి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వర్షి గైక్వాడ్, ఎన్‌సిపి ఎంపి సుప్రియా సూలే, పలువురు ఎంపిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తనకు అనుకూలంగా శివసేన, ఎన్‌సిపి ఎంపిలు ఓటు- వేసేలా సహకరించాలని సుదర్శన్ రెడ్డి కోరారు.

### ట్రంప్ సుంకాలు

# చట్టవిరుద్ధం

### అమెరికా ఫెడరల్ కోర్టు తీర్పు



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు చట్టవిరుద్ధమని అమెరికా ఫెడరల్ కోర్టు తీర్పునిచింది. టారిఫ్‌లను విధించేందుకు అధ్యక్షుడికి విస్తత అధికారాలు లేవని స్పష్టం చేస్తూ, ఓ ఫెడరల్ అప్పీల్స్ కోర్టు సంచలన వాఖ్యలు చేసింది. ఈ తీర్పుపై డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఇది అత్యంత పక్షపాతంతో కూడుకున్న నిర్ణయమని, దీనిపై సుప్రీం కోర్టులో అప్పీల్ చేస్తామని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. ఈ తీర్పు ఇలాగే కొనసాగితే, అది అమెరికాను నాశనం చేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. కాగా ట్రంప్ సుప్రీంకోర్టుకు అప్పీల్ చేసుకునేందుకు వీలుగా ఈ తీర్పు అమలును అక్టోబర్ 14 వరకు కోర్టునిలిపివేసింది. అప్పటివరకు ప్రస్తుతం ఉన్న టారిఫ్‌లు యథావిధిగా అమల్లో ఉంటాయి. ఈ తీర్పు సుప్రీంకోర్టులో కూడా నిలబడితే, భారత్‌పై విధించిన 25 శాతం ప్రతిస్పందన సుంకం రద్దవుతుంది.

# నేడు బ్రిటిష్ సైన్యానికి ఢిల్లీ వశమైన రోజు

### ప్రథమ స్వాతంత్ర్య సమర చారిత్రక నేపథ్యం

**ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ వలస పాలన, విధానాలకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప చారిత్రక సంఘటనే '1857 సిపాయిల తిరుగుబాటు'. బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ... బెంగాలు నవాబు, ఆయన ఫ్రెంచి మిత్రుల కూటమికి 1757 జూన్ 23న ప్లాసీ నిర్ణయాత్మక యుద్ధం జరగగా, తర్వాత వందేళ్లకు ఈ తిరుగు బాటు చోటు చేసుకుంది. దీనినే 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం', 'సిపాయిల పితూరి', 'విప్లవోద్యమం'గా చరిత్రకారులు అభివర్ణించారు. వీరసావర్కర్ తాను రచించిన గ్రంథం ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ లో సిపాయిల తిరుగుబాటు ప్రథమ స్వాతంత్ర్య సమరమని పేర్కొనడం జరిగింది.**

1857 మే 10 న మీరట్‌లో సిపాయిలతో మొదలైన తిరుగుబాటు, మే 11న సిపాయిలు ఢిల్లీ చేరుకొని చివరి మొగలు చక్రవర్తి బహదూర్ షా నివాసమైన ఎర్రకోటని ఆక్రమించడం, ఈ క్రమంలో తిరుగుబాటు దారుల ప్రధాన సైన్యానికి, బ్రిటిష్ వారికీ ఢిల్లీకి దగ్గరలోని బద్-కీ-సరై లో జరిగిన యుద్ధంలో బ్రిటిష్ సైనికులు మొదట తిరుగుబాటు దారులను ఢిల్లీకి పారద్రోలి తరువాత ఢిల్లీని ఆక్రమించారు. "ఢిల్లీ ఆక్రమణ జూలై 1న ప్రారంభమై ఆగస్టు 31 న పూర్తయింది".

తిరుగు బాటుకు ముఖ్య కారణ నేపథ్యాన్ని పరిశీలిస్తే...1856 డిసెంబరులో బ్రిటిష్ పాలకులు రాయల్ ఎన్ఫీల్డ్ (పి/53 లీ ఎన్ఫీల్డ్ రైఫిల్ 557 కాలిబర్) తుపాకీని ప్రవేశ పెట్టారు. దానికి వాడే తూటాల చివరి భాగాన్ని నోటితో కొరికి ఉపయోగించాల్సి ఉండేది. ఈ తుటాల చివర ఆవు పంది కొవ్వు పూసినట్లు వదంతులు వ్యాపించాయి. ఆవు హిందువులకు పవిత్రం, పంది ముస్లింలకు నిషేధం. కాబట్టి తూటాలను కొరకడాన్ని భారతీయ సిపాయిలు నిరాకరించారు. ఈ కొత్తరకం తుపాకులు ఇంగ్లండ్ లో ఆయుధ ఫ్యాక్టరీలో తయారయ్యేవి. ఇది హిందూ, ముస్లిం సైనికులను క్రైస్తవులుగా మార్చడానికి పన్నిన కుట్రగా భావించిన సిపాయిలు తిరుగుబాటుకు పూనుకున్నారు.



అయితే బ్రిటీష్ వారు ఆ తూటాలను మార్చామనీ, కొవ్వులను తేనె పట్టునుండి లేదా నూనె గింజల నుండి సొంతంగా తయారు చేసుకోవటాన్ని ప్రోత్సహించామని చెప్పినప్పటికీ అవి సిపాయిలకు నమ్మకాన్ని కలిగించలేక పోయాయి.

1857 మార్చినెలలో 34వ దేశీయ పదాతి దళానికి చెందిన మంగళ్ పాండే అనే సైనికుడు బ్రిటిష్ సార్జంట్ మీద దాడిచేసి ఆయన సహాయకుని గాయ పరచాడు. జనరల్ హెన్రీ మంగళ్ పాండేను మతపిచ్చి పట్టినవాడిగా భావించి, మంగళ్ పాండేను బంధించమని జమేదార్ని ఆజ్ఞాపించటం, జమేదార్, హెన్రీ ఆజ్ఞను తిరస్కరించటంతో తిరుగుబాటు ప్రారంభానికి అంకురార్పణ జరిగింది. బ్రిటీష్ వారు మంగళ్ పాండేను, జమేదారును ఏప్రిల్ 8న ఉరితీసి, దళం మొత్తాన్నీ విధులనుండి బహిష్కరించారు. మే 10న 11వ, 20వ అశ్వదళం సమావేశమై అధికారులను ధిక్కరించి 3వ పటాలాన్ని విడిపించారు. మే 11న ఇతర భారతీయులతో కలసి సిపాయిలు ఢిల్లీ చేరుకొని చివరి మొగలు చక్రవర్తి బహదూర్ షా నివాసమైన ఎర్రకోటని ఆక్రమించి చక్రవర్తిని ఢిల్లీసుల్తాన్ గా తిరిగి అధికారాన్ని స్వీకరించాల్సిందిగా వత్తిడి చేసారు. బహదూర్ షా తొలుత అంగీకరించక పోయినా, తరువాత ఒప్పుకొని తిరుగు బాటుకు నాయకత్వాన్ని వహించాడు. 1857 మే 10న మీరట్లోని బెంగాల్ అశ్విక దళంలో కొందరు సైనికులు ఢిల్లీ వైపు రావడంతో ప్రారంభమైన తిరుగుబాటు, వేగంగా ఉత్తర భారతం మొత్తానికి నిస్తరించింది. మీరట్, ఝాన్సీ, కాన్పూర్, లక్నోలు తిరుగుబాటు తలెత్తిన ముఖ్య ప్రాంతాలు. బ్రిటిష్ వారు



మొదట వేగంగా స్పందించనప్పటకీ, తరువాత తీవ్రమైన బల ప్రయోగంతో తిరుగు బాటుని అణచి వేసేందుకు యత్నించారు. వారు క్రిమియన్ యుద్ధంలో పాల్గొన్న పటాలాలనీ, చైనా వెళ్ళేందుకు బయలు దేరిన ఐరోపా పటాలాలని తిరుగు బాటును అణచి వేసేందుకు వినియోగించారు. తిరుగుబాటు దారుల ప్రధాన సైన్యానికి, బ్రిటిష్ వారికీ ఢిల్లీకి దగ్గరలోని బద్-కీ-సరై లో యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో బ్రిటిష్ సైనికులు మొదట తిరుగుబాటు దారులను ఢిల్లీకి పారద్రోలి తరువాత ఢిల్లీని ఆక్రమించారు. "ఢిల్లీ ఆక్రమణ జూలై 1న ప్రారంభమై ఆగస్టు 31 న పూర్తయింది". ఒకవారం పాటు అడుగడుగునా వీధిపోరాటం జరిగింది. అయితే తిరుగుబాటు దారుల మీద బ్రిటీష్ వారు విజయం సాధించి నగరాన్ని తిరిగి ఆక్రమించారు. 1857 మే 10 న మీరట్‌లో సిపాయిలతో మొదలైన తిరుగుబాటు, ఉత్తర గంగా మైదానంలోను, మధ్య భారతంలోనూ పౌర తిరుగు బాటుగా మారి. తూర్పు భారత దేశంలో కూడా తిరుగుబాటు విస్తరించి, ఆయా ప్రాంతాల్లో బ్రిటిషు వారి అధికారాన్ని పెద్ద ఎత్తున సవాలు చేసి,1858 జూన్ 20 న తిరుగుబాటు దార్లను ఓడించడంతో పూర్తయింది. అలా ఉత్తర, మధ్య భారతదేశంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం వైఫల్యంతో ముగిసింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

# హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు

**తెలుగువారి కళాసాహిత్య సంగీత చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని సృష్టించిన అపురూప కళారూపం హరికథ. కేవలం ఒక్క కళాకారుడు సంగీత, సాహిత్య, నృత్య, అభినయ కళాభినివేశంతో మృదంగం, వయోలిన్ వాద్య సహకారంతో శ్రోతలను ఆధ్యాత్మిక, కళాసాగరంలో ఓలలాడించే కళారూప సృష్టి హరికథ.**

### ఆదిభట్ల నారాయణదాసు జయంతి

సంగీతం, సాహిత్యం,నృత్యాల మేళవింపుతో హరికథ ప్రక్రియని సృజించి 'హరికథా పితామహులుగా, కథావాగ్గేయకారులు'గా ప్రఖ్యాతిగాంచారు ఆదిభట్ల నారాయణదాసు. ఆయన ప్రాచీన వాగ్గేయకారుల కోవకు చెందిన వారు. కవిత్వం, సంగీతం, నాట్యం అనే మూడు రంగాలలోనూ తనకున్న ప్రతిభను జోడించి నారాయణదాసు హరికథ అనే కళను అత్యున్నత శిఖరాలకు చేర్చారు. మూడింటి కలయికకూ భక్తి అనే భావం ప్రాణంగా హరికథలు రచన చేసి, తెలుగు నాటనే కాక ఇతర రాష్ట్రాలలో కూడా హరికథా ప్రదర్శనలిచ్చి ప్రజల మన్ననలను పొందిన కళాకారుడాయన. హరికథ' అనే పేరువింటే నారాయణదాసు, నారాయణదాసుగారు పేరువింటే 'హరికథ' తెలుగు రాష్ట్రములలో వెంటనే స్ఫురిస్తాయి. నారాయణ దాసుగారు జగత్ప్రసిద్ధులైన హరికథక పితామహులు, కారణ జన్ములు, విద్వత్కవీంద్రులు, భక్తాగ్రణ్యులు. తాము జీవితంలో భక్తినీ, రక్తినీ, ముక్తినీ పుష్కలంగా పొంది తమను దర్శించిన వారికీ, విన్నవారికీ, శుశ్రూష ఒనర్చినవారికీ వాటిని ప్రసాదించిన మహానుభావులు. వేదశాస్త్ర పురాణేతిహాసాదులలోని సర్వసారజ్ఞులు. సంగీత, సాహిత్య, కవితా, నృత్య వాద్యములలో అసమాన ప్రజ్ఞాధురీణులు, కళాప్రపూర్ణులు, సర్వస్వతంత్రులు. శృంగారరస భరితులు, సరస్వతీ అంశ సంభవులు, గాన గంధర్వులు. హరికథారచనకు, ప్రచారానికి మార్గదర్శకులు. పంచముఖి, షణ్ముఖివంటి అసాధ్యములైన తాళములలో రచనలుచేసి, గానంచేసి విద్వాంసుల మన్ననలు పొందిన ఘనవిద్వాంసులు. సహజపాండిత్య మండితులై సంగీతము, సాహిత్యము, నాట్యము, పాత్రాభినయము, కవిత్వము, వేదాంతము, వ్యాకరణము, జ్యోతిష్యము, ఆయుర్వేదము ఆది విద్యలలోనే సంస్కృతము, ఆంధ్రము, హిందీ, ఉర్దూ, పారసీకము, అరబ్బీ భాషలయందు అసమానమైన పాండిత్యమును సంపాదించారు. తారకం, హరికథామృతం అనే సంస్కృత కావ్యాలను రచించి జర్మను పండితుల మెప్పు పొందారు. ఋగ్వేదాన్ని స్వర సహితంగా అచ్చ తెనుగు లోనికి అనువదించి వేదంలోని విజ్ఞానాన్నీ, మంత్రమహిమని తెలుగువారికి తెలియచేసారు. ఆంగ్లభాషనుండి వివిధ కవుల రచనలు కొన్ని కొన్నిటిని విశ్లేషించి షేక్స్పియర్ నాటక రంగములోని ఘట్టములను హృద్యముగా తెలుగులోకి అనువదించారు. ఆయన గాత్ర నిస్వనంలో మైకు, లౌడ్ స్పీకర్లు సహజంగానే అమరి ఉన్నాయంటారు. కంఠం ఎత్తిపాడితే అయిదువేల శ్రోతలకైనప్పటికీ అవలీలగా అందే గాత్ర సౌలభ్యం ఉండేదట.

శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు 1864 ఆగష్టు 31న ఆంధ్రప్రదేశ్ లోని నాటి పార్వతీపుర సమీప అజ్జాడ అనే గ్రామంలో (ప్రస్తుతం విజయనగరం జిల్లా) వేంకటచయన, లక్ష్మీనరసమాంబలకు జన్మించారు. ఆయన అసలు పేరు సూర్యనారాయణ. హరికథకుడిగా ప్రసిద్ధి చెందాక ఆయన నారాయణ దాసుగా మార్చుకున్నారు. ఏకసంధాగ్రహిగా, చిరు ప్రాయంలోనే పద్యాలు, శ్లోకాలు విని కంఠస్థం చేసేవారు. కేవలం ఐదేళ్ళ వయసులో నే భాగవతంలోని పద్యాలు ఎన్నో చెప్పేవారట.



హరికథ అంటే ఏమిటో తెలియని కాలంలో తెలుగు రాష్ట్రములలో దాన్ని రుచి చూపడమేకాక పలువురికి ఉపదేశించిన మహోపాధ్యాయులు. కవిత్వం చెప్పే నైపుణ్యం కూడా ఉండేది. పోతన భాగవతము వలన ప్రభావితులై, ఎన్నో హరికథలను రచించారు. కథాకాలక్షేపము విలక్షణమైనది. స్వవిరచిత కథతో,

కవిత్వము, పాటలతో పామరులను సైతం చమత్కారమగు మాటలతోను మెప్పించేవారట.

మైసూరుమహారాజు దర్బారులో తన వీణావాద్య కౌశల్యంచే మహారాజు మెప్పుపొంది సన్మానాలు అందుకొన్నారు. మహారాజు గాత్రాన్ని ఫోనోగ్రాముద్వారా రికార్డు చేయించుకొని తరచూ వినేవాడట. విజయరామ గాన కళాశాల ప్రథమ ప్రధానాచార్య (1919లో) పదవిలో 17 ఏళ్లు పని చేశారు. జానకీశపథము, రుక్మిణీ కళ్యాణము, గజేంద్ర మోక్షము, ప్రహ్లాదచరిత్ర, ధ్రువోపాఖ్యానము, మార్కండేయోపాఖ్యానము, భీష్మ చరిత్రము, సావిత్రీ చరిత్రము, యదార్థ రామాయణము మున్నగు హరికథలు, హరికథలు రచించారు. పెక్కుశతకములను (శ్రీరామచంద్రశతకము, కాశీ శతకము), కావ్యములను (ఉమర్ ఖయాం, బాటసారి), జగజ్జ్యోతి అనే వేదాంత గ్రంథమును, తారకమను శృంగార ప్రబంధమును, 'నవరసతరంగిణి' అను సంగీతశాస్త్ర గ్రంథమును రచించినారు. భారత కోకిల' సరోజినీదేవి నాయుడు, 'విశ్వకవి' రవీంద్రనాథ్ ఠాకూర్, సుప్రసిద్ధ గాయనీమణి జానకిబాయీ, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, వంటి మహనీయుల ప్రశంసలనందుకొన్న ప్రతిభాశాలి. ఆయన రచించిన 'జానకి శపథం' (ఉత్తర రామచరిత్ర) హరికథ ఒక సంగీత కళాఖండం. అందులో ఆయన పూర్వాంగ, ఉత్తరాంగములకు చెందిన 35 రాగాలను తీసి, వాటిలో కీర్తనలు వ్రాసారు. ఆ కీర్తనలు గానం చెయ్యడం సామాన్య సంగీత కళాకారులకు కష్టసాధ్యం. కలకత్తానుండి కన్యాకుమారి వరకు దాసు దేశ పర్యటనలు చేసేవారు. చిన్న గ్రామాలు, పట్టణములు, సంస్థలు విద్వత్సభలలో, దేవాలయాలలో, రాజ దర్బారులలో, అంతఃపురాలలో దాసుగారు చేసిన హరికథా కార్యక్రమాలు వేలకువేలు ఉన్నాయి. సామాన్యులు మొదలుకొని ప్రతిభా వంతులు, అష్టావధాన శతావధానులు చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి, కాశీ కృష్ణమాచార్యులు, జంధ్యాల పాపయ్య శాస్త్రి, సర్వేపల్లి రాధాకృష్ణ (రాష్ట్రపతి)... ఒక్క రేమిటి అన్ని వర్గాలవారు వేలాదదాసుగారి హరికథా గానానికి, కవితా శక్తికీ, సంగీత-లయల పాండిత్యానికి, ముగ్ధులై ఆనందిచే వారట. సుమారు ఆరున్నర దశాబ్దాల సంగీత, సాహిత్య, హరికథాకళా ప్రస్థానంలో ఆయన అందుకోని సన్మానం లేదేమో. రాజ సన్మానాలూ, పౌర సన్మానాలూ, బిరుదు ప్రదానాలూ, గజారోహణలు, సువర్ణ ఘంటాకంకణ ధారణలూ, గండపెండేర ధారణలూ ఇలా ఎన్నెన్నో గౌరవాలు ఆయనకు లభించాయి.

దైవ సంకల్పమో, యాదృచ్ఛికమో గాని, త్యాగరాజు మరణించిన తిథి పుష్య బహుళ పంచమినాడే, 1945 జనవరి 2న, నారాయణదాసు దేహాన్ని వదలి వెళ్లడం విశేషం.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

## మరోమారు బంగారం..

# వెండి ధరల పెరుగుదల



**న్యూఢిల్లీ, ఆగస్ట్30 (నినాదం):** దాదాపు ఆగస్టు నెల చివరికి వచ్చినప్పటికీ బంగారం, వెండి రేట్లలో ర్యాలీ కొనసాగుతూనే ఉంది. ప్రధానంగా అమెరికా ఆర్థిక వ్యవస్థ, ట్రంప్ దూకుడు చర్యలతో పాటు- ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిస్థితులు ఇన్వెస్టర్లను ప్రభావితం చేస్తున్నాయి. దీనికి తోడు సెప్టెంబర్ ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు ఊహాగానాలు గోల్డ్ వంటి సేఫ్ హెవెన్ దీశగా పెట్టుబడిదారులు మారేలా చేస్తోందని రేట్ల పెరుగుదల గురించి బులియన్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 24 క్యారెట్ల బంగారం రేటు ఆగస్టు 29తో పోల్చితే 10 గ్రాములకు ఆగస్టు 30న రూ.1640 పెరిగింది. అంటే గ్రాముకు రేటు రూ.164 పెరగటంతో కొనుగోలు దారులకు ధరలుచుక్కలు చూపిస్తున్నాయి. ఇక 22 క్యారెట్ల గోల్డ్ రేటు ఆగస్టు 29తో పోల్చితే శనివారం అంటే ఆగస్టు 30న 10 గ్రాములకు రూ.150 పెరుగు దలను చూసింది. బంగారం రేట్లతో పాటు- మరోపక్క వెండి కూడా తమ ర్యాలీని వారాంతంలో కొనసాగి స్తోంది. ఆగస్టు 30న కేజీకి వెండి ఆగస్టు 29తో పోల్చితే రూ.11వందలు పెరగటంతోతెలుగురాష్ట్రాల్లో స్వచ్ఛ మైన సిల్వర్‌రేటు కేజీకి రూ.లక్ష 31వేలకు చేరుకుంది. అంటే గ్రాము వెండి రేటు రూ.131 వద్ద విక్రయాలు జరుగుతున్నాయి.

## జటాయువు ప్రవేశంతో మొదటి భాగం ముగింపు

**ముంబై, నినాదం:**

రెండు భాగాలుగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న రామయణపై ఆసక్తికర వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రాన్ని సుమారు రూ.4000 కోట్లతో రూపొందించనున్నారు. ప్రపంచమంతా ఈ ఇతిహాసాన్ని చూడాలన్న లక్ష్యంతోనే భారీ స్థాయిలో రూపొంది స్తున్నారు. హాలీవుడ్ చిత్రాలకు అయ్యే ఖర్చు కంటే ఇది తక్కువే అని నేను భావిస్తున్నాను. తరాలు మారినా, యుగాలు మారినా రామాయణం ఎప్పటికీ గొప్ప ఇతిహాసమే అని నిర్మాత నమిత్ మల్హోత్ర చెబుతున్నారు. ఇకపోతే ఏదైనా సినిమాను, కథను రెండు భాగాలు చెప్పాల్సి వచ్చినప్పుడు మొదటి భాగం ఎక్కడ ముగిస్తారన్నది చాలా ముఖ్యం 'బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడు' అన్న ప్రశ్న 'బాహుబలి' విజయంలో కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు అందరికీ తెలిసిన ఇతిహాస గాథను బాలీవుడ్‌లో 'రామాయణ'గా తీర్చిదిద్దుతున్న సంగతి తెలిసిందే. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ ఫస్ట్ పార్ట్ వచ్చే ఏడాది దీపావళి కానుకగా విడుదల కానుంది. మరి ఈ భాగం ఏ సన్నివేశంతో ముగిస్తారన్న ఆసక్తి అందరిలోనూ నెలకొంది. దానిపైనే చిత్ర బృందం స్పష్టత ఇచ్చింది. రాముడికి సీత జాడ గురించి 'జటాయువు' ఇచ్చే సందేశంతో ఫస్ట్ పార్ట్‌ను ముగిస్తారట. 'రామాయణ మొదటి భాగం జటాయువు మరణంతో ముగుస్తుంది. జటాయువుకు అమితాబ్ బచ్చన్ వాయిస్ ఓవర్ ఇస్తారు. ఈ సన్నివేశంతో సీతాదేవిని ఎవరు అపహరించారో రాముడికి తెలుస్తుంది. అసలు యుద్ధం పార్ట్-2లో ఉంటుందని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రంలో రావణాసురుడి పాత్రను కన్నడస్టార్ యశ్ పోషిస్తున్న సంగతి తెలిసిందే. రావణుడి క్రూరత్వం, దయ, కనికరంలేని రాక్షస రాజుగా ఈ పాత్రను పూర్తిగా ఆవిష్కరిస్తారట. అందుకోసం ప్రత్యేకంగా కొన్ని సన్నివేశాలను డిజైన్ చేసున్నారు. అసలు రావణబ్రహ్మ నేపథ్యాన్ని ఒళ్లుగగురుపొడిచేలా తెరపై ఆవిష్కరించనున్నారు. ఈ విషయాన్ని రామాయణ టీ-మ్ స్వయంగా పంచుకుంది. దాదాపు రూ.4 వేల కోట్లతో తెరకెక్కుతున్న 'రామాయణ'కు నితీశ్ తివారి దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ (శశిస ఔశుస), సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. తొలిభాగం 2026 దీపావళికి, రెండోభాగం 2027 దీపావళికి రానున్నాయి.

## పేదల కోసం తపించిన మహానేత సురవరం

మొదటితరంలో సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు వంటి వారు పాలమూరు జిల్లాకు వన్నెతెచ్చారు. రెండో తరంలో జైపాల్‌రెడ్డి, సురవరం సుధాకర్‌రెడ్డి వంటివారు రాజకీయాల్లో రాణించారు. జైపాల్‌రెడ్డి దక్షిణ భారత్ నుంచి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎన్నికైన యువ ఎంపీగా ప్రజల్లో నిలిచిపోయారని అన్నారు. అదే కోవలో సురవరం సుధాకర్‌రెడ్డి కూడా గుర్తింపు తెచ్చుకున్ననేత అన్నారు. సిపిఐ కార్యార్శిగా, ఎంపిగా ఆయన చిరస్మరణీయ సేవలు అందించారని అన్నారు. ఆయన సిద్ధాంతాలు ప్రజలకు అర్థమయ్యేలా చేస్తాం. ప్రజలకు సురవరం సుధాకర్‌రెడ్డి ఎప్పుడూ గుర్తుండేలా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు. రాజకీయం అంటేనే అధికారం అన్నట్టుగా కొందరు వ్యవహరిస్తున్నారు. అధికారంలో ఉంటాం కానీ, ప్రతిపక్షంగా ఉండలేమన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఐదేళ్లు కూడా ప్రతిపక్షంగా వ్యవహరించేందుకు కొందరు ఇష్టపడట్లేదని పరోక్షంగా బిఆర్‌ఎస్‌పై విసుర్లు విసిరారు. కమ్యూనిస్టులు మాత్రం ఎన్నేళ్లు అయినా ప్రతిపక్షంలో ఉండేందుకు ఇష్టపడతారు. ప్రజల తరపున మాట్లాడటం, పోరాడటం పెద్ద బాధ్యత. ప్రస్తుత రాజకీయాల్లో ప్రజల తరపున పోరాడేందుకు నేతలు ముందుకు రావట్లేదు. సమస్యలపై పోరాడి.. ప్రజావ్యతిరేక ప్రభుత్వాలను దించడంలో కమ్యూనిస్టులు ముందున్నారని సీఎం వ్యాఖ్యానించారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం దిగిపోయినా కమ్యూనిస్టులే కారణమని తన నమ్మకం తనదని సిఎం అన్నారు . రవీంద్ర భారతిలో సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభకు హాజరయ్యారు రేవంత్. సురవరం చిత్రపటానికి నివాళి అర్పించారు. కమ్యునిస్టులంటేనే ప్రతిపక్షమని అన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతం,ఆలోచన ఇంకా పెరగాలన్నారు రేవంత్. కమ్యునిజం అంటే లైబ్రరీలో దొరికే పుస్తకం కాదని.. కమ్యూనిస్టులంటేనే ప్రజల కోసం కొట్లాడే వాళ్లని అన్నారు. కమ్యూనిస్టులంటే ప్రజలకు ఓ భరోసా,నమ్మకం ఉందన్నారు. సురవరం ఉంటే ఓట్ చోరీపై మరింతగా పోరాడే వారరన్నారు. మహారాష్ట్రలో నాలుగు నెలల్లో కొత్తగా కోటి మంది ఓటర్లు పుట్టుకొచ్చారని ఆరోపించారు సీఎం రేవంత్. బీహార్ లో 65 లక్షల కొత్త ఓట్లు- వచ్చాయని చెప్పారు. ఓట్ల తొలగింపుతో ఈ సమస్యకు పరిష్కారం దొరకదన్నారు. సురవరం చివరి శ్వాస వరకు సీపీఐతోనే ఉన్నారని.. 65 సంవత్సరాల పాటు- ఎర్రజెండా నీడనే ఉన్నారని కొనియాడారు రేవంత్. సురవరం సామాజిక చైతన్యం ఉన్నవారన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి సూచనతోనే తెలుగు యూనివర్శిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టామన్నారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నారాయణ, మంత్రి జూపల్లి కృష్ణారావు, సీపీఎం నేత బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, గుమ్మడి నర్సయ్య, ప్రొ.హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో కార్డియాలజీ వైద్యుడు మృతి

చెన్నై, నినాదం:

విధుల్లో ఉండగానే తమిళనాడుకు చెందిన కార్డియాక్ సర్జన్ డా.గ్రాడ్లిన్ రాయ్ (39) గుండెపోటు-తో ప్రాణాలు కోల్పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చెన్నైలోని ప్రైవేటు- ఆసుపత్రిలో కార్డియాక్ సర్జన్‌గా పనిచేస్తున్న డా. గ్రాడ్లిన్ రాయ్ బుధవారం విధుల్లో భాగంగా ఆసుపత్రి వార్డుల్లో రౌండ్స్‌లో ఉండగా ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. అతడిని కాపాడడానికి సహోద్యోగులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని.. గ్రాడ్లిన్ రాయ్ ప్రాణాలు కోల్పోయారని ఆసుపత్రి అధికారులు పేర్కొన్నారు. కార్డియాలజీపై అవగాహన ఉండి.. అన్నిరకాల జాగ్రత్తలు తీసుకునే కార్డియాక్ సర్జన్ గుండె పోటుతో మరణించడం ఆందోళనకరమైన విషయమని సహచర డాక్టర్లు పేర్కొన్నారు. గ్రాడ్లిన్ రాయ్‌కు ఎలాంటి అనారోగ్య సమస్యలు కూడా లేవన్నారు. యువతలో హఠాత్తుగా సంభవిస్తున్న గుండెపోటు- మరణాలకు ఒత్తిడి, దీర్ఘకాలిక పని గంటలే కారణమని పలువురు నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. వైద్యులు రోజుకు 12-18 గంటలు పని చేయాల్సి వస్తుందని.. కొన్నిసార్లు ఒకే షిఫ్ట్‌లో 24 గంటలు కూడా విధుల్లో ఉండాల్సి వస్తుందన్నారు. అందువల్ల వారిపై ఒత్తిడి అధికంగా ఉంటు-ందన్నారు. మరికొందరిలో అనారోగ్యకరమైన జీవనశైలి, శారీరక వ్యాయామం లేకపోవడం వంటి అనేక కారణాలు కూడా ఉండొచ్చని తెలిపారు.

## ప్రసాదం కోసం చంపేశారు..

**న్యూఢిల్లీ, నినాదం:**

దేశ రాజధాని ఢిల్లీలో ఘోరం జరిగింది. ప్రసాదం వివాదం కారణంగా ఒకరు హత్యకు గురయ్యారు. కొందరు వ్యక్తులు.. ఆలయ సేవకుడిని అత్యంత దారుణంగా కర్రలతో కొట్టి చంపేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయ్యారు. ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ప్రముఖ కల్కాజీ ఆలయానికి కొందరు వ్యక్తులు దర్శనానికి వచ్చారు. సందర్శన తర్వాత ఆలయ సేవకుడు యోగేంద్ర సింగ్(35)ను ప్రసాదం అడిగారు. అడగ్గానే ప్రసాదం అందజేశాడు. మరింత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు యోగేంద్ర సింగ్ నిరాకరించాడు. దీంతో గొడవకు దిగారు. విచక్షణ మరిచిన గ్యాంగ్ కర్రలు తీసుకుని ఆలయ సేవకుడిపై దాడికి పాల్పడ్డారు. ఒక్కడిని చేసి మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. అక్కడికక్కడే యోగేంద్ర సింగ్ ప్రాణాలు కోల్పోయాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయ్యాయి. బాధితుడు ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లాలోని ఫట్టేపూర్ ప్రాంతానికి చెందిన యోగేంద్ర సింగ్ (35)గా పోలీసులు గుర్తించారు. గత 14 నుంచి 15 సంవత్సరాలుగా కల్కాజీ ఆలయంలో సేవాదార్‌గా పనిచేస్తున్నాడు. భక్తులకు ఆచారాలు, నైవేద్యాల విషయంలో సహాయం చేస్తుంటాడు. కానీ కొందరు దుండగులు అకారణంగా కొట్టి చంపేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. స్థానికులు బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది.. అప్పటికే మరణించినట్లుగా వైద్యులు తెలిపారు. భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. దక్షిణపురి నివాసి అయిన 30 ఏళ్ల అతుల్ పాండే అనే నిందితుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు- పోలీసులు పేర్కొన్నారు.

**ఢిల్లీలో ప్రజలు క్షేమంగా లేరని కేజ్రీవాల్ వ్యాఖ్య**

ఢిల్లీలోని కల్కాజీ ఆలయంలోని సేవకుడు దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై ఆ రాష్ట్ర మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ అధికార బిజెపి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో హత్యలు జరుగుతున్నా బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. అసలు ఢిల్లీలో ఎవరైనా సురక్షితంగా ఉన్నారా అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఆలయంలో సేవకుడిని హత్య చేసేముందు ఆ దుర్మార్గుల చేతుల వణకలేదా? అని ఆయన ప్రశ్నించారు.

# రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేత

**మొదటిపేజీ తరువాయి**



మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే దానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెర దింపింది. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శనివారం భేటీ- అయిన తెలంగాణ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు చేసింది. స్థానిక ఎన్నికల రిజర్వేషన్లలో పరిమితి ఎత్తివేయాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం పేర్లను గవర్నర్‌కు క్యాబినెట్ సిఫార్సు చేసింది. అసెంబ్లీ కమిటీ-హాలులో జరిగిన ఈ మంత్రివర్గ సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంతోపాటు-, ఇటీ-వలి వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంపైనా చర్చించారు. పంటలు, రోడ్లు, ఇతర నష్టాలపై కేంద్ర ఆర్థికశాఖ సాయం కోరుతూ తీర్మానం చేశారు. కేబినెట్ వివరాలను మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు. మరోవైపు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి కూడా క్యేబినెట్ నిర్ణయం తీసుకుందని అన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్‌లోగా జరపాలని కోర్టు ఆదేశించింది. మొత్తం రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి మించకూడదని గత ప్రభుత్వం 2018 ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనిపై ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసి గవర్నర్ కు పంపింది. ప్రస్తుతం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి దగ్గర పెండిరగ్ లో ఉందన్నారు. ముస్లిం కోటా పేరుతో బీజేపీ బిల్లును అడ్డుకుంటోంది. రాష్ట్రపతి ఆమోదం తెలపకుండా ప్రధాని మోదీ సర్కార్ అడ్డుకుంటోంది. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలపాలని ఢల్లీలో నిరసన కూడా తెలిపినట్లు వెల్లడంచారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ లుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను సిఫారసు చేస్తూ తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పుతో కేబినెట్ మరోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పేర్లను సిఫారసు చేసింది. అయితే కోదండరాం పేరుతో పాటు- ఈ సారి అమీర్ అలీ ఖాన్ స్థానంలో అజారుద్దీన్ కు స్థానం కల్పించాలని నిర్ణయించారు. ఎమ్మెల్సీలుగా కోదండరాం, ఆమిర్ అలీఖాన్ నియామకాన్ని సవాల్ చేస్తూ బీఆర్‌ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ 2024 ఆగస్టులో సుప్రీంకోర్టులో సివిల్ అప్లికేషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ ను విచారించిన సుప్రీం కోర్టు.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంలో ప్రొఫెసర్ కోదండరాం, ఆమిర్ అలీ ఖాన్ కేసు విషయంలో 2025 ఆగస్టు 13 న స్టే విధించింది. 2024 ఆగస్టు 14న తాము ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల తర్వాత జరిగిన పరిణామాలు ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఉంటే ఎమ్మెల్సీల నియామకాన్ని రద్దు చేస్తామని వ్యాఖ్యానించింది. అయితే.. ఏదైనా తుది ఉత్తర్వులకు లోబడే ఉంటుందని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను 2025 సెప్టెంబర్ 17కు వాయిదా వేసింది. ఈ క్రమంలో మరోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లను సిఫారసు చేసింది తెలంగాణ కేబినెట్.. ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను ఖరారు చేసింది. అయితే ఈ సారి అమీర్ అలీ ఖాన్ ప్లేసులో అజారుద్దీన్ కు అవకాశం కల్పించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో అజారుద్దీన్ కు ఎమ్మెల్సీ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. దీంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరపున కొత్త అభ్యర్థికి అవకాశం రానుంది. ఇకపోతే బీసీ రిజర్వేషన్లపై కేబినెట్‌లో కీలక చర్చ జరిగిందని, అసెంబ్లీలో రిజర్వేషన్ బిల్లులను ఆమోదిస్తాం అని పొంగులేటి అన్నారు. భారీ వర్షాలతో కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లింది. పంట, ఆస్తి, రహదారుల నష్టం అధికంగా జరిగింది. వరద నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు చెప్పాం. వర్షాల వల్ల జరిగిన నష్టం అంచనాల పై సెప్టెంబర్ 4న ఉన్నతాధికారుల సమావేశం నిర్వహిస్తాం అన్నారు. గోలల పాలసీ విధి విధానాలపై చర్చించాం. 2022 - 23 లో రబీ ధాన్యం సేకరణకు టెండర్లు పిలిచారు. మిల్లర్లకు ఇచ్చిన 7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రికవరీ కాలేదు.. వారి పై పీడీ యాక్ట్ పెట్టడాని-కై-నా ప్రభుత్వం వెనకాడదు. మత్స్య సహకార సంఘాలకు పర్సనల్ ఇంచార్జిలను నియమించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ కు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు.

## బీఆర్‌ఎస్ నిరసన




**మొదటిపేజీ తరువాయి**

ఆయన గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడారు.. అసెంబ్లీ సమావేశాలు కనీసం 15 రోజులు లేదా అంతకు మించి నిర్వహించినా తాము సిద్ధమే అని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ అంశాన్ని సభలో పెట్టినా.. అన్నింటికీ సరైన సమాధానం ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగం నుంచి మొదలుకొని ఏ అంశం పైననైనా సభలో చర్చకు పెడితే ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు-పేర్కొన్నారు. వ్యవసాయ విస్తీర్ణంతో పాటు- వ్యవసాయ సంక్షేమానికి మాజీ సీఎం కేసీఆర్ చేసిన కార్యక్రమాలు, పథకాల గురించి వివరిస్తామని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం గురించి కూడా సమాధానం చెబుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, అది కాంగ్రెస్ పార్టీ వేసుకున్న పీసీసీ ఘోష్ కమిషన్ అని కేటీఆర్ విమర్శించారు. వ్యవసాయ రంగం నుంచి మొదలుకొని ఏ అంశం పైననైనా సభలో చర్చకు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాము. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం గురించి కూడా సమాధానం చెబుతాం. అసమ్మతి ఎమ్మెల్యేలకు సంబంధించిన అంశంలో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూద్దాం. ఇప్పటికే అసమ్మతి ఎమ్మెల్యేలకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది, ఏ నిర్ణయం తీసుకుంటారో చూద్దాం అని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు శాసనసభను తమకు అనుకూలంగా ఉండేలా నడిపించే ప్రయత్నం చేస్తోంది. రైతుల సమస్యల పైన, రాష్ట్రంలో ఉన్న ఎరువుల సంక్షోభం పైన మాట్లాడటం లేదు. 10 సంవత్సరాల పాటు కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ రోజు కూడా ఇలాంటి ఎరువుల కొరత రాలేదు. రైతులు లైన్లలో నిలబడాల్సిన దుస్థితి రాలేదు. మరి ఎందుకు ఈరోజు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెప్పులను లైన్లో పెట్టడం, ఆధార్ కార్డులను లైన్లో పెట్టే పరిస్థితి వచ్చింది? పండుగ రోజు కూడా రైతులు ఎరువుల కోసం లైన్లలో నిలబడి, వర్షంలో తడిసి ఇబ్బందులు పడే పరిస్థితి ఎందుకు వచ్చింది? పంట నష్టపోయిన రైతుల గురించి కానీ, భారీ వర్షాల వల్ల ఇబ్బందుల గురించి గానీ సుదీర్ఘంగా చర్చించే అవకాశం అసెంబ్లీలో ఇవ్వండి. రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ సంక్షోభం పైన అసెంబ్లీలో చర్చ పెట్టాలి అని కేటీ-ఆర్ డిమాండ్ చేశారు. 600కు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. 75 లక్షల మంది రైతులు ఈరోజు అవస్థల్లో ఉన్నారు. రైతులకు కాంగ్రెస్ చేసిన మోసంపైన అసెంబ్లీలో చర్చ జరగాలి. ఆరు గ్యారెంటీ-ల నుంచి 420 హామీల అమలు వైఫల్యాల దాకా అన్ని అంశాలపైన చర్చిద్దాం. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారు, వాటి పైన చర్చ జరగాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉండే ఒకటి రెండు అంశాల పైననే మాట్లాడే ప్రయత్నం చేస్తోంది. ప్రజల కష్టాలు, సమస్యల పైన చర్చలకు అసెంబ్లీ వేదిక కావాలి. కనీసం 15 రోజులపాటు- అసెంబ్లీ సమావేశాలు జరగాలి. కాళేశ్వరంతో పాటు- అన్ని అంశాల పైన సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నాము. పీసీ ఘోష్ కమిషన్ పైన కూడా కాంగ్రెస్ పార్టీకి సమాధానం చెప్పడానికి మేము సిద్ధంగా ఉన్నాం అని కేటీఆర్ స్పష్టం చేశారు

## పవర్ పాయింట్ సంప్రదాయం ఎక్కడుంది?

**మొదటిపేజీ తరువాయి**

అప్పుడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.6,500 కోట్ల వడ్డీ కట్టట్లేదనే భారత రాష్ట్ర సమితి వాదన సరికాదని పేర్కొన్నారు. మరి వడ్డీలు ఆ పార్టీ నేతలు కడుతున్నారా అని ప్రశ్నించారు. ప్రజలను ఎంతోకాలం తప్పుదోవ పట్టించలేరని అన్నారు. మరోవైపు శాసనసభలో కాళేశ్వరంపై పీపీటీకి అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేస్తున్నారు. తాము పూర్తి ప్రజాస్వామికంగా వ్యవహరిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు అందరికీ పూర్తిస్థాయిలో అవకాశం ఇస్తామన్నారు. తప్పులు చేసినవారికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఎందుకు అని భారత రాష్ట్ర సమితి నేతలను ప్రశ్నించారు. తెలంగాణలోనే కాదు.. దేశం మొత్తం యూరియా కొరత ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూరియా కోసం సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాశారని చెప్పారు. కేంద్ర మంత్రులతో మాట్లాడి ఒత్తిడి తెచ్చారన్నారు. తమ ఒత్తిడితోనే యూరియా కొంత సాధించినట్లు- వివరించారు. తెలంగాణ అభివృద్ధే లక్ష్యమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అన్నారు. ఆమె పార్టీ నేతలతో కలిసి గన్ పార్క్ వద్ద నివాళి అర్పించి మాట్లాడారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తోందని వివరించారు. వరదలతో నష్టపోయిన వాళ్లను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం అన్ని పార్టీలు ముందుకు రావాలి. కేసీఆర్ ఎందుకు అసెంబ్లీకి రావడం లేదు. ఫామ్ హౌస్‌లో ఉండటంలో అర్థం ఏమిటి? అసెంబ్లికి రాను.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేసీఆర్‌ను చెప్పమనండని విజయశాంతి అన్నారు.

## ఉభయ సభలు నేటికి వాయిదా

గోపీనాథ్ మృతిపట్ల సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. విద్యార్థి రాజకీయాల్లో గోపీనాథ్ చురుగ్గా ఉండేవారని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా పని చేశారని, ఎన్టీఆర్‌కు విశ్వాసపాత్రుడిగా గోపీనాథ్‌కు సత్సంబంధాలు ఉండేవన్నారు. విద్యార్థి నేతగా , ప్రజాప్రతినిధిగా, సినీ నిర్మాతగా రాణించారని చెప్పారు. గోపీనాథ్ తనకు మంచి మిత్రుడని, సన్నిహితుడని గుర్తు చేసుకున్నారు. గోపీనాథ్ తనకు చిన్ననాటి నుంచే మిత్రుడని పేర్కొన్నారు. ఆయన మృతి తనను వ్యక్తిగతంగా తీవ్రంగా కలిచివేసిందని గోపీనాథ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సంతాప తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా సీఎం రేవంత్ మాగంటి గోపీనాథ్ జీవన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. రాజకీయంగా పార్టీలు వేరైనా.. వ్యక్తిగతంగా నాకు మంచి మిత్రుడని తెలిపారు. ఆయన విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా ఉన్నారని అన్నారు. 1983లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగు దేశం పార్టీలో ఆయన తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారని.. 1985 నుండి 1992 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తెలుగు యువత అధ్యక్షుడిగా సేవలందించారని తెలిపారు.1987-88 లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ- డైరెక్టర్‌గా 1988-93లో జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుడిగా విశేష కృషి చేశారు. గోపీ ఎన్టీఆర్‌కు గొప్ప భక్తుడు. సినీరంగంలోనూ నిర్మాతగా రాణించారు. వరసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్ని-కై- ఘనత సాధించిన వారిలో మాగంటి గోపీనాథ్ ఒకరని అసెంబ్లీలో సీఎం రేవంత్ తెలియజేశారు. చూడటానికి ఆయన క్లాస్ గా కనిపించినా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఆయన మాస్ లీడర్ అని అన్నారు. గోపీనాథ్ అకాల మరణం వారి కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చిందని.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు- పేర్కొన్నారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లు మాట్లాడుతూ గోపీనాథ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గోపీనాథ్‌తో తనకు చిరకాల మిత్రుత్వం ఉందని శ్రీధర్ బాబు అన్నారు. తరవాత కెటిఆర్, ఇతర సభ్యులుఉమాట్లాడుతూ గోపీనాథ్ మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం సభ సోమవారానికి వాయిదా పడింది.

### కాళేశ్వరం, బీసీ బిల్లుపై నేడు చర్చ

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు స్పీకరే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. అన్ని అంశాలపై చర్చ చేయాలంటే.. నాలుగైదు రోజుల తర్వాత సభ నడుపుతాం. గణేష్ నిమజ్జనం, వరదల దృష్ట్యా సభను వాయిదా వేయాలని శ్రీధర్‌బాబు తెలిపారు. అయితే బీఏసీ సమావేశం నుంచి భారత రాష్ట్ర సమితి వాకౌట్ చేసింది. ఎరువుల కొరత, వరదలు, రైతుల సమస్యలపై చర్చ జరగాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేశారు. స్పష్టమైన హామీ రాకపోవడంతో బీఏసీ నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు.

## గోదావరికి పోటెత్తిన వరద

ఆదిలాబాద్, నినాదం:

నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా వరద పెరగడంతో గోదావరి నుంచి సరస్వతి ఆలయం వరకు ప్రధాన రహదారి జలమయమైంది. వరదనీరు వ్యాసమహర్షి ఆలయానికి, ఆలయ ఆవరణలోని తితిదే గృహాల వరకు చేరుకుంది. ఆలయం వద్ద దుకాణాలు, ప్రైవేటు- లాడ్జిలు, సత్రాలన్నీ నీట మునిగాయి. దీంతో సరుకులు మొత్తం నీటిలో కొట్టుకు పోయాయని దుకాణదారులు విలపించారు. గంగాదేవి, సూర్యేశ్వర శివాలయం, అక్షర కాలనీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్‌లు జలమయమయ్యాయి. అక్షర కాలనీలో చిక్కుకున్నవారిని ట్రాక్టర్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. స్థానిక నాగభూషణ్ విద్యాలయంలో 30 మంది విద్యార్థులు, ఆరుగురు టీ-చర్లు చిక్కుకున్నారు. వరద చుట్టు-ముట్టడంతో భవనం పై అంతస్తుకు వెళ్లి తలదాచుకున్నారు. వారిని బయటకు తీసుకొచ్చేందుకు వెళ్లి మరో 8 మంది కూడా వరదనీటిలో చిక్కుకున్నారు.

## పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు భయమెందుకు



**మొదటిపేజీ తరువాయి**

కాళేశ్వరం కమిషన్ నివేదికను కొట్టివేయాలని గతంలోనూ కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్ల ఆధారంగా గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. నోటీసులు జారీ చేసి వాయిదా వేసింది. అక్టోబర్ ఈ పిటిషన్లపై తదుపరి విచారణ చేపట్టనుంది. తప్పులు చేశారో.. లేదో తేల్చాల్సింది మంత్రులు, కాంగ్రెస్ పార్టీ కాదని హరీశ్‌రావు అన్నారు. అది తేల్చాల్సింది కోర్టులు, ప్రజలు అని పేర్కొన్నారు.

కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం ఇవ్వట్లేదంటే.. అధికార పక్షం భయపడుతున్నట్లే అని పేర్కొన్నారు. వాస్తవాలు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు. పీపీటీకి అవకాశం ఇవ్వడం లేదంటే.. వాస్తవాలను వినడానికి సిద్ధంగా లేరని అర్థం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారని గుర్తు చేశారు. మంత్రి శ్రీధర్ బాబు మాటలు చూస్తుంటే.. ఆయనకు వాస్తవాన్ని అంగీకరించడం ఇష్టం లేదని తెలుస్తోందని అన్నారు. ఏ విషయం గురించైనా నిజానిజాలు కోర్టులో తెలుస్తాయని హరీష్ రావు స్పష్టం చేశారు.

### రెండు రోజులంటే ఎలా

రెండు రోజులే అసెంబ్లీ నడిపిస్తామని ప్రభుత్వం అంటోందని, ప్రజా సమస్యలపై చర్చించకుండా పారిపోతున్నారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బీఏసీ నుంచి వాకౌట్ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వరదల గురించి చర్చిద్దామంటే బురద రాజకీయాలు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు 15 రోజుల పాటు- నిర్వహించాలని బీఏసీలో కోరాం. వరద నష్టాలు, ఎరువుల కొరత, గురుకులాల్లో వందకుపైగా మరణాలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి అసెంబ్లీలో చర్చించాలని కోరాం అని హరీశ్‌రావు తెలిపారు. వరదల మీద మాట్లాడుదామని అంటే.. వరదలు ప్రాధాన్యత కాదు బురద రాజకీయాలు మాట్లాడుకుందామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రెండే రోజులు అసెంబ్లీ జరిపి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోవాలని చూస్తుందని ఆయన ధ్వజమెత్తారు. వరదలు, ఎరువుల మీద చర్చించాలని బీఏసీ సమావేశంలో మేం కోరాం. కానీ ఆ రెండిరటి మీద చర్చించరట. అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేశాం. పదేండ్ల బీఆర్‌ఎస్ హయాంలో లేని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చింది. వరదలు, యూరియా కొరతపై మాట్లాడాలని బీఆర్‌ఎస్ ప్రతిపాదించింది. ఈ రెండు అంశాలపై మాట్లాడాలని మేం కోరాం. వీటితో పాటు- గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. అంటు- రోగాల మీద, గురుకులాల్లో కనీస సౌకర్యాలపై, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై, ఫోర్త్ సిటీ పేరు మీద జరుగుతున్న అక్రమాలు.. సీఎం కుటు-ంబ సభ్యుల పాత్రపై, ధాన్యం కుంభకోణంపై.. బాధ్యులపై, ప్రభుత్వ ఉద్యోగుల టీ-ఏ, డీఏలు, పీఆర్సీపై, గోదావరి బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై, హైడ్రా కూల్చివేతలు పేదలు పడుతున్న బాధలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలపై చర్చించాలని కోరాం. వీటికి ప్రభుత్వం అంగీకరించలేదు. దురదృష్టం ఏంటంటే రెండే రోజులు అసెంబ్లీ జరుపుతామని అంటున్నారు. అంటే ఇవాళ రేపు, ప్రజా సమస్యల మీద చర్చించకుండా సభను వాయిదా వేసుకొని పారిపోతున్నారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వ ధోరణి చూస్తే కాళేశ్వరం కమిషన్ రిపోర్టు పెట్టి బురద రాజకీయాలకు పాల్పడే ఆలోచనలో కనబడుతున్నారు. దాని మీద చర్చకు సిద్ధం.. పీపీటీకి అవకాశం ఇవ్వండి.. ఒక్క రోజు కాదు నాలుగు రోజులు మాట్లాడుకుందాం అని చెప్పాం. కానీ కష్టాల్లో ఉన్న రైతులు, వరద బాధితులపై మాట్లాడాలంటే ముందుకు రావడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు విమర్శలు చేశారు. రేపు ఒక్క రోజే బీసీ బిల్లు, కాళేశ్వరం రిపోర్టుపై చర్చించి.. తర్వాత అసెంబ్లీ వాయిదా వేసుకుని పోతారట. ప్రజా సమస్యలు, రైతు సమస్యలపై ప్రభుత్వానికి చీమకుట్టినట్టు- కూడా లేదు. ఎరువుల మీద చర్చించడానికి, వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావడం లేదు. ప్రజాపాలన అంటే ప్రతిపక్షాల గొంతు నొక్కడమేనా..? ఎజెండా నిర్ణయించకపోవడమేనా..? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. అర్థంపర్థం లేకుండా బీఏసీ సమావేశం జరిగింది. కేవలం బురద రాజకీయాలే తమకు ప్రాధాన్యత అన్న ధోరణిలో ప్రభుత్వం ఉందని హరీశ్‌రావు మండిపడ్డారు.

## భక్తిశ్రద్ధలతో బొజ్జ గణపతిని పూజించాలి



**మహేశ్వరం, ఆగస్టు 30 (నినాదం):** భక్తి శ్రద్ధలతో బొజ్జ గణపతిని పూజించాలని గిరిజన నాయకుడు మాజీ సర్పంచ్ రామావత్ తులసి రామ్ నాయక్, టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం గ్రామపంచాయతీ మైసిగండి పెద్ద గణేష్ మండపం దాత జటావత్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపాన్ని సందర్శించి ప్రత్యేకపూజలు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో ప్రత్యేక పూజలు నిర్వహించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సాంప్రదాయ సామాజిక సాంఘిక ఆర్థిక అభివృద్ధి చెందుతున్న భక్తులు గణపతి నవరాత్రుల ఉత్సాహం ఆనందంగా చిన్న పెద్ద తేడా లేకుండా అత్యంత వైభవంగా బొజ్జ గణపతి వేడుకలు ఉత్సాహంతో జరుపుకోవాలని తెలియజేశారు. మన సంస్కృతి జాగ్రత్తల భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బాధ్యత అన్నారు. మనమంతా కలిసి మెలిసి ఆనంద ఉత్సాహాలతో పండుగలను జరుపుకోవాలి అన్నారు. ఏదైనా సంఘటన జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పూజ అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో యువకులు పిల్లలు పెద్దలు భక్తులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అందమైన చేతిరాతతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

### హెల్పింగ్ హార్ట్ సొసైటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 30 (నినాదం):** అందమైన చేతిరాత నేర్చుకుంటే విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచడంతోపాటు క్రమశిక్షణతో పాటు, పరీక్షల్లో అధిక మార్కులు సాధించడంలో ఉపయోగ పడుతుందని హెల్పింగ్ హార్ట్స్ సొసిటీ అధ్యక్షుడు విజయ్ కుమార్ తెలిపారు.గత రెండు వారాలుగా జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడెమీ ఆధ్వర్యంలో సూరారం కాలనీ జిల్లా పరిషత్ హై స్కూల్లో జరుగుతున్న ల్యూసిడా చేతిరాత శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచితంగా ల్యూసిడా చేతిరాత శిక్షణా శిబిరాలను నిర్వహించిన జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడెమీ డైరెక్టర్ వంపు మల్లయ్య ను శాలువ, పుష్ప గుచ్చంతో, పాటు ప్రశంసా పత్రాన్ని అంద చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని , ఉపాధ్యాయులు హనుమంత్ రావు, జావీద్, పుణ్యవతి , యాదగిరి పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణలో పాల్గొన్న కేఎం ప్రతాప్

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 30 (నినాదం):** వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా, కుత్బుల్లాపూర్ గ్రామంలో రాజీవ్ యూత్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి



అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ హాజరై విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ, శ్రీ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,ఆయురారోగ్యాలు అష్టై ఐశ్వర్యాలు కలిగించాలని వేడుకున్నానన్నారు.ఈ కార్యక్రమంలో రాజీవ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు నక్క ప్రకాష్, సత్ గ్యాన్ హై స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం,ఉప్పుల భాస్కర్, ఏనుగుల కృష్ణ, ముస్తఫా,నక్క నాగరాజ్, నక్క ఫణీంద్ర, సునీల్, గౌరీష్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకుంది

### రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

### పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘనంగా సన్మానాలు



**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి,ఆగస్టు30,(నినాదం):** రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన 1.నందు కుమార్, డిఎస్పీ ఫింగర్ ప్రింట్ బ్యూరో, 2. అనంతయ్య, సబ్ ఇన్స్పెక్టర్, కంట్రోల్ రూమ్, 3. మేఘమాల, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్, బాలాపూర్ పోలీస్ స్టేషన్, 4. సుబ్బా రెడ్డి, హెడ్ కానిస్టేబుల్, కార్ అంబర్పేటలకు సీపీ సుధీర్‌బాబు రాచకొండ పోలీస్ కార్యాలయంలో సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఎంతో కాలం పాటు పోలీసుశాఖలో సమర్థవంతంగా, క్రమశిక్షణతో పనిచేసి తమ సేవలు అందించినందుకు అభినందించారు. పదవీ విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని, ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ చూపాలని, పెన్షన్ మరియు ఇతర ఆర్థిక అంశాల పట్ల క్రమశిక్షణ పాటించాలని సూచించారు. వారికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పదవీ విరమణ పొందే అధికారులు మరియు సిబ్బంది సంక్షేమం కోసం తాను ఏర్పాటు చేసిన పెన్షన్ డెస్క్ ద్వారా త్వరగా పెన్షన్ మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ ఇందిరా, అడిషనల్ డీసీపీ అడ్మిన్ శివ కుమార్, సీసీఆర్బీ ఏసిపి రమేష్, %జూాా% అడ్మిన్ పుష్పరాజ్, ఎ ఎ ఓ అశోక్ రెడ్డి, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సిహెచ్. భద్రా రెడ్డి, కృష్ణా రెడ్డి, కో ఆపరేటివ్ డైరెక్టర్ టేకుల రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన అధునాతన ఎఫ్‌డీపీ





### డీప్ ఫేక్ టెక్నాలజీ, సైబర్ భద్రతలపై సమగ్ర అవగాహన కల్పించిన పరిశ్రమ నిపుణులు

**జిన్నారం/పటాన్ చెరు ఆగస్టు 30 (నినాదం):** గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం (సీఎస్ఈ) ఆధ్వర్యంలో 'సైబర్ భద్రతలో డీప్ ఫేక్ బెదిరింపులు: గుర్తింపు, నివారణ, నైతిక సవాళ్లు' అనే అంశంపై రెండు వారాల (12 రోజుల) అధునాతన అధ్యాపక వికాస కార్యక్రమం (ఎఫ్ డీపీ) శనివారం విజయవంతంగా ముగిసింది. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) శిక్షణ, అభ్యాసం (ఏటీఏఎల్) అడ్వాన్స్‌డ్ పథకం కింద ఆగస్టు 18–30 వరకు దీనిని ఏర్పాటు చేశారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) సృష్టించిన సింథటిక్ మీడియా యొక్క పెరుగుతున్న ప్రమాదాలను ఎదుర్కోవడానికి అధ్యాపకులు, పరిశోధకులను అధునాతన జ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యాలతో సన్నద్ధం చేయడానికి ఈ ఎఫ్ డీపీని లక్ష్యించారు. డీప్ ఫేక్ జనరేషన్ మెకానిజమ్స్, సైబర్ మోసం, తప్పుడు సమాచారం, దొంగతనాన్ని గుర్తించడం, ఏఐ ఆధారిత గుర్తింపు పద్ధతులు, ప్రతికూల రక్షణ వ్యూహాలు, నైతిక పరిశీలనలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఐఐటీ హైదరాబాదు, ట్రిబుల్ ఐటీ హైదరాబాదు, హైదరాబాదు విశ్వవిద్యాలయం, ఐబీఎం, గూగుల్, టెక్ మహీంద్రా, ఇతర ప్రముఖ ఐటీ సంస్థల ప్రముఖులు పలు నైపుణ్యాలపై ఉపన్యాసాలు, కేస్ స్టడీలు, ఆచరణాత్మక శిక్షణ ఇచ్చారు. డీప్ ఫేక్ ముప్పులకు వ్యతిరేకంగా సైబర్ భద్రతను బలోపేతం చేయడంపై ఇందులో పాల్గొన్న వారికి విలువైన అంతర్దృష్టులను అందించారు. ఈ అధ్యాపక వికాస కార్యక్రమంలో భాగంగా నాలుగు పారిశ్రామిక సందర్శనలను కూడా ఏర్పాటు చేశారు. భారతదేశంలోని అతిపెద్ద ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థ అయిన టీ–హబ్, భారతదేశపు అతిపెద్ద ప్రొటోటైపింగ్ కేంద్రం టీ–వర్క్స్, ఐఐటీ హైదరాబాదులోని టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్ – అందులోని టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఆన్ అటానమస్ నావిగేషన్ జీఎంఆర్ గ్రూపు ఆవిష్కరణ విభాగం జీఎంఆర్ ఇన్నోవెక్స్‌లను సందర్శించి, అక్కడి ఆవిష్కరణలు, స్మార్ట్, స్థిరమైన మౌలిక సదుపాయాలపై విలువైన అనుభవాన్ని పొందారు. డీప్ ఫేక్ టెక్నాలజీల యొక్క సమగ్ర అవగాహన, గుర్తింపు పద్ధతులలో నైపుణ్యం, మెరుగైన సైబర్ భద్రతా అవగాహన, ప్రతిఘటనల అమలు, నైతిక, చట్టపరమైన దృక్పథాల గురించి తెలుసుకున్నారు. అలాగే పరిశోధన, పాఠ్యాంశాల అభివృద్ధి, పరిశ్రమ ఔచిత్యం కోసం అవకాశాలు వంటి కీలకమైన అంశాలపై పట్టు సాధించారు. ఎఫ్ డీపీ సమన్వయకర్త ప్రొఫెసర్ అక్కలక్ష్మి వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.

## గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

### ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నంగునూరి అశోక్ గుప్తా



**జవహర్‌నగర్, ఆగస్టు 30 (నినాదం):** గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని అంబేద్కర్ నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నంగునూరు అశోక్ కుమార్ గుప్తా అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అంబేద్కర్ నగర్ ఆర్యవైశ్య సంఘంలో ఏర్పాటు చేసిన పూజ కార్యక్రమంలో గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆర్యవైశ్య మహాసభ. మేడ్చల్ జిల్లా కోశాధికారి బల్లి శ్రీధర్ దంపతులు కాప్రా మండల అధ్యక్షులు పెద్ది మురళీకృష్ణ దంపతులు గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆర్యవైశ్య సంఘ సభ్యులతో కలసి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులకు పూజించి నీటి కాలుష్యాన్ని నియంత్రించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు సుబ్రహ్మణ్యేశ్వర సిద్ధాంతి కాప్రా మండల మాజీ అధ్యక్షులు. అంబేద్కర్ నగర్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు సకుటుంబ సమేతంగా పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## కాలుష్య కాసారం నుండి చెన్నాపురం చెరువును కాపాడండి

### రైతు సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పణ



**జవహర్‌నగర్, ఆగస్టు 30 (నినాదం):** కాలుష్య కాసారం నుండి చెన్నాపురం చెరువును కాపాడాలని, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ నాగేష్ బాబుకు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో చెన్నాపురం చెరువుకు ఎంతో విశిష్టమైన స్థానం ఉందని పురాతనమైన చెన్నాపురం చెరువును గత ప్రభుత్వం మినీ ట్యాంక్ గా తీర్చిదిద్ది ప్రజలకు పర్యాటకులకు అందుబాటులోకి తీసుకు వస్తానని వాగ్దానం చేసి కోట్ల రూపాయలు వెచ్చించి చెరువు కట్ట మాత్రమే మరమ్మత్తులు చేసి చేతులు దులుపుకున్నారని దుయ్యబట్టారు. నేడు ఆ చెన్నాపురం చెరువు పరిసర ప్రాంతాలు చెత్తా చెదారంతో కుప్పలు కుప్పలుగా రాసులు పోసి తగలబెట్టడం వల్ల కాలుష్య కాసారంగా అయిపోయిందని చెరువు అంతా గుర్రపుడెక్కలతో నీరు కనపడకుండా విస్తరించి ఉన్నదని ఈ చెరువును గురించి పట్టించుకునే నాధుడే కరువయ్యారని వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని దుర్వాసన నుండి చెరువును కాపాడియుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి గుర్రపుడెక్కలు తొలగించి ప్రజలకు ఎలాంటి అపాయం కలగకుండా చెరువు చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మేడ్చల్ జిల్లా కార్యదర్శి నిమ్మల నరసింహ, అధ్యక్షులు డి. జంగయ్య, ప్రజాశక్తి కళాకారుడు వెంకటాచారి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు శ్రీ లక్ష్మణ్, సిపిఐ శివనగర్ కార్యదర్శి ఎం. బాలయ్య, ఏ. సుధాకర్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మొక్కలతో స్వచ్ఛమైన గాలి

### గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య



**జిన్నారం/ పటాన్‌చెరు, ఆగస్టు 30 (నినాదం):** గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మధారం గ్రామంలోని అన్ని వార్డుల్లో ప్రతి ఒక్కరు ఇంటి చుట్టుపక్కల, రోడ్డు వెంట మొక్కలు పెంచాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామం లో తిరిగి మొక్కలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గాంధీ బొమ్మ సమీపంలో వాటర్ లీకేజ్ అవుతుండడంతో కాంట్రాక్టర్లు మరమ్మత్తులు నిర్వహిస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. వారికి శాశ్వతగా పరిష్కారం అవ్వాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు తమ వార్డుల్లో, రోడ్డు వెంట, ఇంటి చుట్టుపక్కల మొక్కలు పెంచినట్లయితే పచ్చదనంతో పాటు ప్రతి ఒక్కరి స్వచ్ఛమైన గాలి వస్తుందని, దీనివల్ల అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది బాలరాం, నవీన్, నర్సింగ్ పాల్గొన్నారు.

## గణనాథుల పూజలో పాల్గొన్న సొంటిరెడ్డి పున్నారెడ్డి

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 30 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం125 డివిజన్ గల వివిధ కాలనీలలో ఏర్పాటుచేసిన గణేష్ మండపాలను మాజీ టీపిసిసి ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజక కాంగ్రెస్ పార్టీ నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి సందర్శించి గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సొంటి రెడ్డి పున్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్య, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని దేవుని కోరుకున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. గణనాథుల నిమజ్జన సమయంలో నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ నిమజ్జనం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సొంటిరెడ్డి చైతన్య, అన్వర్, శ్రీనివాస్ గౌడ్, కాలనీ కమిటీ సభ్యులు, కాలనీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## బిజెపి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

**నాచారం, ఆగస్టు 30 (నినాదం) :** నాచారం డివిజన్ రాష్ట్ర బీజేపీ పార్టీ పిలుపు మేరకు నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు కొమ్మగల్ల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఏదైతే కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధి బీహార్ లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ దివంగత మాతృమూర్తి పై అనుచిత వాక్యలు చేసినందుకు నిరసన గా రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి రవినాయక్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, అనిత రెడ్డి, ప్రకాష్, రవికాంత్, రాజి రెడ్డి, దయ గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు పాదం వెంకటేష్, ఉదయ్ కిరణ్ రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షులు వెంకట్ నాయక్, సురేందర్ స్వామి, శేఖర్ గుప్త, వరలక్ష్మి, జ్యోతి రెడ్డి, భాస్కర్ వెంకటేశ్వర్లు, వెంకటేష్, కృష్ణ గౌడ్, శేఖర్, కౌశిక్, శ్రీమూర్తి నాగరాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## ఏకదంతుడికి విశేషపూజలు

**అల్వాల్, ఆగస్టు 30 (నినాదం):** వినాయకుడి అనుగ్రహంతో దేశంలోని ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీ బాలాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు పరంకుశ మాధవ్ అన్నారు.టెంపుల్ అల్వాల్ శ్రీ బాలాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి . మాధవ్, బి జనార్దన్, కె రవికుమార్, రాజా, వి నాగరాజ్, రామ్ సింగ్, టి నాగి, సంతోష్, వినయ్, మేజర్, పుల్లారెడ్డి, శ్రీనివాస్ ,ప్రభాకర్, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.



## వాడవాడలో ఏకదంతుడికి ప్రత్యేకపూజలు

**అల్వాల్, ఆగస్టు 30 (నినాదం):** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బొల్లారంలోని సంపత్ చిత్తారి కాలనీ లో నెలకొల్పిన మహా గణపతికి కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వినాయకుడి మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డోలి రమేష్, యాదగిరి, లింగారెడ్డి, పోచయ్య, అంజయ్య, మహేష్, శోభన్, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

**జిన్నారం/ పటాన్ చెరు ఆగస్టు 30 (నినాదం):** బారీ వర్షాల వల్ల గడ్డపోతారం , వావిలాల రోడ్ పూర్తిగా ధ్వంసం అయింది ఎల్లమ్మ గుడి దగ్గర గుంతలు పడడం వలన ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య ఆల్‌మిక్స్‌ను వేయించి తాత్కాలిక మరమ్మత్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలువద్దని ఉద్దేశంతో ఈ మరమ్మతులు నిర్వహించామన్నారు. కమిషనర్ కి వావిరాల, గడ్డపోతారం ప్రజల కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ నవీన్ ,బలరాం పాల్గొన్నారు.



## రిచ్ మాక్స్ గోల్డెన్ కంపెనీ ప్రారంభం

### తెలంగాణ ప్రజాసేవలో తరిస్తున్న రిచ్ మాక్స్ గోల్డ్ కంపెనీ

### ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**అల్వాల్, ఆగస్టు 30(నినాదం):** అల్వాల్లో ప్రారంభమైన ప్రముఖ గోల్డ్ లోన్ కంపెనీ రిచ్ మాక్స్ ఫిన్ వెస్ట్ కంపెనీ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు ఐదు శాఖలను సంస్థ సీఎండీ అడ్వకేట్ జార్జ్ జాన్ వాలత్ గారితో కలిసి తెలంగాణ శాసనమండలి సభ్యులు టిపిసిసి ప్రధాన కార్యదర్శి డాక్టర్ అద్దంకి దయాకర్,మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు అద్దంకి నాగమణి, మరియు మల్కాజిగిరి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు చేతుల మీదుగా అల్వాల్లో ఘనంగా ప్రారంభించారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్ నగరంలో మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ప్రముఖ తెలంగాణ ఉద్యమ నాయకుడు దిండిగల రాజేందర్,నర్సంపేటలో మార్కెట్ కమిటీ చైర్మన్ పళ్ళాయి శ్రీనివాస్, మహబూబాబాద్ లో జిల్లా కేంద్రంలో వార్డు కౌన్సిలర్ నరసింహారావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడ్ల మహేష్ చేతుల మీదుగా మరియు హైదరాబాదు నగరంలో బాలా నగర్ బ్రాంచ్ ను స్థానిక జిహెచ్ఎంసి కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా



ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ జ్యాలి సేల్స్ నేషనల్ హెడ్ ప్రవీణ్ ట్రైనింగ్ సెక్షన్ హెడ్ ప్రమోద్ కుమార్ సేల్స్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అలెక్స్ తెలంగాణ రాష్ట్ర సీనియర్ రీజినల్ మేనేజర్ జి ఉపేందర్ ఏరియా మేనేజర్ తిరుపతి క్లస్టర్ మేనేజర్లు మహేందర్ కళ్యాణ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు రాష్ట్రవ్యాప్తంగా శాసనమండలి సభ్యులు అద్దంకి దయాకర్ మాట్లాడుతూ కేరళలో దాదాపుగా 100 బ్రాంచీలు దేశవ్యాప్తంగా 150 శాఖలను కలిగి అతి తక్కువ సమయంలో దేశంలోనే అత్యంత వేగంగా అతి గొప్ప సంస్థగా మ్యాక్స్ గోల్డ్ లోన్ సంస్థ మరిన్ని శాఖలను విస్తరించాలని ఈ సందర్భంగా సంస్థ సీఎం డి జార్జ్ జాన్ వాలెత్తు అభినందించారు మాజీ శాసనసభ్యుడు మైనంపల్లి హనుమంతరావు గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 100 శాఖలు విస్తరించి వెయ్యి మంది యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రజల తరపున విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా చైర్మన్ గారు మాట్లాడుతూ తమ సంస్థ దేశంలో 1000 బ్రాంచీలను విస్తరించి 2030 నాటికి రిచ్ మ్యాచ్ గోల్డ్ లోన్ కంపెనీ మరియు ఇతర ఏడు విభాగాలను కలిపి రిచ్ మ్యాచ్ ప్రైవేటు బ్యాంకుగా అవతరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జార్జి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ పిఆర్ఓ డాక్టర్ సిహెచ్ భద్ర అల్వాల్ బ్రాంచ్ మేనేజర్ సుధీర్ బాలానగర్ బ్రాంచ్ మేనేజర్ కిరణ్ నర్సంపేట బ్రాంచ్ మేనేజర్ జక్కుల రమేష్ ఇల్లందు బ్రాంచ్ మేనేజర్ బొడ్డు సురేందర్ నాయకులు మల్లికార్జున్,ఒరిస్సా రాష్ట్రానికి చెందిన రిచ్ మాక్స్ ఏరియా మేనేజర్ ఆశీస్సులు మిత్ర గారు, క్లస్టర్ మేనేజర్ రితేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిందితునికి ఉరిశిక్ష విధించాలి



**వికారాబాద్, ఆగస్టు 30(నినాదం):** జిల్లా పరిధిలోని కామారెడ్డిగూడ గ్రామానికి చెందిన స్వాతి హత్య ఉదాంతంపై బిసి ఐక్య వేదిక స్పందించింది. ఈ సందర్భంగా శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎస్పీ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ నిందితుడు మహేందర్ రెడ్డిని ఫాస్ ట్రాక్ కోర్టు ద్వారా కేసును విచారణ జరిపించి అతడికి ఉరి శిక్ష విధించాలని ఆయన సంఘం తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వాతి ని అదే గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి అనే నరరూప రాక్షసుడు ప్రేమ పేరుతో ఆమెకు మాయమాటలు చెప్పి లొంగపరచుకొని రెండు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకొని ఈనెల 23వ తేదీన తల,కాళ్లు,చేతులు నరికి అతి గోరంగా హత్య చేసి మూసిలో పడవేయడం హృదయలను కదిలించిం దాన్నారు. అందజేశారు. నరహంతకుడికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి ఉరిశిక్ష పడేంత వరకూ బీసీ ఐక్య వేదిక కుటుంబానికి అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కే సాయన్న ముదిరాజ్, గొర్రెల మేకల పెంపకం దారుల వనపర్తి జిల్లా అధ్యక్షులు మధు యాదవ్, పూడూరు మండల్ మాజీ ఎంపీపీ మల్లేష్,బీసీ సంఘం జిల్లా కన్వీనర్ శంకర్ యాదవ్, దేవనోనిగూడెం మాజీ సర్పంచ్ నారాయణ యాదవ్, సిరిగాయిపల్లి మాజీ సర్పంచ్ వెంకట దాసు,వికారాబాద్ బీసీ సంఘం నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలం యాదవ్,బీసీ సంఘం ధారూర్ మండల కన్వీనర్ సుధాకర్ యాదవ్,బీసీ సంఘం వికారాబాద్ మండల కన్వీనర్ యాదగిరి యాదవ్,సంపత్ యాదవ్, మహేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు శ్రమదానంలో ముందుండాలి

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్**



**జమ్మికుంట, ఆగస్టు 30 (నినాదం):**విద్యార్థులు శ్రమదానం లో ముందుండాలని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్ అన్నారు. శనివారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన ఎన్ ఎస్ ఎస్ (జాతీయ సేవా పథకం ) ఆధ్వర్యంలో విద్యార్థులు, వలంటీర్లు, అధ్యాపకులు శ్రమదానం చేశారు. పిచ్చి మొక్కలను చెత్త, చెదారం తొలగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రమదానం వంటి కార్యక్రమాలలో పాల్గొనాలన్నారు. వ్యక్తిత్వ వికాసం, వాక్చాతుర్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందించు కోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది సెక్రెటరీ డా. గజేష్ అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె రాజేందర్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎంబడి రవి, లోకిండి రవీందర్, అధ్యాపకులు డాక్టర్ శ్యామల. డాక్టర్ మాధవి, ఉమాకిరణ్, శ్రీనివాస్ రెడ్డి, రాజ్ కుమార్, డాక్టర్.సుమ్మ, డాక్టర్ రవి ప్రకాష్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, శివకృష్ణ, సాయి, ప్రశాంత్, విద్యార్థుల వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలి

**మూకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు పొనగంటి మల్లయ్య**



**జమ్మికుంట, ఆగస్టు 30 (నినాదం):** మున్నూరు కాపులు ఆర్థికంగా, సామాజికంగా, విద్య, ఉద్యోగ పరంగా, రాజకీయంగా ఎదగాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నగంటి మల్లయ్య అన్నారు. శనివారం స్థానిక మండల కేంద్రంలో నియోజకవర్గ మున్నూరు కాపు ప్రతినిధుల తో సమావేశము మున్నూరు కాపు పట్టణ అధ్యక్షుడు ఆ బూత్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సభ్యత్వ నమోదు పుస్తకాలను ఆ సంఘ నియోజకవర్గ ఇన్చార్జ్ ముప్పిడి సునీల్ అందజేశారు. ఈ సందర్భంగా పొన్నగంటి మల్లయ్య మాట్లాడారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్షులు తమ మండలంలోని అన్ని గ్రామాల మున్నూరు కాపు కుల పెద్దలను సమన్వయం చేసుకుంటూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సీనియర్ నాయకులు ఆకుల రాజేందర్, సాయిని రవి, ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేందర్, పొన్నగంటి రవికుమార్, ఇల్లంతకుంట మండల అధ్యక్షులు అ ప్పాల రమేష్, వీణవంక మండల అధ్యక్షులు పురం శెట్టి చేరాలు, హుజురాబాద్ మండల అధ్యక్షులు ఆకుల సదానందం, రాష్ట్ర నాయకులు కూరగాయల తిరుపతి, పొన్నగంటి విష్ణు ,కందుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# రజకుల సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తాం

**జిల్లా రజక సంఘం అధ్యక్షులు రాచకొండ నరేష్**



**కరీంనగర్, ఆగస్టు30(నినాదం):** కరీంన గర్ జిల్లా రజక సంఘం ప్రథమ సమా వేశం స్థానిక జిల్లా కార్యాలయంలో జరి గింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు రాచకొండ నరేష్ మాట్లాడుతూ, జిల్లాలోని రజక సంఘాల ను కలుపుకొని పనిచేస్తానని, ప్రభుత్వం కల్పించిన జీవోల అమలు కోసం సమ స్యల సాధన కోసం పోరా టాలు నిర్వహి స్తానని రజకుల అభివృద్ధి, రజక సహకార సంఘాల నిధుల కోసం పోరాటాలు చేస్తానని రజక యువతకు బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించే రజక కార్పొరేషన్ కు 250 కోట్లు కేటాయించాలని రజక సంఘాలకు కేటాయించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు పూసాల సంపత్, జిల్లా గౌరవ అధ్యక్షులు కొత్తకొండ రాజయ్య ఆధ్వర్యంలో ఉద్యమాలు, సభలు, సమావేశాలు చేపట్టి ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి అనేక సమస్యలపై ఉద్యమిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకొండ శ్రీనివాస్ గంగిపల్లి నరేష్ పొన్నం శ్రీనివాస్ రాచకొండ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణా చర్యలు లేకుండా పదవి విరమణ పొందడం గర్వకారణం

**ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి**



**కరీంనగర్, ఆగస్టు 30(నినాదం):**పదవీ విరమణ, కొత్త బాధ్యతలు స్వీకరించిన అధికారులకు టీజీవోస్ ఘన సన్మానం, అభినందనలు తెలిపింది పశుసంవర్థక శాఖలో జాయింట్ డైరెక్టర్ గా పదవీ విరమణ పొందిన డా. టి సుధాకర్ , డిపార్ట్మెంట్ లో వివిధ హోదాలలో విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన మహమ్మద్ యూనిస్, ధర్మరాజు ని టీజీవోస్ పక్షాన ఘనంగా అభినందించారు.అదేవిధంగా పశుసంవర్థక శాఖలో డిప్యూటీ డైరెక్టర్ గా ఇన్చార్జ్ బాధ్యతలు స్వీకరించిన లింగారెడ్డి , స్టేట్ ఆడిట్ డిపార్ట్మెంట్ లో పదోన్నతి పొందిన జాయింట్ డైరెక్టర్ ను సన్మానించి శుభాకాంక్షలు అందజేశారు.ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పదవీ విరమణ పొందిన అధికారులు తమ సేవల ద్వారా శాఖలు విశిష్ట గుర్తింపు తెచ్చారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వారు అదే విధంగా కృషి చేసి శాఖ ప్రతిష్ఠను మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు అదే విధంగా ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పదవిలో చేరిన రోజే తన పదవీ విరమణ రోజు నిర్ణయమవుతుంది. 30-35 సంవత్సరాలపాటు క్రమశిక్షణతో, అంకితభావంతో విధులు నిర్వర్తించి, ఎలాంటి క్రమశిక్షణా చర్యలు లేకుండా పదవీ విరమణ పొందడం గర్వకారణం అని ఈరోజు రిటైర్ అవుతున్న మా సహచరులు ప్రభుత్వ సేవలో చేసిన విశిష్ట సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయి. ఇకపై ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందకర జీవితం గడపాలని మనస్పూర్తిగా కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో స్టేట్ ఆడిట్ డిప్యూటీ డైరెక్టర్ రాజ్ కుమార్, జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్, గెజిటెడ్ అధికారుల సంఘం కార్యదర్శి అరవింద్ రెడ్డి, టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కేంద్ర సంఘ నాయకులు ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, నాల్గవ తరగతి సంఘం అధ్యక్షులు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్, నాయకులు గౌరీకర్ రావు, కమలాకర్, హరిప్రియ విజయలక్ష్మి అఖిలేష్ రెడ్డి పోచయ్య రాజిరెడ్డి అల్లె శ్రీనివాస్, వంశీ, తిలక్, రాజేశ్వర్రావు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# మల్యాలలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



**మల్యాల, ఆగస్టు 30( నినాదం):** కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ బీహార్ లో సభ వేదికపై ప్రధాని మోదీ మాతృమూర్తి ని దూషిస్తూ అసభ్యకర వ్యాఖ్యలపై నిరసిస్తూ శనివారం మల్యాల మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంగడి బజారు లో రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దగ్దం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రధాని మోదీ మాతృమూర్తి పై అసభ్యకర వ్యాఖ్యలు దూషణలతో కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. రాహుల్ గాంధీ బేషరత్ గా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గాజుల మల్లేశం, కొల్లూరి గంగాధర్, కొడిచల రాజన్న, రాచర్ల రామన్న,హరీష్, సంకర్తి తిరుపతి, జనగాం రాములు, గద్దం చిన్న మల్లేశం, కందుల వినోద్, నీలం రవి, రుత్త కిషన్, లక్ష్మారెడ్డి ,మల్లేష్ యాదవ్, నక్క ఆనందం, గంగారాం, చందు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యాసరచన పోటీలలో ప్రథమ స్థానం సాధించిన ఆల్ఫోర్స్ విద్యార్థులు

**గెలుపొందిన విద్యార్థులకు, ప్రముఖ సైకిల్ కంపెనీ లు బిఎస్ఏ, హర్కులెస్ వారు సైకిల్స్ బహుమతిగా ఇచ్చారు**

**కరీంనగర్, ఆగస్టు 30(నినాదం):**విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే పోటీ తత్వాన్ని అలవర్చాలని వివిధ రకాల పోటీ పరీక్షలలో పాల్గొనేదందుకు ప్రోత్సాహం అందించడంతోపాటు సంబంధించి నటువంటి వనరులను సమాచారాన్ని అందించి నట్లయితే వారు తప్పనిసరిగా విజయం సాధిస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వినరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో విద్యార్థుల అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులకు వివిధ రకాల ప్రతిభా పాటవ పోటిలను నిర్వహించాలని తద్వారా వారిలో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీయవచ్చని ముఖ్యంగా విద్యార్థుల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించవచ్చని అభిప్రాయపడ్డారు.నేటి సమాజంలో విద్యార్థులు పోటీతత్వాన్ని తప్పనిసరిగా అలవర్చు కోవడమే కాకుండా పోటీ పరీక్షలలో పాల్గొని వివిధ ప్రతిభా




ఆధారిత కార్యక్రమాలలో పాల్గొని పై చెయి నిరూపించాలని సూచించారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యత పెంపొందించడం లక్ష్యంగా ప్రముఖ సైకిల్ కంపెనీ సైకిల్ కంపెనీ బిఎస్ఏ హర్కులెస్ వారి సౌజన్యంతో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగిందని చెప్పారు.ఈ వ్యాసరచన పోటీలలో అత్యుత్తమ వ్యాసాలను రూపొందించిన ఎం.ఆరాధ్య, బి.అక్షిత్ ప్రథమ ద్వితీయ స్థానాలను నిలవడమే కాకుండా సైకిల్స్ గెలుచుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. సుమారు 20 పైగా విద్యార్థులు చాలా చక్కటి వ్యాసాలను రూపొందించి ప్రోత్సాహక బహుమతులను గెలుచుకున్నారు. విద్యార్థులకు సైక్లింగ్ పట్ల విస్తృతంగా అవగాహన కల్పించాలని, సైక్లింగ్ చేయడం వలన ఆరోగ్యంగా ఉండటమే కాకుండా ఎన్నో లాభాలు చేకూరుతాయని వారు చెప్పారు. చాలా చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించి నందుకు బిఎస్ఏ హర్కులెస్ కంపెనీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, హర్క్యులెస్ కంపెనీ ప్రతినిధులు శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుండె జబ్బులకు ప్రాథమికంగా సీపీఆర్ తప్పనిసరి

**ఐఎంఏ ది హార్ట్ బీట్ నినాదంతో అవగాహన కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎనమల్ల నరేష్**



**కరీంనగర్, ఆగస్టు 30(నినాదం):** కార్డి యాక్ అరెస్టు సమయంలో ప్రాథమిక వైద్యం అందించడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డా ఏనమల్ల నరేష్ అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ ఐఎంఏ కరీంన గర్ శాఖ ఆధ్వర్యంలో ఐఎంఏ ది హార్ట్ నినాదంతో కార్డియో పల్మనరీ రీససిటేషన్ సీపీఆర్ అవగాహన శిక్షణా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.అధ్యక్షులు నరేష్ మాట్లాడుతూ, సిపిఆర్ శిక్షణ డాక్టర్స్, విలేకరులకు అవగహన కలిగి ఉండాల న్నారు. కరీంనగర్ ఐఎంఏ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 80 మంది, మీడియా ప్రతిని ధులు, అసుపత్రి సిబ్బంది పాల్గొని మ్యానిక్విన్స్ సహాయ లతో ప్రత్యక్ష శిక్షణ పొందారు. మన దేశం లో ప్రతి లక్ష మందిలో నాలుగు వేల మంది కార్డియాక్ అరెస్టు బారిన పడుతున్నారన్నారు. సీపీఆర్ పై సరైన అవగాహన లేకపో వడంతో రోగులు ఆసుపత్రికి చేరుకునేలోపు ప్రాణాలు కోల్పోతున్నారని, ఆసుపత్రిలో సీపీఆర్ చేసినా ఫలితాలు పరి మితంగానే ఉంటాయని, అం దుకే ప్రాథమిక దశలోనే సీపిఆర్ ప్రతి ఒక్కరూ నేర్చుకో వాలని పిలుపు నిచ్చారు.ఐఎంఏ ఆధ్వర్యంలో త్వరలో ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహిస్తాం.పోలీసులు, ఆర్టీసీ డ్రైవర్లు. కండక్టర్లు, కాలేజీ విద్యార్థులు, మీడియా మిత్రుల కోసం ప్రత్యేకంగా సీపీఆర్ శిక్షణా శిబి రాలు ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ సరేష్ తెలిపారు. "సీపీజర్ శిక్షణ ప్రతి ఒక్కరి జీవన నైపుణ్యంగా మారాలి" అని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో సీపీఆర్ అవగాహన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ సవీన్కుమార్, ట్రెజరర్ డాక్టర్ విజయ్కుమార్, డాక్టర్ ఎం.ఎల్.ఎన్.రెడ్డి, డాక్టర్ రాజే శ్వర్, డాక్టర్ రామ్కిరణ్, డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ ఓంప్రసాద్, డాక్టర్ మహేశ్వరరెడ్డి,డాక్టర్ రత్నాకర్, డాక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## విలేఖరి కుటుంబాన్ని పరామర్శించిన

# న్యూ ప్రెస్ క్లబ్ నాయకులు



**హుస్నాబాద్, ఆగస్టు 30 నినాదం :** హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజా దర్బార్ విలేఖరి లావుడ్య దేవేందర్ నాయక్ తండ్రి నిమ్మా నాయక్ గత నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో బాధప డుతూ పరామపదించగా శనివారం హుస్నాబాద్ మండలంలోని పుల్ నాయక్ తండాలోని వారి నివాసానికి వెళ్లి,బీజేపీ హుస్నాబాద్న్యూ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు హనుమంతు నాయక్ ఆధ్వర్యంలో కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా క్రీ.శే.నిమ్మా నాయక్ చిత్ర పటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని వేడుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలోన్యూ ప్రెస్ క్లబ్ నాయకులు కాశబోయిన రవీందర్, మాటూరు గోపి,మహమ్మద్ అక్రమ్, ఠాగూర్ నర్సింగ్, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## బీహార్ ఎన్నికల లబ్ది కోసమే

# బీజేపీ చీప్ పాలిటిక్స్

**ఎవరో అన్న మాటలను రాహుల్ గాంధీకి ఆపాదిస్తారా**

**రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దహనం చేయడంపై సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపాటు**



**కరీంనగర్, ఆగస్టు 30 (నినాదం) :** కరీంనగర్ బిజెపి నేత లపై సిటీ కాం గ్రెస్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేం దర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి దాన్ని బిజెపి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని మండి పడ్డా రు. కరీంనగర్లో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ దగ్ధం చేయటం పైన ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పత్రిక ప్రకటన విడుదల చేశారు. బీహార్ లోని పాట్నాలో రాహుల్ గాంధీ అధికార ఓటు యాత్ర లో ఎవరో కొంద రు అనుచిత వ్యాఖ్యలు చేస్తే రాహుల్ గాంధీ చేసినట్లు ఎలా ఆపాదిస్తారని ఆయన ప్రశ్నించారు. బీహార్ ఎన్నికల్లో లబ్ది పొందడం కోసమే సెంటిమెంటుని రగిల్చి ప్రజల్లో సానుభూతి పొందాలని మోడీ తల్లి పేరు వాడుకుం టున్నారని ఆయన అన్నారు.బీహార్లో మోడీ తల్లి పై కామెంట్ చేసిన వారిపై కేసు కూడా నమోదు అయ్యిందని ఈ విషయం తెలిసి కూడా కరీంనగర్లో బీజేపీ రాద్ధాంతం చేయటం దారుణమన్నారు. మోదీ తల్లి ని బీజేపీ నే అవమానిస్తోందని, దేశ వ్యాప్తంగా ప్రజలకు తెలియజెప్పి బీజేపినే చులకన అవుతోందని అన్నారు.

**ఓటర్ లిస్ట్‌పై ఎంపీడీఓ ఆఫీస్ నందు**



# అఖిల పక్ష సమావేశం

**జమ్మికుంట, ఆగస్టు 30 (నినాదం):**వీణవంక మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం లో శనివారం ఓటర్ లిస్ట్ పై అల్ పార్టీ మీటింగ్ నిర్వహించారు. ఎంపీడీఓ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో వార్డ్ ల వారీగా ఓటర్ జాబితా తయారు చేసిన వాటి లో కుటుంబం యూనిట్ గా తీసుకొని వార్డుల వారీగా చేసిన వాటికి రాజకీయ పార్టీ ల అభ్యంతరాలు వివిధ పార్టీల నాయకులు తెలియజేశారు.వాటిని పంచాయతీ కార్యదర్శిలు, గ్రామ కారోబార్లు తక్షణమే ప్రతి వార్డులో కుటుంబాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంపీడీవో ఎం శ్రీధర్ అధికారులకు సూచించారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, సీనియర్ నాయకులు కర్ర భగవాన్ రెడ్డి, గెల్లు శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ సునీల్, ఉయ్యాల నాగరాజు బీజేపీ నుండి మండల అధ్యక్షులు బత్తిని నరేష్,

# గణేష్ నిమజ్జనాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**నగర ప్రజలు ప్రతిఏటా మట్టి గణపతులనే ప్రతిష్ఠించి పూజించాలి**

**నగర మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు**

**కరీంనగర్, ఆగస్టు 30(నినాదం):**భక్తి శ్రద్ధలతో గణేష్ నిమజ్జనాలను ప్రశాంత వాతావరణం లో నగర ప్రజలు జరుపు కోవాలని బీజేపి నాయకులు నగర మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్లోని భగత్ నగర్ మాజీ మేయర్ క్యాంపు కార్యాలయంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న మట్టి గణనాథుని ముందస్తు నిమజ్జన వేడుక ఘనంగా జరిగింది. మాజీ మేయర్ యాదగిరి అపర్ణ సునీల్ రావులు మట్టి గణపతికి చివరి పూజ చేసి నిమజ్జనానికి తరలించారు. క్యాంపు కార్యాలయంలో పూజలు అందుకున్న మట్టి గణనాథుని కాలనీ వాసులు, యూత్ క్లబ్ సభ్యులు, క్యాంపు కార్యాలయ సిబ్బంది బ్యాండు మేలం, కోలాటాలు, వివిధ సంస్కృతిక నృత్యాలతో అంగరంగ వైభవంగా ఊరేగింపుగా తీసుకెళ్లి మానేరు డ్యాంలో నిమజ్జనం చేశారు. అట్టహాసంగా సాగిన మట్టి గణనాథుని నిమజ్జనం వేడుకలు నగర ప్రజలందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ,మట్టి గణపతిని ప్రతిష్ఠించి పూజించడం మహా శ్రేష్ఠం అన్నారు. మట్టి గణపతులను ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో పూజించడం ద్వారా విఘ్నాలు తొలగిపోయి కోరిన కోర్కెలు తీరి మోక్షం లభిస్తుందని తెలిపారు. నగర ప్రజలు ప్రతిఏటా మట్టి గణపతులనే ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. ప్రస్తుతం



మండపాల్లో ప్రతిష్ఠిస్తున్న ప్లాస్టర్ పారిస్ విగ్రహాలతో వాతావరణం కలుషితం చెంది జలచర జీవరాసులతో పాటు మానవాలికి మనుగడకు ప్రాణహాని కలిగిస్తున్నాయని తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరు మట్టి గణనాథులనే పూజించాలని కోరారు. నగర ప్రజలు గణేష్ నిమజ్జనాలను ప్రశాంత వాతావరణం లో జరుపుకోవాలన్నారు. మండపాల్లో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వర విగ్రహాలను భక్తి శ్రద్ధలతో పూజించి ప్రశాంత వాతావరణం లో నిమజ్జనాలు జరపాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరిశెట్టి మనోహర్ రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్, భగత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ఆదర్శయూత్ క్లబ్ సభ్యులు, చైతన్యయూత్ క్లబ్ సభ్యులు, పెద్దమ్మ యూత్ క్లబ్ సభ్యులు, మహదేవా యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలపై పోరాడుతాం

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు రాజ్యాంగ ఫలాలు అందించాలి**

**రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు కుతాడి శివరాజ్**

**కరీంనగర్, ఆగస్టు 30(నినాదం):**ప్రజా సమస్యలపై రిపబ్లికన్ పార్టీ కార్యకర్తలు పోరాటం చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని రాష్ట్ర అధ్యక్షులు కుతాడి శివరాజ్ పిలుపు నిచ్చారు.కరీంనగర్ స్థానిక రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఉత్తర తెలంగాణ ముఖ్య కార్యకర్తల సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు కుతాడి శివరాజ్ అధ్యక్షత వహించి ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందడం లేదని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఏం చేసింది లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులు అవుతున్నా కూడా ఏ ఒక్క నిరుపేద ప్రజలకు న్యాయం జరగలేదని ఆరోపించారు. కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు రాజ్యాంగ పలాలు అందించాలని డిమాండ్ చేశారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తుందని పార్టీని ప్రజల్లో వద్దకు తీసుకెళ్లి వారి సమస్యలపై పోరాటం చేయాలని ఉత్తర తెలంగాణ ముఖ్య కార్యకర్తల




సదస్సులో కార్యకర్తలకు శివరాజ్ పిలుపు నిచ్చారు.ఈ సమావేశం లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మొగురం మీరియా, బహుజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కన్నం లక్ష్మణ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కాశిపాక అజయ్, తెలంగాణ లేబర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గందే కొమురయ్య ముదిరాజ్, తడికోప్పుల వినోద్ కుమార్,ముత్యం అశోక్ రెడ్డి, అత్ర మణిష, జాడి చంద్రకళ, దుర్గ మ్యాదరి శ్రీనివాస్,కే పరమేశ్, గడ్డం రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ నేతలు

**మహిళలకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి**

**బిజెపి పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు**

**జమ్మికుంట, ఆగస్టు 30 (నినాదం):**ప్రపంచ దేశాల సైతం భారత ప్రధాని నరేంద్ర మోడీ సేవలను అభినందిస్తుంటే ప్రతిపక్ష నేత రాహు ల్ గాంధీ మాత్రం ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దేశ మహి ళలను కించపరిచే విధంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదని రాహుల్ గాంధీ ప్రధానిపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలోని గాంధీ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసిన బిజెపి నాయ కులు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లి పైన శుక్రవారం బీహార్ లో జరిగిన ఒక సభలో మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా జమ్మికుంట గాంధీ చౌరస్తా లో బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యం లో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా కొలకాని రాజు మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశ ప్రతిపక్ష నేతగా ఉండి, బీహార్ లో దొంగ ఓట్లు అంటూ ఓ దొంగ యాత్ర చేపడుతున్నారని, ఆ యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ ఒక సభలో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లి స్వర్గీయ హీరాబెన్ పై అసభ్యకర, అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలు దేశ మాతృమూర్తులందరిని భాదించాయని, వెంటనే రాహుల్ గాంధీ ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని దేశంలోని మహిళలకు రాహుల్



గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పదకొండు సంవత్సరాల మోడీ సుపరిపాలన చూస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు జీర్ణిం చుకోలేక పోతున్నారని, మోడీ ప్రభుత్వం పై చిన్న తప్పును చూపలేని అయోమయంలో రాహుల్ గాంధీ దేశంపై, మోడీ తల్లి పై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అన్నారు, రాజకీయం చేయ డం రాకపోతే, రాహుల్ గాంధీ ఇప్పటికైనా వారసత్వ రాజకీయాల నుంచి తప్పుకొని యువతకు అవకాశాలు కల్పించాలని కోరారు ఈకార్యక్రమంలో రాజేష్ ఠాకూర్, కైలాసకోటి గణేష్, పల్లపు రవి, బచ్చు శివన్న, ఇటుకాల స్వరూప, రాకేష్ ఠాకూర్, గిరవేన విజేందర్, పత్తి జనార్ధన్ రెడ్డి, బూరుగుపల్లి రాము, ఆకుల పోచయ్య, శ్రీవర్తి అఖిల్, కొమ్ము అశోక్, యాంసాని సమ్మయ్య, అప్పాల రవిందర్, కురిమిల్ల అశోక్, గట్టు రాకేశ్, ఆవాంచ వెంకటేష్, మ్యాదరి శంకర్, సిరియాల విజయ్ తదితరులు పాల్గొన్నారు

# ఆస్తి తగాదాలతో చిన్నమ్మను హతమార్చిన తనయుడు

**మృతురాలు ఏడు నెలల గర్భవతి**

**ఇల్లంతకుంట మండలం టేకుర్తి లో ఘటన..**

**జమ్మికుంట, ఆగస్టు 30 (నినాదం) :** ఆస్తి తగాదాతో తన తండ్రి చేసుకున్న రెండో భార్యను మొదటి భార్య కుమారుడు విచక్షణారహితంగా కత్తితో గొంతు కోసి హత్య చేసిన సంఘటన కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందకుంట మండలంలోని టేకుర్తి గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు ముద్రబోయిన రాము లు కు రేణుకతో



వివాహం జరిగింది. ఆమెకు ఇద్దరు కుమారులు. ఇద్దరి మధ్యన మనస్పర్ధలు వచ్చాయి. దీంతో రాములు సైదాపూర్ మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన తిరుమల (29) నీ రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటినుండి కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు జరుగుతుండడంతో ఇద్దరితో వేరువేరుగా కాపురం పెట్టాడు. ప్రస్తుతం ఆమె ఏడు నెలల గర్భవతి .ఇటీవల కాలంలో రెండవ భార్య పేరిట రాములు ఆస్థిరాస్తాడని తెలియడంతో మొదటి భార్య తన ఇద్దరు కుమారులతో కలిసి పంచాయితీ పెట్టింది. పలుమార్లు కుటుంబ సభ్యులకు సంబంధించిన పంచాయతీ విషయం పోలీస్ స్టేషన్కు సైతం చేరింది. ఆస్తి రెండో భార్య పేరిట తన తండ్రి రాస్తాడని భావించిన మొదటి భార్య రెండో కొడుకు బన్నీ వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చి ఇంటిలో ఒంటరిగా ఉన్న తిరుమల గొంతు కోసి పరారయ్యాడు. ఆస్తి కోసం 7 నెలల గర్భవతిని విచక్షణారహితంగా గొంతు కోయడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ లక్ష్మీనారా యణ, ఇల్లందకుంట ఎస్సై క్రాంతి కుమార్ లు సంఘటనా స్థలానికి చేరుకొని గర్భవతి అయిన తిరుమల మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్య చేసిన బన్నీ పరారీలో ఉండడంతో అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

## బత్తాయి రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది




**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 30 (నినాదం):** నల్గొండ జిల్లాలో బత్తాయి పంటను కాపాడేందుకు ప్రభు త్వానికి సూచనలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు .కమిషన్ రెండు రోజుల నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఉదయా దిత్య భవన్లో బత్తాయి రైతులు ,ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్ర వేత్తలతో బత్తాయి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ,సూచనలు, సలహాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిషన్ పర్యటనలో భాగంగా నల్గొండ జిల్లాలో నిడమనూరు మండలంలోని కొన్ని గ్రామాలలో బత్తాయి తోటలను పరిశీలించడమే కాకుండా, రైతులతో మాట్లాడడం జరిగిందని, నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న బత్తాయి మార్కెట్ ను సందర్శించి రైతులు, సమస్యలు,అభిప్రాయాలను తెలుసుకొన్నట్లు చెప్పారు. బత్తాయి రైతుల సమస్యలను , అభిప్రాయాలను క్రోడీకరించి సమగ్రమైన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. భవిష్యత్తులో బత్తాయి పంటను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని చెప్పారు. నల్గొండ జిల్లాలో బత్తాయి రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు కమిషన్ దృష్టికి వచ్చిందని, ముఖ్యంగా మార్కెట్లో మధ్య దళారీలు వ్యవస్థ, సౌకర్యాలు లేకపోవడం ,నిర్వహణ లోపం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. బత్తాయి మార్కెట్లో అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత మార్కెటింగ్ శాఖపై ఉందని ,రైతులు మార్కెట్ కు పంటను తీసుకొచ్చే విధంగా చూడాల్సిన అవసరం ఉందని ,పక్కనే ప్రైవేట్ మార్కెట్ నిర్వహించడం జరుగుతున్నదని, ప్రయివేట్ మార్కెట్ ను ప్రభుత్వ మార్కెట్ తో అనుసంధానం చేయాలని, నల్గొండలో బత్తాయి మార్కెట్ రైతులకు దగ్గరగా ఉండడమే కాకుండా, నమ్మకంగా ఉంటుందని ,ఈ మార్కెట్‌ను ఇలాగే కొనసాగించాలని అన్నారు. హైదరాబాదు లాంటి దూర ప్రాంతానికి బత్తాయిని తీసుకువెళ్లడం రవాణా ఖర్చులతో పాటు, రైతులకు ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. సాంప్రదాయ పంటగా ఉన్న బత్తాయి పంటను నిర్లక్ష్యం చేస్తే రాబోయే కాలంలో నల్గొండ జిల్లాలో బత్తాయి పంట కనబడకుండా పోతుందని, అందువల్ల రైతులు సైతం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి రైతు ఉత్పత్తి సంఘాలుగా ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని చెప్పారు.జిల్లా కలెక్టర్ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏ రకంగా బత్తాయి మార్కెట్ ను కాపాడవచ్చో ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలని , బత్తాయి పండించే క్షేత్రాలకు వెళ్లి పరిశీలించి ఒక నివేదిక సమర్పించాలని సూచించారు. నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారని ప్రభుత్వం వీరికి సహకరించి ధ్రువీకరణ వ్యవస్థ ఏర్పాటు చేస్తే అటు వినియోగదారునికి, ఇటు రైతులకు బాగుంటుందని సూచించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,కమిషన్ సభ్యులు భూమి సునీల్,భ్యూరాలు భవాని, వెంకన్న యాదవ్, రెడ్డి,డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ సురేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ జె డి బాబు, అదనపు కలెక్టర్లు జే. శ్రీనివాస్, నారాయణ అమిత్ ,రాష్ట్ర జిల్లా ఉద్యాన శాఖ ఉపసంచాలకులు సుభాషిని, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, మార్కెటింగ్ శాఖ అధికారి ఛాయాదేవి, వ్యవసాయ కమిషన్ ఓ ఎస్ డి గోపాల్ ,ఆర్డీవోలు అశోక్ రెడ్డి, రమణారెడ్డి, ఉద్యాన శాఖ అధికారి అనంతరెడ్డి ,,రైతు ఉత్పాదక సంస్థల ప్రతినిధులు నంద్యాల నరసింహారెడ్డి, రాంరెడ్డి, కర్నాటి లింగారెడ్డి ,నూకల వెంకటరెడ్డి, అశోక్ రెడ్డి, అంజిరెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి, జంగం రాజు ,సత్యనారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

## కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతం

**మహాదేవపూర్ఆగస్టు 30( నినాదం):**ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడం అలాగే మహారాష్ట్ర లోని ప్రాణహిత నది ఉప్పొంగి రావడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం వద్ద గోదావరీ ఉధృతం గా ప్రవహిస్తుంది.కాళేశ్వరం వద్ద గోదావరీ 12మీటర్ల పై నుండి ప్రహిస్తుండటం తో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ లోకి ఇన్ ఫ్లో 10 లక్షల 25 వేల 600ల క్యూసెక్కుల నీటి ప్రవాహం రాగ బ్యారేజ్ 85గేట్లు ఎత్తి దిగువకు అదే లెవల్లో నీటిని అధికారులు విడుదల చేశారు,వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోదావరీ నది, వాగులవైపు వెళ్ళరాదని సూచించారు.

# హత్యనా...? ఆత్మహత్యనా...?

**యువతి మృతిపై అనేక అనుమానాలు**

**3న అదృశ్యం...28న మృతదేహం గుర్తింపు**

**క్షుద్ర పూజలకు బలి అంటూ ప్రచారం**

**కలకలం రేపుతున్న కప్పల వర్షిణి మృతి**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రెండు రోజుల క్రితం అనుమాన స్పద స్థితిలో లభ్య మైన యువతి మృతిపై అనేక అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన కప్పల వర్షిణిగా గుర్తించగా సదరు యువతిదీ హత్యనా ఆత్మ హత్యనా అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి పక్కన కమలాపూర్ క్రాస్ సమీపంలోని మేడిపల్లి అడవి ప్రాంతంలో కుళ్లి పోయిన స్థితిలో యువతి మృత దేహం లభ్యం కావడం జిల్లాలో కలకలం రేపింది. అయితే పోలీసులు ఘటనా స్థలంలోనే యువతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ప్రాథమికంగా సేకరించిన ఆధా రాలతో వర్షిణిది హత్య అని భావిస్తుండగా ఎవరు... ఎందుకు చేశారనేది మిలియన్ డాలర్ ప్రశ్నగా మిగిలింది.

**ఇరువై రోజుల క్రితం...**

ఇరువై ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన వర్షిణి ఈ నెల 28న మేడిపల్లి అటవీ ప్రాంతంలో విగత జీవిగా కన్పిం చింది. అప్పటికే ఆమె మృతి చెందిన మూడు నాలుగు రోజులు అయి ఉంటుందనే అను మానాలు ఉన్నాయి. ఈ నెల 3న ఇంటి నుంచి వెళ్లిన వర్షిణీ అటవీ ప్రాంతంలో దారుణమైన స్థితిలో మృతదేహం లభ్యం కావడం అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంతకా లం వర్షిణి ఎక్కడ ఉంది...ఎవరితో వెళ్లింది...ఇక్కడికి మృతదేహం ఎలా వచ్చింది...ఇక్కడే హత్య చేశారా అనే అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**క్షుద్రపూజల పేరిట...**

మేడిపల్లి అటవీ ప్రాంతంలో వర్షిణీ మృత దేహం లభ్యం కావడంతో క్షుద్రపూజలకు బలి తీసుకున్నారంటూ ప్రచారం జరుగు తోంది. అయితే యువతిని నమ్మించి తీసుకెళ్లి హత్య చేసిన వాళ్లే దృష్టి మళ్లించేందుకు క్షుద్రపూజలకు బలి తీసుకున్నట్లు నమ్మించే ప్రయత్నాలు చేశారా అనే సందేహాలు సైతం వ్యక్తం అవుతున్నాయి. ఇరువై రోజుల క్రితం వెళ్లిపోయి ఎవరికి కన్పించని వర్షిణీ ఈ అటవీ ప్రాంతంలోనే హత్యకు గురి కావడం వెనుక రహస్యం ఏంటని తీవ్ర చర్చ జరుగుతోంది.

**వివిధ కోణాల్లో విచారణ...**

వర్షిణి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిం చిన పోలీసులు ప్రాథమికంగా హత్యగా నిర్ధా రించుకుని ఆ దిశగా విచారణ చేస్తున్నట్లు సమాచారం, కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువుల నుంచి వివరాలు సేకరించే పనిలో నిమగ్నం అయ్యారు. ఇప్పటికే వర్షిణీ కాల్ డేటా సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఈ నెల 3న వర్షిణి ఎక్కడికి, ఎవరితో వెళ్లింది.. .ఆమెను ఎందుకు హత్య చేశారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. నిజంగానే క్షుద్రపూజలకు యువతిని బలి తీసుకున్నారా అనే కోణంలో సైతం విచారణ చేస్తున్నట్లు తెలి సింది. ఏది ఏమైనా పోలీసులు అతి త్వరలోనే వర్షిణీ హత్య మిస్టరీ తేల్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. వర్షిని మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసు అధికారులు తెలిపారు.

## గల్లంతైన యువకుడి ఆచూకీ లభ్యం

**కోదాడ,ఆగస్టు 30(నినాదం):** గొండ్రియల గ్రామానికి చెందిన యువకుడు కిన్నెర ఉపేందర్ గురువారం సాయంత్రం పాలేరు వాగులోకి దూకి గల్లంతయ్యాడు. గత రెండు రోజులుగా పోలీసులు రెస్క్యూ టీం గాలింపు చర్యలను చేపట్టిన.శనివారం ఉదయం తెలియాడుతూ కనిపిస్తున్న మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు... ఇదే విషయమై డీఎస్పీ శ్రీధర్ రెడ్డి శనివారం పత్రిక ప్రకటన విడుదల చేశారు... ఈనెల 28 న గోండియాల గ్రామ శివారులో తిరుపతమ్మ ఆలయం వద్ద పాలేరు వాగు నుండి గ్రామానికి చెందిన ఉపేందర్ అనే యువకుడు దూకి గల్లంతైన విషయం అనంతగిరి పోలీసులకు సమాచారం అందిందన్నారు. విషయం తెలిసిన వెంటనే, అగ్నిమాపక, సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి చేరారు. అనంతగిరి ఎస్సై నవీన్ కుమార్, సిఐపి రూరల్ ఆధ్వర్యంలో ఉపేందర్ గురించి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు.భారీ వర్షం చీకటి పడటం, వాగు నీటి ప్రవాహం ప్రతికూల వాతావరణ పరిస్థితుల మూలంగా గల్లంతయిన వ్యక్తిని కనుగొనలేదని తెలిపారు.పాలేరు వాగు వెంబడి గల చుట్టుపక్కల గ్రామాలకు, కోదాడ రూరల్, ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, ఎన్టీఆర్ జిల్లాలోని చిల్లకల్లు పోలీస్ స్టేషన్కు సమాచారం అందించమన్నారు. కొత్తగూడెం చెక్ డ్యామ్ రెడ్లకుంట చెక్ డ్యామ్ అన్నారం బ్రిడ్జి వద్ద కూడా నిఘా ఉంచామన్నారు. చుట్టుపక్కల పొలాల స్థానిక మత్స్యకారులు రైతులను అప్రమత్తం చేసినట్లుగా తెలిపారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులతో మాట్లాడుతూ పాలేరు నీటి ప్రవాహం పై ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారంను సేకరిస్తూ తగు జాగ్రత్తలతో రెస్క్యూ ఆపరేషన్ ను కొనసాగించమన్నారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల నుండి, పడవ సహాయంతో ఎస్డిఆర్ఎఫ్. సిబ్బందితో పాటు రాత్రి 10 గంటల సమయం వరకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగించారు .కొత్తగూడెం గ్రామంలోని చెక్ డ్యామ్ నుండి మృతదేహము కిందికి వెళ్లకుండా స్థానిక మత్స్యకారులు గ్రామస్తుల సహాయంతో డ్రాగన్ లైట్లో సహాయంతో నిశిత పరిశీలన పెట్టామన్నారు.. శనివారం ఉదయం గంటల నుండి తిరిగి ప్రయత్నాలు కొనసాగిస్తుండగా ఉదయం సమయంలో మృతదేహాన్ని గుర్తించి, తదుపరి విచారణ కోసం కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లుగా డిఎస్పి తెలిపారు.

## గణనాథునికి మహిళల హారతులు



**మహాదేవపూర్ ఆగస్టు 30, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రం లోని ఆర్యవైశ్య సంఘంలో నిర్వహించిన గణపతి నవరాత్రులలో నాల్గవ రోజు శనివారం గణనాథునికి మహిళలు పలురకాల మంగళహార తులతో పూజలు నిర్వహించారు. ఒక్కో మహిళా ఒక రకమైన మంగళహారతిని అలంకరించుకొని తీసుకువచ్చి ఒక్కో మంగళహా రతి పాడి గణనాథునికి హారతులను అందించారు. ఈ కార్యక్ర మంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

## కరపత్రాల ఆవిష్కరణ



**మహాదేవపూర్ ఆగస్టు 30, ( నినాదం):** సోమవారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద జరిగే పాత పెన్షన్ సాధన పోరాట సభ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ గెజిటెడ్ అధికారుల కార్మిక పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ కమిటీ 206 సంఘాల ఆధ్వర్యంలో జరగబోయే ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు తిరుపతిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మధు, సారంగపాణి, ఓలీ పాషా, సుధారాణి, సరిత, రజిత, వసుదప్రియ తో పాటు టీజేఏసీ లోని ఉపాధ్యాయ సంఘ నాయకులు కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## నూతన బస్సులను ప్రారంభించిన జిఎం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీ సింగరేణి ఉన్నత పాఠశాలలో ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి పాఠశాలకు నియమించిన రెండు బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ ఈ స్కూలు బస్సులు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం, త్వరగా సేవలలోకి బస్సులను తీసుకురావడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఇది ఎంతో సౌకర్యవంతంగా, ఉపయోగకరంగా ఉంటుందని వారి విలువైన సమయాన్ని కోల్పోకుండా ఈ బస్సుల ద్వారా త్వరగా పాఠశాలకు చేరుకోవచ్చునని అన్నారు. విద్యార్థులు ఎలాంటి భయభ్రాంతులకు గురి కాకుండా, సురక్షితంగా పాఠశాలకు చేరుకోవచ్చని ఆయన అన్నారు. సింగరేణి పాఠశాల విద్యార్థులు పదవ తరగతిలో గత సంవత్సరం మంచి ర్యాంకులను కైవసం చేసుకున్నారని, నూటికి నూరు శాతం ఉత్తీర్ణులు అయ్యారని అదేవిధంగా ఈ సంవత్సరం కూడా 10వ తరగతి విద్యార్థులు జిల్లా స్థాయి ర్యాంకులను తీసుకువచ్చి పాఠశాలకు, సింగరేణి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్, (పాఠశాల కరస్పాండెంట్) కావూరి మారుతి, పాఠశాల ప్రిన్సిపల్, ఝాన్సీ రాణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుని దర్శించుకున్న ఎమ్మార్వో, ఆర్ఐ



**డోర్నకల్/మరిపెడ ఆగస్టు 30 (నినాదం న్యూస్):** మరిపెడ మున్సి పల్ కేంద్రంలోని ఆర్ఎస్ ప్లాజా గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వరంలో కొలు వుదీరిన విగ్నేశ్వ రుని మరిపెడ మండల ఎమ్మార్వో కృష్ణవేణి,ఆర్ఐ శరత్ చంద్ర దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ వారు శాలువాతో సత్కరించి ఆ విగ్నేశ్వరుని ఆశీస్సులతో ఉన్నత శిఖరమైన పదవులను పొంది. ఆయురోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖంగా జీవించే విధంగా విగ్నేశ్వరుని కరుణ కటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆర్ఎస్ ప్లాజా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కోరుకున్నారు...

## పట్టా పేరుతో భూములు లాక్కుంటే ఊరుకోం

**ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్ సింగ్ నాయక్**



**మహాముత్తారం, ఆగస్టు 30(నినాదం):** పట్టా పేరుతో గిరిజనుల భూములు లాక్కుంటే ఊరుకునేది లేదని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్ నాయక్ స్పష్టం చేశారు. శనివారం మహాము త్తారం మండలం నిమ్మగూడెం గ్రామంలో ప్రజా దర్బార్ నిర్వహించి మాట్లాడారు. మహా ముత్తారం మండలం నిమ్మగూడెం గ్రామానికి సంబంధం లేని ముక్తేదారు జగన్నాధ రావు నిజామాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి వారి బంధువుల పేర్ల పై గిరిజనులను తెలియకుండా 1956 సంవత్సరంలో 600 ఎకరాల భూమిని పట్టా చేసుకున్న పట్టాలను రద్దు చేయాలని లేని పక్షంలో ప్రజా ఉద్యమాల ద్వారానే భూమిని సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ భూమిలో నిమ్మగూడెం గ్రామానికి చెందిన గిరిజన, హరిజన, బలహీన వర్గాలకు చెందిన రైతులు భూమిని సాగు చేసుకుంటున్నారని జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని వారి పట్టాలను రద్దు చేసి ముఖ సర్వే చేసి ఇక్కడ ప్రజలకు పట్టాలు అందించాలని అన్నారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు కిరణ్ మాట్లాడుతూ ప్రజల ఆర్థిక పరిస్థితులు చూసి కొంతమంది మాజీ నక్సలైట్లు రంగ ప్రవేశం చేసి తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకొని డబ్బులు పంచుతున్నారని మీ పద్ధతులను మార్చు కోకుంటే ప్రజాక్షేత్రంలో గెలుచుకుంటామని కిరణ్ పేర్కొన్నారు. కొంతమంది నిమ్మగూడెం గ్రామానికి చెందిన మధ్యవర్తులను డబ్బు ఆశ చూపి ప్రజలను మోసం చేస్తున్నారని వారు ఆలోచన చేయాలన్నారు. ఆదివాసి హక్కుల సంఘీభావ వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అయిత బాపు మాట్లాడుతూ కొమరం భీమ్ అంబేద్కర్ వారసులమని నిమ్మగూడెం వాసులు గత భూ పోరాటంలో భూ కబ్జా చేసిన ఆంధ్ర వారిని తరిమికొట్టిన చరిత్ర ఈ గ్రామానికి ఉందని గత చరిత్రను మర్చిపోకుండా భూమినీ మన నుండి లాక్కుని ప్రయత్నం చేస్తున్న వారిని తరిమికొట్టే పరిస్థితి నెలకొందని ఆయన వివరించారు. గతంలోనే 28 మంది ఆదివాసులపై పోలీసులు కేసులు పెట్టారని నేడు కూడా నలుగురు పై కేసు పెట్టి బెదిరిస్తున్నారని కేసు పెట్టిన ఆజంనగర్ గ్రామానికి చెందిన వారు కేసును వెనక్కి తీసుకోవాలని కోరారు. ఇక్కడ ప్రజల నుండి భూమి లాక్కునే ప్రయత్నం చేస్తున్న కుట్ర దారులైన ముత్తారం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్ బాబును కోరారు.

మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకొని 1956 లో అక్రమ పట్టాలను చేసుకున్న వారి పేర్లపై పట్టాలను రద్దు చేయించి, ముఖ సర్వే చేయించి సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి ఈ కార్యక్రమంలో. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రామగిరి రాజు. తెలంగాణ రైతు పోరాట వేదిక అధ్యక్షులు రమేష్ తో పాటు గ్రామానికి చెందిన ప్రజలు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల్లో సైబర్ మోసాలపై అవగాహన బ్యానర్లు



**నల్లబెల్లి ఆగస్టు 30 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో సైబర్ మోసాలను అరికట్టేందుకు స్థానిక పోలీసు విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఎస్సై గోవర్ధన్ గణపతి మండపాల వద్ద ప్రజలకు అవగాహన కల్పిస్తూ బ్యానర్లను ఆవిష్కరించారు.

ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ మోసగాళ్లు ఏపీకే ఫైల్స్ ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని, మొబైల్ ఫోన్లలో వచ్చే అనుమానాస్పద మెసేజ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని హెచ్చరించారు. చిన్నపిల్లలు నుండి పెద్దల వరకు అందరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు.సైబర్ నేరగాళ్ల వలలో పడితే ఆర్థిక నష్టం మాత్రమే కాకుండా, వ్యక్తిగత డేటా కూడా ప్రమాదంలో పడుతుందని ఆయన స్పష్టంచేశారు. ఈ మోసాల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కలగాలని, గణపతి మండపాల వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్ల ద్వారా చైతన్యం కల్పించడం లక్ష్యమని తెలిపారు.ప్రజలు జాగ్రత్తలు పాటిస్తేనే సైబర్ మోసాలను అరికట్టగలమని, అనుమానాస్పద లింకులు, ఫైల్స్, ఫోన్ కాల్స్ విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గోవర్ధన్ పిలుపునిచ్చారు.

## బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు



**నల్లబెల్లి ఆగస్టు 30 (నినాదం):** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు పథకాలను అభినందిస్తూ నల్లబెల్లి మండలం నాగరాజు పల్లి గ్రామపంచాయతీ ఒల్లె నర్సయ్య పల్లె గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి మూడు కుటుంబాలు చేరికలు మండల్ పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కండువా కప్పి ఆహ్వానించినారు ఎరుకల రాములు వల్లె సాంబయ్యచిన్న చెంచు కొమరయ్య ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ చిట్యాల ఉపేందర్ రెడ్డి గ్రామ పార్టీ అధ్యక్షుడు వల్ల పైడి గ్రామ పార్టీ యూత్ అధ్యక్షుడు కదురు నరేష్ ముస్కు రవి కదురు కుమారస్వామి చెంచు మైపాల్ కదురు రవి వల్లె శీను.. తదితరులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ నాయకులతో సమావేశం

**మల్లాపూర్, ఆగస్టు 30 (నినాదం) :** మల్లాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ శశి కుమార్ రెడ్డి అధ్యక్షతన వార్డుల వారిగా ప్రచురించబడిన ముసాయిదాపై అన్ని పార్టీల నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. పొందుపరిచిన జాబితాలో ఉన్న సందేహాలను తెలియజేశారు. ముసాయిదా జాబితా పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపగలరని కోరారు. ఈ సమావేశంలో రాణి, ఎంపీఓ జగదీష్, కాంగ్రెస్ నాయకులు పుండ్ర శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు గోపిడి శ్రీనివాస్ రెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు తోట శ్రీనివాస్, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఓటర్ల డ్రాఫ్టింగ్ అభ్యంతరాల పరిశీలన



**నల్లబెల్లి ఆగస్టు 30 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల ఆదేశాల మేరకు స్థానిక గ్రామ గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా నేడు మండల పరిషత్ కార్యాలయం నందు అన్ని పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయనైనది.నల్లబెల్లి ఎంపీడీఓ పసరగొండ రవి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలు స్వీకరించడం జరిగింది.ఓటర్ల డ్రాఫ్టింగ్ అభ్యంతరాలను స్వీకరించి పరిశీలించారు.ఫోటో ఓటర్ల జాబితాను వార్డుల వారీగా తేదీ 02.09.2025 రోజున తుది జాబితా ప్రకటించ బడును అని తెలిపారు.నల్లబెల్లి మండలంలోని 29 గ్రామపంచాయతీలకు 252 వార్డులు పోలింగ్ స్టేషన్లు కలవు అని అన్నారు.ఈ కార్యక్రమం లో మండల స్పెషల్ ఆఫీసర్ దేవేందర్ సూపర్ డెంట్ అబిద్ అలీ పి ఆర్ ఏఈ అమీర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిట్యాల తిరుపతి రెడ్డి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బానోత్ సారంగపాని బిజెపి పార్టీ మండల అధ్యక్షులు తడుక వినయ్ గౌడ్ ఎం సిపిఐ పార్టీ మండల అధ్యక్షులు దామా సాంబయ్య మండల కార్యకర్తలు తదితరులు గపాల్గొన్నారు.

## గీతాంజలి పాఠశాలలో ఘనంగా రెడ్ డే సెలబ్రేషన్స్



**నర్సంపేట, ఆగస్టు 30(నినాదం ):** నర్సంపేట పట్టణం లోని గీతాంజలి పాఠశాలలో రెడ్ డే సెలబ్రేషన్స్ శనివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. విద్యార్థులు వివిధ రకాల ఎరుపు రంగు గల పూలు, పండ్లు, వస్తువులతో బొమ్మలు, బెలూన్ లు తీసుకొని వచ్చి పాఠశాలలోని వేదికను అలంకరించడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. రాజేష్ మాట్లాడుతూ చిన్న వయస్సులో ఉన్న విద్యార్థులకు రంగులు, పేర్లు మనస్సుకు హత్తుకునే విధంగా తెలియ చేశారాన్నారు. అదే విధంగా ప్రైమరీ పాఠశాల విద్యార్థులు ఎరుపు రంగు దుస్తులు ధరించడమే కాకుండా పండ్లు, కూరగాయల బొమ్మల వేషాలు ధరించి రావడం జరిగింది. ప్రైమరీ పాఠశాల ప్రిన్సిపాల్ రాధ మాట్లాడుతూ ఈ కార్యక్రమంతో విద్యార్థులలో నూతన ఉతేజం కలిగిందన్నారు.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసికోల్లాసానికి శరీర దృఢత్వానికి తోడ్పాటు

**-జిల్లా గ్రంధాలయ చైర్మన్ కోట రాజబాపు**



**మహాదేవపూర్ ఆగస్టు 30, ( నినాదం):** క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దృఢత్వానికి ఎంతో తోడ్పాటు అందిస్తాయని జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంధాలయ చైర్మన్ కోట రాజబాపు అన్నారు. మేజర్ ధ్యాన్చంద్ జన్మదిన పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలలో భాగంగా మహాదేవపూర్ మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ పాఠశాల బాలికల పాఠశాల ఆధ్వర్యంలో క్రీడాజ్యోతిని వెలి గించి క్రీడా రన్ నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా గ్రంధాల చైర్మన్ కోట రాజబాబు, పిఏసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు మాట్లా డుతూ క్రీడలు మహాదేవపూర్ పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో నేషనల్ ఇంటర్నేషనల్ స్థాయికి ఎదగాలని, క్రీడలు శరీర దృఢత్వా నికి, మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయని క్రీడల ప్రాముఖ్యతను వారు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయు డు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు పిడి గురుసింగ పూర్ణిమ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు అనిల్ కుమార్, రిటైర్డ్ పిఈటి అంకమ్మ, తో పాటు పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**చౌటుప్పల్ ఆగస్టు 30 (నినాదం) :** మునుగోడు నియోజకవర్గం, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ఆర్కే హాస్పిటల్ మరియు కామినేని హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో పల్లె పల్లె కి వైద్యం కార్యక్రమంలో భాగంగా, చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 123 వ,ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి. అనంతరం వారు మాట్లాడుతూ,ప్రజలకు సేవ చేసే వ్యక్తులకు (మున్సిపల్ సిబ్బందికి) వైద్య శిబిరం నిర్వహించడం మంచి పరిణామం అని అన్నారు. అలాగే చావా ఫౌండేషన్ నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వమే అన్ని చేయాలంటే కాదు, ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ తోటి సామాజిక కార్యక్రమాలు చేయాలని కోరారు. మా తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద ఇటువంటి సామాజిక కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. అందుకే చావా ఫౌండేషన్ కి మా ఫౌండేషన్ తరపున మా ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు.నేను శాసనసభ్యుడుగా కాకుండా ఒక స్నేహితుడు లాగా, వ్యక్తిగా సహాయం చేస్తానని తెలిపారు.పదవి అనేది శాశ్వతం కాదు, కానీ మన వ్యక్తిత్వం సేవ చేయాలని గుణం ఉండడం శాశ్వతం అని అన్నారు.సేవ చేయాలనే గుణం పుట్టిన నాటి నుండి మరణించే వరకు ఉంటుంది.. కానీ పదవి ఉండదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో, చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఉబ్బు వెంకటయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెండి రాజు వెన్ రెడ్డి రాజు, చౌటుప్పల్ మున్సిపాలిటీ టౌన్ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్



**మిర్యాలగూడ ఆగస్టు 30(నినాదం) :** దామరచర్ల మండల పరిధిలోని బోత్తలపాలెంలో గల ఆదర్శ పాఠశాలలో 2025-2026 విద్యాసంవత్సరానికి గాను 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు అదే విధంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసి,సీఈసీ గ్రూపులలో మిగిలి ఉన్న ఖాళీల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ తీసుకోవడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ పోతురాజు నరహరి ఒక ప్రకటన తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు తమ యొక్క టీసీ,స్టడీ కండక్ట్,ఆధార్ కార్డ్ జిరాక్స్, రెండు పాస్ ఫోటోలతో పాఠశాల పని వేళలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బాలికలకు పరిమితిగా ఉచిత హాస్టల్ సీటు ఉన్నాయని కాబట్టి పదవ తరగతి పూర్తి చేసిన బాలికలు వెంటనే ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఫోన్ నెంబర్: 98857 61013....

## ఉచిత కుట్టు మిషన్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

### కార్యదర్శి పెద్దపల్లి రాధ

### కనుకులలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం



**సుల్తానాబాద్, ఆగస్ట్ 30(నినాదం):** గ్రామాల్లోని మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సద్విని యోగం చేసుకోవాలని కనుకుల కార్యదర్శి పెద్దపల్లి రాధ పిలుపుని చ్చారు.సుల్తా నాబాద్ మండలం కనుకుల గ్రామంలో గ్రామ స్వ రాజ్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని జిల్లా కోఆర్డినేటర్ ధనలక్ష్మి,మండల ట్రేట్నర్ బండారి మమతతో క లిసి ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడు తూ, గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ నిర్వహించి సర్టిఫికెట్లు అంది స్తామని అన్నారు.అలాగేమహిళలకు 50 శాతం సబ్సిడీపై కుట్టు మిషిన్లు అందజేయడం జరుగు తుంది అని, ఈ అవకాశాన్ని గ్రామాల్లోని మహి ళలు సద్వినియోగం చేసుకోవాలని ట్రైనర్ బం డారి మమత, కార్యదర్శి రాధా, కోఆర్డినేటర్ ధన లక్ష్మి, సి ఎ రజిత కోరారు. ఈ సందర్భంగా గ్రామ స్వరాజ్య సంస్థ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పా రు.

## దళారులను నమ్మి మోసపోవద్దు..

### ఉద్యోగాల మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు30(నినాదం):** ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసం చేసే దళారులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ.హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం జిల్లాలోని ఏ ప్రభుత్వ శాఖ పరిధిలో ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతులలో నియామకాలు జరగడం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం ఒకవేళ వివిధ అవసరాల పై తాత్కాలిక ప్రాతిపదికన ఔట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ పద్ధతులలో నియామకాలు చేపడితే కలెక్టర్ ఆధ్వర్యంలో అర్హతలు పరిశీలించి, పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఔట్ సోర్సింగ్,కాంట్రాక్ట్ పద్ధతులలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంతమంది దళారులు అమాయకుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమకు సమాచారం అందిందని, నియామక ప్రక్రియలో డబ్బుకు, సిఫార్సులకు ఎక్కడ ఆస్కారం ఉండదని, ప్రజలు ఎవరు అనవసరంగా దళారులను నమ్మి మోసపోవద్దని, అనవసరంగా డబ్బును కోల్పోవద్దని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## వరల్డ్ ఛాంపియన్ తానిపర్తి చికితకు ఘన సన్మానం



**సుల్తానాబాద్, ఆగస్ట్ 30(నినాదం):** వరల్డ్ యూత్ ఛాంపియన్ షిప్ ఆర్చరీ పోటీలో స్వర్ణ పతాకం సాధించిన సుల్తాన్ పూర్ గ్రామ ము ద్దుబిడ్డ తానిపర్తి చికిత ను సుల్తాన్ పూర్ ఏఏ న్ఎం సులోచన, సెకండ్ ఏఎన్ఎం జ్యోష్ణ రాణి, ఆశాలు పద్మ, లక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సన్మా నించారు. శనివారం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మం డలం సుల్తాన్ పూర్ గ్రామపం చాయతీ ఆవరణ లోతెలంగాణ ముద్దు బిడ్డ సుల్తాన్పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికితను ఏఎన్ఎం సులోచన శాలువాతో సత్కరించారు. సందర్భంగా మాట్లా డుతూ, కెనడా వేదికగా జరిగిన విన్నిపెగ్ 2025 వరల్డ్ యూత్ ఛాంపియన్ షిప్ ఆర్చరీ పోటీలో అండర్ 21 మహిళల కాంపౌండ్ విభాగంలో 20 ఏళ్ళ చిరుప్రాయంలో అగ్రశ్రేణి క్రీడాకారిణులను మట్టి కరిపించి స్వర్ణ విజేతగా చికిత నిలిచి స్వర్ణ పతాకం సాధించి భారత దేశ మొదటి మహిళా కాంపౌండ్ ఆర్చర్ గా సరికొత్త చరిత్ర సృష్టించడం మనందరికీ గర్వకారణమని సులోచన కొనియా డారు.

# యూరియాపై బిఆర్ఎస్ సమరం

### మాజీ ఎమ్మెల్యే పుట్ట ఆధ్వర్యంలో మహాధర్నా

### మంథని లో స్తంభించిన ట్రాఫిక్

### 40బస్తాల లెక్క చెప్పని అధికారిపై చీటింగ్ కేసు పెట్టాలి

### పోలీసులు రైతుల పక్షాన నిలబడి న్యాయం చేయాలే

### మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని ఆగస్టు 30 (నినాదం):** రైతులకు సకాలంలో యూరియా అందిం చడంలో విఫలమైన అధికార పార్టీ పై బిఆర్ఎస్ సమరం చేపట్టింది. మంథని మాజీ ఎమ్మెల్యే మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆధ్వర్యంలో రైతులు శనివారం పెద్ద ఎత్తున స్థానిక పెట్రోల్ పంపు సమీపంలో కాటారం - మంథని ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు .ఒక్క బస్తా యూరియా కోసం రైతులు నానా తంటాలు పడుతుంటే రైతుల గోస పట్టించుకోకుండా మంథని ఎమ్మెల్యే మీటింగ్ పెట్టి వెళ్లిపోయాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. అయితే సదరు వ్యాపారి బాబురావు గోదాంలో 110బస్తాలు ఉన్నాయని, ఇప్పటికే 40 మంది టోకెన్లు తీసుకున్నారని వివరిం చారు. ఈ క్రమంలో మిగిలిన వాటి గురించి అడుగగా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు వ్యాపారి, వ్యవసా య అధికారులు, పోలీసుల వ్యవహరి స్తున్న తీరును నిరసిస్తూ చౌరస్తాలో రైతులతో కలిసి రాస్తారోకో, ధర్నా నిర్వ హించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ మంథని ఎమ్మెల్యే శుక్రవారం మంథనికి వస్తున్నాడంటే యూరియా బస్తాలు వస్తాయని అనుకున్నామని, కానీ ఆయన వేల మంది పోలీస్ పహారాలో వచ్చి రైతులను కలువకుండా వారి గోస వినకుండా మీటింగ్‌లు పెట్టుకుని వెళ్లిపో యాడని అన్నారు. మానీఫెస్టో కమిటి చైర్మన్‌గా, మంత్రిగా ఈ ప్రాంత ఎమ్మె ల్యేగా రైతులను పట్టించుకోకపోవ డంతో రైతులకు దిక్కుగా ఉన్న ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ పార్టీ పక్షాన రైతులకు అండగా నిలిచామన్నారు. మంథని ఎమ్మె ల్యే నాయకత్వంలోనే యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుందని, కల్వచర్లలో అక్ర మంగా తరలిస్తున్న వంద బస్తాలను పట్టుకున్నారని ఆయన తెలిపారు. 40బ స్తాలపై సమాధానం చెప్పని వ్యవసాయ అధికారిపై చీటింగ్ కేసు పెట్టాలని, సదరు వ్యాపారిపై కేసు పెట్టి విచారణ చేసి అసలు దోషులను బయటకు తీయా లని ఆయన డిమాండ్ చేశారు. రైతు సేవా కేంద్రంలో జరిగిన వ్యవహారానికి మంథని ఎస్ఐ ప్రత్యక్ష సాక్షి అని ఆయన ముందే నిర్ధారణ అయిందన్నారు. పోలీ సులు సైతం అత్యుత్సాహం చూపుతు న్నారని, పోలీసులు రైతుల పక్షాన నిలబడి రైతులకు న్యాయం చేయాలే తప్ప కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలుక వద్దని ఆయన హితవు పలికారు. ఇప్పట కైనా ఈ విషయంలో మానీఫెస్టో కమిటి, 420కమిటి చైర్మన్ స్పందించా లని, ఈ ప్రాంతల ప్రజల ఓట్లతో 40ఏం డ్లుగా అధికారం వచ్చిందనే విషయాన్ని గుర్తిం చాలన్నారు. రైతుల ఉసురు తాకినోళ్లు ఎవరూ బాగుపడులేదని, ఈ గోస వట్టిగనే పోదన్నారు.

**గణపతి బప్పా మోరియా... కావాల య్య యూరియా!**

గణపతిబప్పా మోరియా కావాలయా యూరియా అంటూ పాత పెట్రోల్ బంక్ చౌరస్తా మార్మోగింది. రైతు సేవా కేం ద్రం నిర్వాహకుడు, వ్యవసాయ అధి కారుల వైఖరిని నిరసిస్తూ పెద్దపల్లి - కాటారం ప్రధాన రహదారి పాత పెట్రో ల్ బంకు చౌరస్తా లో ప్రభుత్వం సరిపడ యూరియా సరఫరా చేయాలనే డిమాండ్‌తో రైతులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధర్నా రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడి విగ్రహంతో ధర్నా నిర్వహిం చారు. గణపతి బప్పా మోరియా... కావాలయ్య యూరియా అనే నినాదం తో విఘ్నేశ్వర స్వామికి భజన చేసి యూరియా బాధలను తీర్చాలంటూ స్వామివారిని వేడుకున్నారు. ఎరువుల దుకాణాల్లో దళారులకు లింకు పెట్టి అక్రమంగా యూరియా విక్రయిస్తున్నా రని రైతులు ఆరోపించారు.చివరకు రైతు లకు యూరియా బస్తాలు ఇస్తామంటూ చెప్పడంతో ఆందోళణ విరమించారు. అనంతరం రైతు సేవా కేంద్రం ఎదుట యూరియా కోసం క్యూలైన్‌లో నిలబడిన రైతులకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వాటర్ బాటిల్స్ , బిస్కెట్ ప్యాకెట్స్ అందజేశారు.గంటల తరబడి క్యూలైన్ నిలబడిన రైతుల దాహార్తి తీర్చి మాన వత్వం చాటుకున్నారు.

## రోడ్డుకు ఇరు వైపులా చెట్లునాటాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### 7 రోజులలో 40 వేల మొక్కల అవెన్యూ ప్లాంటేషన్ పూర్తి చేయాలి

### వనమహోత్సవం కార్యక్రమం పై సంబంధిత అధికారులతో సమావేశం



**పెద్దపల్లి ప్రతినిధి,ఆగస్టు30(నినాదం):** జిల్లాలోని రోడ్లకు ఇరు వైపులా ఎత్తైన మొక్కలు నాటి గ్రీనరీ పెంచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ.హర్ష అన్నారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వన మహో త్సవం కార్యక్రమం పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,వన మహోత్సవ కార్యక్రమం క్రింద జిల్లాలో గ్రీనరీ పెంచేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రాబోయే 7 రోజులలో జిల్లా వ్యాప్తంగా ఉన్న రోడ్లకు ఇరు వైపులా 40 వేల వరకు ఎత్తయిన మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు.మొక్కల సంరక్షణ కోసం సహాయ కర్ర, ట్రీ గార్డ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అన్నా రు.అవెన్యూ ప్లాంటేషన్ లో మొక్కలకు రెగ్యులర్ గా నీటి సరఫరా జరిగేలా చూడాలని అన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ లో మొక్కలు ఎండి పోతే వెంటనే రిప్లేస్ చేయాలని అన్నారు.మొక్కల సంరక్షణ పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరిస్తే అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిం దిని, జిల్లా అటవీ అధికారి శివయ్య,డిపిఓ వీర బుచ్చయ్య, ఎంపీడీవోలు, సంబంధిత అధికారు లు,తదితరులు పాల్గొన్నారు.

## శివాలయం గణనాధునికి 216 రకాల నైవేద్యాలు





### ఆలయ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ

**సుల్తానాబాద్, ఆగస్ట్ 30(నినాదం):** శివాలయ గణనాథునికి 216 రకాల నైవేద్యాలు సమర్పించామని పురాతన శివాలయం చైర్మన్ అ ల్లంకి సత్యనారాయణ తెలిపారు. శనివారం సు ల్తానాబాద్ మండల కేంద్రంలోని పురాతన శివాల యం లోని శ్రీ వినాయక మండపం వద్ద నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పురోహితులు వల్ల కొండ మహేష్, వల్ల కొండ రమేష్ వారి మంత్రోచ్చా రణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి 216 రకాల నైవేద్యాలు సమర్పించారు.అనంతరం ఆలయ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ మాట్లాడు తూ, ప్రజ లందరిని ఆ గణనాథుడు ఆయురా రోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండేలా ఆశీర్వ దించాలని కో రినట్టు తెలిపారు. ఈ సందర్భంగా డ్రా నిర్వహించి భక్తులకు బహుమతులు అందజే శారు. ఈ కార్య క్రమంలో భక్తులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

## గౌడ వీధి గణపతి మండపం వద్ద అన్నదానం

### గౌడ సంఘం ఉపాధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్

### బొజ్జ గణపయ్యకు ఘనమైన పూజలు



**సుల్తానాబాద్, ఆగస్ట్ 30(నినాదం):** సుల్తానాబాద్ మండల కేం ద్రంలోని గౌడ వీధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గణపతి మండపం వద్ద శనివారం కొయ్యడ శ్రీని వాస్ గౌడ్ రమాదేవి దంపతులు, వారి కుమారు డు కొయ్యడ ఉదయ్ కుమార్ గౌడ్ కోడలు పూజా రాణి, రెండో కుమారుడు కొయ్యడ అభిలాష్ గౌడ్ తో కలిసి గణపతి మండపం వద్ద పురోహితులు పారువెల్లి రమే ష్ శర్మ మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించి, ప్రసాదాన్ని నైవేద్యంగా స మర్పించారు. అనంతరం కొయ్యడ శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి భక్తులకు అన్నదానం చేసారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, ప్రజలందరినీ ఆ గణనాథుడు ఆయురారోగ్యాల తో , సుఖ సంతోషాలతో ఉండేలా ఆశీర్వదించా లని కోరినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో మ హిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సామాన్యులకు న్యాయాన్ని అందించేలాగా కృషి చేయాలి

### -జడ్జి సునీత కుంచాల



**పెద్దపల్లి ఆగస్టు 30 (నినాదం) :** పెద్దపల్లి జిల్లాలో గల మారుమూల గ్రామాలలోని సామాన్యులకు సైతం న్యాయ సేవలు అందేలాగా ప్యారా లీగల్ వాలంటీర్లు కృషి చేయాలని, జిల్లా మరియు సెషన్స్ జడ్జ్ సునీత కుంచాల కోరారు. శనివారం నాడు పెద్దపల్లి జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన పారా లీగల్ వాలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన హక్కులు కల్పించిందని ఆ ప్రకారం సామాజికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయ సేవలు అందేలాగా పారా లీగల్ వాలంటీర్లు కృషి చేయాలని కోరారు.వృద్ధులు వికలాంగులు,మహిళలు సమాజంలో చిన్నచూపు చూడకుండా వారి హక్కులను పరిరక్షించటం కోసం పారా లీగల్ వాలంటీర్లు నిరంతరం పని చేయాలని కోరారు.వృద్ధులు, వికలాంగులకు ప్రభుత్వం నుండి అందాల్సిన పెన్షన్లు ఇతర సేవలు అందించడం అందరి బాధ్యత అని వారు అన్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న పారా లీగల్ వాలంటీర్ల శిక్షణ కార్యక్రమానికి రాష్ట్రంలోనే మొదటిసారిగా స్వశక్తి సంఘాలకు చెందిన జిల్లా మహిళా సమాఖ్య నాయకులు పాల్గొనడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.జిల్లా మహిళా సమాఖ్య నాయకులు జిల్లాలోని ప్రతి మారుమూల గ్రామాలలో కూడా న్యాయ సేవల్ని అందించడం కొరకు వారు నిర్వహించుకునే సమావేశాల్లో చర్చించాలని కోరారు.అదే విధంగా పారా లీగల్ వాలంటీర్లుగా పనిచేయడానికి ఎన్నో సంవత్సరాల పాటు ఉద్యోగులుగా సేవలు అందించి రిటైర్డ్ అయిన ఉద్యోగులు,మరియు ఎన్జీవో లో పనిచేసే యువతీ యువకులు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా జడ్జ్ సునీత కుంచాల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సునీత కుంచాల డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జి పెద్దపల్లి,టి. శ్రీనివాసరావు,అడిషనల్ డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జి గోదావరిఖని,స్వప్న రాణి సెక్రటరీ డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ పెద్దపల్లి,బి.శ్రీనివాసులు,సీనియర్ సివిల్ జడ్జి పెద్దపల్లి,జీవన సూరజ్ సింగ్,సీనియర్ సివిల్ జడ్జి పెద్దపల్లి, భవాని,సీనియర్ సివిల్ జడ్జి పెద్దపల్లి, ఏం.సరిత,జూనియర్ సివిల్ జడ్జి నంది మేడారం,గణేష్,జూనియర్ సివిల్ జడ్జి సుల్తానాబాద్,రవీందర్,అడిషనల్ డి. ఆర్.డి.ఏ.పెద్దపల్లి,జీవన్ రాజు ప్రెసిడెంట్ రిటైర్డ్ డిస్టిక్ ఎంప్లాయిస్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాల అసత్యపు ఆరోపణలు

### గత ప్రభుత్వం కట్టిన బ్యారేజ్ వల్లే రైతులకు నష్టం



**మంథని ఆగస్టు 30( నినాదం ) :** మంత్రి శ్రీధర్ బాబు చేస్తున్నటు వంటి అభివృద్ధి చూసి ఓర్వలేకనే మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు కర్ అసత్యపు ఆరోపణలు చేస్తున్నా రని కాంగ్రెస్ నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శనివారం మంథని ప్రెస్ క్లబ్ లో కాంగ్రెస్ నాయకులు పాత్రికేయుల సమా వేశం ఏర్పాటు చేశారు. ఈ సమావే శంలో మంథని మండల పార్టీ అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, మంథని మాజీ సర్పంచ్ వోడ్నాల శ్రీనివాస్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, మాజీ ఎంపీపీ కొండ శంకర్ లు మాట్లా డుతూ... పుట్ట మధుకర్ చేసినటు వంటి వాక్యాలు ఖండిస్తు న్నట్లు వారు పేర్కొన్నారు. వర్షాకాలం లోపల వర్షాలు పడితే విపత్తు అనేది వస్తది దాని రాజకీయం చేయడం సిగ్గుచేటని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కట్టిన ప్రాజెక్టుల వల్ల రైతు లకు తీవ్ర నష్టం జరుగుతుందని వారి పేర్కొన్నారు. పుట్ట మధుకర్ అధికారంలో ఉన్నప్పుడు వరదలు వస్తే మంథని ప్రజలను పరామర్శిం చారా, వాళ్లకి సహాయ పడ్డారా అని ప్రశ్నించారు. మంత్రి శ్రీధర్ బాబు కాంగ్రెస్ నాయకులతో కలిసి నష్టపో యిన రైతులను గతంలో ఆదుకు న్నారని గుర్తు చేశారు. గోదావరి ప్రవాహంతో పంటలు నష్టపోవడం చాలా బాధాకరమని, నష్టపోయిన ప్రతి ఒక రైతుకి మంత్రి శ్రీధర్ బాబు న్యాయం చేస్తారని వారు తెలిపారు. ఈ ప్రాంత రైతులకు మేం అండగా ఉంటామని, మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో సేవ చేసేందుకు సిద్ధమని వారు పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు కాంగ్రెస్ కార్యకర్తల పైన అసత్యపు ఆరోపణలు చేస్తే ఊ రుకునేది లేదని వారు హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసుకుల ప్రశాంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోటీకారి కిషన్ జి, మంథని మండల యూత్ అధ్యక్షు లు సాదుల శ్రీకాంత్, మాజీ సర్పం చులు నాగుల రాజయ్య, దోరగొల్ల శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల ప్రధా న కార్యదర్శి అక్కపాక సదయ్య, పెద్దపల్లి జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జ్ ఆరెల్లి కిరణ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మంథని శ్రీనివాస్, గుండా రాజు, రోడ్డ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్లపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



**చింతపల్లి, ఆగస్టు 30( నినాదం)** గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలపై వార్డువారి ముసాయిదా, పోలింగ్ స్టేషన్లపై మండల స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల వారి అభ్యంతరాలపై మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డి ఎల్ పి ఓ. శంకర్ నాయక్ ,ఎంపీడీవో శ్రీమతి సి సుజాత, ఎంపీ ఓ. ప్రవీణ్ శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, బిజెపి మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్, బి ఆర్ ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వింజమూరు రవి, సిపిఎం మండల కార్యదర్శి ఉడుకుంట్ల రాములు, సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, బీఎస్పీ మండల అధ్యక్షుడు మొగులయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన ఎస్‌జిఎఫ్ క్రీడలు



**కోదాడ,ఆగస్టు 30(నినాదం):** అనంతగిరి మండలస్థాయి ఎస్ జి ఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడలు శాంతినగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి తల్లాడ శ్రీనివాస రావు శనివారం ఘనంగా ప్రారంభించారు. మండలం లోని అన్ని పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు చాల చురుకుగా పాలొ నట్లుగా ఆయన తెలిపారు . క్రీడలలో గెలుపొందిన క్రీడాకారు లకు మండల విద్యాధికారి , శాంతినగర్ ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందజేశారు...అండర్ 17 -14 వాలీబాల్ బాలురు, బాలికల విభాగంలో ప్రథమ బహుమతి గోండ్రి యాల హై స్కూల్, ద్వితీయ బహుమతి బాలుర విభాగం లో అమీనాబాద్ హై స్కూల్,బాలికల విభాగం లో బీసీ గురుకుల విద్యార్థినులు గెలిచారు... . కబడ్డీ విభాగంలో..అండర్ -17 ప్రథమ బహుమతి శాంతినగర్ హై స్కూల్ , ద్వితీయ బహుమతి అమీనాబాద్ హై స్కూల్ బాలికల విభాగం లో ప్రథమ బహుమతి బీసీ గురుకుల , ద్వితీయ బహుమతి అనంతగిరి జడ్.పి.హెచ్.ఎస్ గెలుపొందారు .అండర్ -14 ఖో ఖో విభాగంలో... బాలుర విభాగం లో ప్రథమ బహుమతి గోండ్రియాల హై స్కూల్ , ద్వితీయ బహుమతి శాంతినగర్ హై స్కూల్, బాలికల విభాగం లో ప్రథమ బహుమతి బిసి గురుకుల ,ద్వితీయ బహుమతి గోండ్రియాల హై స్కూల్ గెలిచినట్లుగా తెలిపారు

## కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలి

### వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు

### సీతారామాంజనేయస్వామి దేవాలయంలో పడాల అజయ్



**సుల్తానాబాద్, ఆగస్ట్ 30(నినాదం):** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం ప్రతి కార్యక ర్త కృషి చేయాలని సుల్తానాబాద్ వ్యవసాయ మా ర్కెట్ చైర్మన్మినుపాల ప్రకాష్ రావు పిలుపునిచ్చా రు. శనివారం సుల్తానాబాద్ మండలం, ఐతరాజ్ పల్లి గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయస్వామి దే వాలయంలో పడాల అజయ్ గౌడ్ తో కలిసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎ న్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ప్రజా సం క్షేమం, గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా ముందుకు సాగుతుందని చెప్పారు. అలాగే ప్రజల ఆశీర్వాదం కార్యకర్తల కృషి ఉంటే కాంగ్రెస్ పార్టీ విజయాలు సాధిస్తుందని ఆశ భావం వ్యక్తం చేశా రు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు, సర్పం చ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు, గర్రెపల్లి మాజీ సర్పంచ్ శ్రీ పడాల అజయ్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిలుక సతీష్, కిసాన్ సెల్ అ ధ్యక్షులు పన్నాల రాములు, డిసి ఎమ్మెస్ డైరెక్టర్ జానీ, మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ రావు, వెంకన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బ క్కయ్య, మాజీ డైరెక్టర్ చక్రధర్,కాంగ్రెస్ యువ నా యకుడు దాసరి సతీష్, గ్రామ పెద్దలు రాజిరెడ్డి, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షించాలి

### కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి

### శ్రీ స్కూల్ పాఠశాలలో హరితహారం



**కోదాడ,ఆగస్టు 30 (నినాదం):** విద్యార్థులు మొక్కలు నాటడం తో పాటు వాటిని సంరక్షించాలని కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి అన్నారు. శనివారం శ్రీ స్కూల్ పాఠశాల ఆవరణ లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడు తూ పర్యావరణ పరిరక్షణ కు వృక్షాలే ప్రదానం అన్నారు. భవిష్యత్ తరాల కు మంచి వాతావరణం మొక్కల ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. కాలుష్య నివారణ కు ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. విద్యార్థులు తమ ప్రతి పుట్టిన రోజు కు మొక్కలు నాటాలన్నారు. మొక్కలే బహుమతులు గా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో, సీఈఓ చిలక రమేష్ పాల్గొన్నారు.

## దరఖాస్తుల గడువు పొడగింపు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 30 (నినాదం) :** సూర్యాపేట పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యయన దరఖాస్తుల తేదీని సెప్టెంబర్ 12 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డా. వి. వెంకటేశులు కోఆర్డినేటర్ ఎన్ఎస్ఆర్ శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాల డిప్లమా కోర్సు పాసైన విద్యార్థులు braou on line.in దరఖాస్తు చేసుకోవచ్చని ఇతర వివరాల కొరకు 9440 194909, 8106089325 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఓటర్ల జాబితాపై అఖిలపక్ష సమావేశం

**కోదాడ,ఆగస్టు 30(నినాదం):** ఓటర్ల జాబితా పై శనివారం అనంతగిరి మండల ఎంపీడీవో కార్యాలయంలో అన్ని పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో హిమబిందు మాట్లాడుతూ...మండలంలో 20 గ్రామ పంచాయతీల పరిధిలోని వార్డుల వారిగా ఓటర్ల ముసాయిదా జాబితాను గురువారం విడుదల చేశామన్నారు. అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని వెల్లడించారు. పలు రాజకీయ పార్టీ నాయకులు సైతం సూచనలు చేశారు.ఎంపీడీవో హరి సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలోస్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నల్ల భూపాల్ రెడ్డి, నాయకులు చుండూరు వెంకటేశ్వరరావు, బుర్ర పుల్లారెడ్డి, బానోతు బాబు నాయక్, గుగులోత్ శ్రీనివాస్ నాయక్, ఈదుల కృష్ణయ్య, ముత్తినేని కోటేశ్వరరావు, పి వీరయ్య వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు..





# జర్నలిస్ట్ కాలనీలో అన్నదానం



**హైదరాబాద్, ఆగస్టు 30(నినాదం) :** నిజాంపేట జర్నలిస్ట్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్,మాధవి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి తదనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# వృద్ధుల పోషణకు ట్రిబ్యునల్ ఉత్తర్వుల అమలు పర్యవేక్షించాలి

**వృద్ధులకు, తల్లిదండ్రులకు న్యాయం చేయాలి**

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, ఆగస్టు 30(నినాదం) :** వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం అనుసరించి ట్రిబ్యునల్ ఇస్తున్న ఉత్తర్వులను పాటిస్తున్నది లేనిది పర్యవేక్షించాలని, తద్వారా వృద్ధులు, తల్లిదండ్రులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. వయోవృద్ధులు, తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం 2007 అమలు తీరు, ట్రిబ్యునల్ ఉత్తర్వులు, అమలుపై వృద్ధుల సంక్షేమ కమిటీ సభ్యులు అధికారులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలిసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, తల్లిదండ్రుల బాగోగులు చూడడం లేదని, శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారని బలవంతంగా ఆస్తి పత్రాల పై సంతకాలు చేయించుకుంటున్నారని రెవెన్యూ డివిజనల్ అధికారి ట్రిబ్యునల్ కు చాలా ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. వాదోపవాదాల తర్వాత వయోవృద్ధులు, తల్లిదండ్రుల సంక్షేమానికి మెయింటెనెన్స్ సొమ్ము ఇవ్వాల్సిందిగా ట్రిబ్యునల్ ఉత్తర్వులు వెలువరిస్తుందని తెలిపారు. అయితే ఈ తీర్పులను ఒకటి రెండు నెలలు అమలు చేసి తరువాత బేఖాతరు చేస్తున్నారని కలెక్టర్ అన్నారు. అందువల్ల తల్లిదండ్రులు వయోవృద్ధులు కలెక్టర్, రెవిన్యూ డివిజనల్ అధికారాల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందని తెలిపారు. వృద్ధుల ఇబ్బందులు తొలగించేందుకు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం, రెవిన్యూ, పోలీస్, సఖి కేంద్రాల నుంచి ఒక్కో అధికారి బృందంగా ఏర్పడి ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులు సక్రమంగా అమలు జరుగుతున్నది లేనిది క్షేత్రస్థాయిలో విచారించాలని అన్నారు. ఫిర్యాదు చేసిన వయోవృద్ధుల యోగక్షేమాలను ఈ బృందం పర్యవేక్షించి నివేదిక సమర్పించాలని అన్నారు. తద్వారా ఈ చట్టం పటిష్టంగా అమలు జరిగే అవకాశం ఉందని అన్నారు. అంతిమంగా అధికారులు వయోవృద్ధులకు న్యాయం చేయాలని తెలిపారు. అదేవిధంగా వయోవృద్ధుల కేసులకు సంబంధించి ఆర్డీఓ ఆధ్వర్యంలోని ట్రిబ్యునల్ లో ప్రతి శనివారం నిర్వహించే విచారణ సమయంలో ఒక పోలీస్ అధికారికి విధులు కేటాయించాలని సీపీకి సూచించారు. ట్రిబ్యునల్ జారీచేసిన విధంగా మెయింటెనెన్స్ సొమ్మును తల్లిదండ్రులకు ఇవ్వాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఈ ఆదేశాలపై వయోవృద్ధుల సంక్షేమ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం, రెవెన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్, రమేష్ బాబు, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అడిషనల్ డీసీపీ వెంకటేశ్వర్, డీసీహెచ్ఎస్ కృష్ణ ప్రసాద్, అడిషనల్ డిఆర్డిఓ రవి కిరణ్, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ సభ్యులు కేశవరెడ్డి, జనార్ధన్ రావు,రామేశం, రాధ పాల్గొన్నారు.




# పట్టుదలతో చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చు

**ఎస్సైలు సంతోష్ రెడ్డి, తేజస్విని**







**చేవెళ్ళ ఆగస్టు 30( నినాదం):** పట్టుదలతో చదివితే శిఖరాలను అవరోధించవచ్చు అని ఎస్సైలు సంతోష్ రెడ్డి తేజస్విని అన్నారు.శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో కేజిఆర్ ఫంక్షన్ హాల్ లో శ్రీ చైతన్య జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ సంతోష్ రెడ్డి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పట్టుదల నిరంతర కృషితో మాత్రమే తమ లక్ష్యాలను సాధించుకోవాలని గొప్ప సంకల్పాలు కలిగి వాటిని కష్టపడి సాధించుకోవాలని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని కళాశాలకు తల్లిదండ్రులకు సొంత గ్రామానికి మంచి పేరు ప్రాముఖ్యతను తీసుకురావాలని కోరారు. ఎస్సై తేజ శ్రీ మాట్లాడుతూ.. క్రమశిక్షణలో మంచి ప్రణాళికలో భావి జీవితాలకు ఆనందంగా తీర్చిదిద్దుకోవాలని పేర్కొన్నారు. రాబోయే రోజులలో యువత దేశానికి ఎంతగానో అవసరం ఉందన్నారు. లిరిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ అయ్యవారి గోపాలచారి మాట్లాడుతూలి ఉత్తమ విద్యార్థులకు సత్యసాయి సేవ సమితి ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులకు చెక్కులను అందజేశారు. విద్యార్థులు ఆధ్యాత్మిక జీవనం పథంలో నడుస్తూ మంచి నైతిక విలువలను ఎంచుకోవాలన్నారు మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని అన్నారు. చైతన్య కళాశాల ప్రిన్సిపల్ శేఖర్ మాట్లాడుతూ.. ప్రణాళిక బద్ధంగా చదువుకొని ఉత్తమ మార్కులు సాధించాలని కోరడం జరిగింది. శ్రీ చైతన్య కళాశాలలో ప్రత్యేకమైన విద్యా బోధనలతో విద్యార్థులను మంచి స్థాయికి తీసుకెళ్లడమే మా లక్ష్యం అన్నారు.అనంతరం ఉత్తమ విద్యార్థులను అభినందించి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సంస్కృతి కార్యక్రమాలు ఆటపాటలతో చేపట్టారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మనోహర్ రెడ్డి,శ్రీకాంత్,రఘుపతి రెడ్డి, విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..

# బస్సులు రాకపోవడం లేదని విద్యార్థుల నిరసన



**కొడంగల్, ఆగష్టు 30 (నినాదం) :** మాధ్యమిక, కళాశాల స్థాయి చదువులు చదివేందుకు సమీపంలోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్ళేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని దౌల్తాబాద్ మండలం లోని విద్యార్థులు మండల కేంద్రంలో నిరసన తెలిపారు. విద్యార్థుల నిరసనలో పాల్గొన్న ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు రాజుకుమార్ గౌడ్, సహాయ కార్యదర్శి చాకలి అనిల్ లు మాట్లాడుతూ బిచ్చాల్, తిమ్మాయిపల్లి, గుండాల గ్రామాల నుంచి 80 కి పైగా విద్యార్థులు కోస్గి, దౌల్తాబాద్ లకు వెళ్తుంటారని, వీరికి బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవ దంతో గతంలో ఉన్న బస్సు సౌకర్యాన్నీ ఆపేశారనీ, మళ్ళీ బస్సు సౌకర్యాన్ని పునరుద్దరించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ ను కలిశామని, అయినా బస్సు సౌకర్యం కల్పించలేదనీ అన్నారు. ఇప్పటికైనా బస్సు సౌకర్యం కల్పించకపోతే త్వరలో పెద్ద ఎత్తున నిరసన, ధర్నా లు చేపడతామని హెచ్చరించారు. అనంతరం మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి నిరసన విరమించారు.

## NINADAM CINEMA

# చిరుతో.. వెంకటేశ్ చేరేది అప్పుడే



'మన శంకరవరప్రసాద్ గారు'గా సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు చిరంజీవి. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. హీరో వెంకటేశ్ ఇందులో ప్రత్యేక పాత్రలో సందడి చేయనున్నట్లు- అనిల్ ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమా కోసం ఆయన వచ్చే నెల మధ్య నుంచి సెట్లోకి అడుగు పెట్టనున్నట్లు- సమాచారం. హైదరాబాద్‌లో మొదలు కానున్న ఈ కొత్త షెడ్యూల్ కోసం ఇప్పటికే సన్నాహాలు మొదలయ్యాయి. ఈ కథలో వెంకీ పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉందని.. చిరుతో పాటతో పాటు- యాక్షన్ సీక్వెన్స్‌లోనూ భాగమయ్యే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. వినోదం, కథా చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.

# దసరా కానుకగా పవన్ కళ్యాణ్ ఓజి

**సువ్విసువ్వి పాటకు వేలాది లైక్‌లు**






హరిహర వీరమల్లు చిత్రంతో నిరాశపరిచిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఓజీ చిత్రంతో ఫ్యాన్స్‌కి మంచి కిక్ ఇవ్వబోతున్నాడు. ఈ సినిమా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న ' ఓజీ ' చిత్రం దసరా కానుకగా సెప్టెంబర్ 25న రిలీజ్ కానుంది. నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతోన్న 'అఖండ 2' చిత్రం దసరాకి వస్తుం దని ముందు ప్రచారం జరిగినా, అది రేసు నుంచి తప్పుకోవడంతో 'ఓజీ'కి మరింత ప్లస్ కానుంది. సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్-టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య నిర్మించారు. పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రానున్న ఈ చిత్రంలో పవన్ సరసన ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తోంది. ఎప్పుడో రావాల్సిన ఈ చిత్రం పవన్ కళ్యాణ్ బిజీ షెడ్యూల్ కారణంగా కాస్త ఆలస్యమైంది. చివరికి అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని సెప్టెంబర్ 25న రిలీజ్‌కి సిద్ధమైంది. ఓవర్సీస్‌లో ఒకరోజు ముందుగానే ప్రీమియర్ షోలు పడనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ కూడా మొదలయ్యాయి. ఈ చిత్రానికి సంబంధించి స్టోరీ లైన్ ఒకటి బలంగా వినిపిస్తోంది. అదే నిజమైతే 'ఓజీ' బ్లాక్‌బస్టర్ కావడం ఖాయం అంటూ ఫ్యాన్స్ చెప్పుకొస్తున్నారు. సోషల్‌మీడియాలో వినిపిస్తోన్న సమాచారం ప్రకారం ... ముంబయి అండర్ వరల్డ్ నుండి పూర్తిగా మాయమైన 'ఓజస్ గంభీర' మళ్లీ తిరిగి రావడం, చీకటి ప్రపంచాన్ని శాసిస్తోన్న నిరంకుశ శత్రువైన ఓమి భావుని మట్టి కరిపించి తన సామ్రాజ్యాన్ని మళ్లీ ఎలా హస్తగతం చేసుకున్నాడన్నది చిత్ర కథగా తెలుస్తుంది. ఓజస్ గంభీర ప్రత్యర్థుల్ని ఎంత కిరాతకంగా హతమార్చాడు, నమ్మక ద్రోహానికి పాల్పడిన వారిని ఎలా శిక్షించాడు వంటి సీన్స్‌ని సుజీత్ చాలా అద్భుతంగా తెరకెక్కించాడట. పదేళ్లు కనిపించకుండా పోయిన ఓజస్ ఎక్కడికి వెళ్లాడు, ఏం చేశాడు అన్నది ఏ మాత్రం గెస్ చేయలేరట. కథ వినడానికి రొటీ-న్‌గానే ఉన్నా సుజీత్ టేకింగ్ సినిమాని మరో స్థాయికి తీసుకెళతాడని ముచ్చటించుకుంటున్నారు.

# ఎమోషనల్ స్టోరీ లైన్‌లో ఘాటీ

**విడుదల కోసం అభిమానుల ఆసక్తి**




స్టార్ బ్యూటీ అనుష్క శెట్టి లీడ్ రోల్‌లో నటిస్తు న్న తాజా చిత్రం 'ఘాటి' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఎప్పుడు ఎప్పుడు విడుదల అవుతుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమా పలు కార ణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఇక ఇప్పుడు ఈ చిత్రం సెప్టెంబర్ 5న గ్రాండ్ థియే ట్రికల్ రిలీజ్‌కు రెడీ అయింది. ఈ చిత్రా నికి సంబంధించిన ప్రమోషన్స్ కూడా శరవే గంగా జరుపుతున్నారు. ఈ క్రమంలో ఈ చిత్రం తాజాగా సెన్సార్ పనులు కూడా ముగిం చు కుంది. కాగా ఈ సినిమాకు సెన్సార్ బోర్డు యూ/ఎ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ సిని మాలో శీలవతి పాత్రలో అనుష్క స్టన్నింగ్ పర్ఫా ర్మెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోనుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్ర రన్-టైమ్‌ను 2 గంటల 37 నిమిషాలకు లాక్ చేశారు మేకర్స్. కాగా ఈ సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్ష కులను థ్రిల్ చేస్తాయని చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ సినిమా కథ ఎమోషనల్ జర్నీగా ప్రారంభమై, ఇంటర్వెల్ వరకు సున్నితంగా నడిచినప్పటికి, ఇంటర్వెల్ తర్వాత మాత్రం ఆడియన్స్‌ను పూర్తిగా షాక్‌కు గురిచేయడం ఖాయం అంటున్నారు. ఇంటర్వెల్ తర్వాత కథ ఒక్కసారిగా అతి తీవ్ర యాక్షన్ మోడ్ లోకి వెళ్లి, గంజాయి మాఫియా నేపథ్యం పై రగిలే కథతో ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెట్టనుందట. కోట్లాది అభిమానులను సంపాదించుకున్న అనుష్క పెద్దగా సినిమాలు చేయక పోవడంతో, ఆమె అభిమానులు కొత్త సినిమా కోసం చాలా రోజులుగా ఎదురు చూస్తున్నారు.

# సంక్రాంతి బరిలో స్టార్ హీరోల సినిమాలు




టాలీవుడ్‌లో సీజన్ అంటేనే సినిమాల పండుగ అని చెప్పాలి. ముఖ్యంగా సంక్రాంతి సమయంలో ప్రేక్షకులు థియేటర్ల వైపు పరుగులు తీస్తారు. ఆ క్రేజ్ దృష్ట్యా పెద్ద హీరోలు, స్టార్ డైరెక్టర్లు, ప్రముఖ బ్యానర్లు అన్నీ ఈ సీజన్‌లోనే తమ సినిమాలను రిలీజ్ చేయాలని చూస్తుంటారు. కానీ ఇలాంటి హై వాల్యూ సీజన్‌లో ఎక్కువ సినిమాలు ఒకేసారి వస్తే అవి ఒకదానితో ఒకటి క్లాష్ అవ్వడం తప్పదు. ఎందుకంటే మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'మన శంకర వరప్రసాద్ గారు'మూవీ సంక్రాంతి రేసులో ఉన్న విషయం తెలిసిందే. మరోవైపు పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ కూడా 'రాజా సాబ్' సినిమాను జనవరి 9న రిలీజ్ చేస్తామని అధికారికంగా ప్రకటించారు. ఇంతలోనే







నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 'అఖండ 2' అనుకోకుండా వాయిదా పడింది. సెప్టెంబర్ 25న రిలీజ్ అవ్వాల్సిన ఈ చిత్రం ఇప్పుడు సంక్రాంతి సీజన్‌కి మళ్లే అవకాశం ఉంది. అంటే 2004లో లానే మళ్లీ చిరంజీవి, బాలకృష్ణ, ప్రభాస్ సినిమాలు ఒకేసారి బరిలోకి దిగే పరిస్థితి కనిపిస్తోంది. అంటే 2026 సంక్రాంతి కూడా తెలుగు సినిమా అభిమానుల కోసం సందేహం లేదు.

# మిరాయ్ చిత్రంపై అంచనాలు పెంచిన ట్రైలర్




ఈ మధ్యకాలంలో వందల కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమాలు కూడా గ్రాఫిక్స్ విషయంలో నెటిజన్లను మెప్పించలేక ట్రోలింగ్ బారిన పడుతున్నాయి. కానీ యంగ్ హీరో తేజ సజ్జ పరిమిత బడ్జెట్‌లోనూ వావ్ ఫ్యాక్టర్ ఉన్న విజువల్ సినిమాలతో సూపర్ హీరోగా ఎదుగుతున్నాడు. 'హనుమాన్' తర్వాత ఆయన జాగ్రత్తగా సినిమాలు ఎంచుకుని, పాన్ ఇండియా ప్రేక్షకులకు యూనివర్సల్ కంటెంట్ అందిస్తున్నాడు. తాజాగా, కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన 'మిరాయ్' ట్రైలర్ రిలీజ్ అయింది. కేవలం మూడు నిమిషాల -ట్రైలర్ మాత్రమే అయినా, సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచింది.ప్రారంభం నుండి ముగింపు వరకు ప్రతి ఫ్రేమ్ గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉంది. ఈ మధ్యకాలంలో ఇంత యునానిమస్ పాజిటివ్ రెస్పాన్స్ పొందిన -ట్రైలర్ మరొకటి రాలేదని చెప్పాలి. -ట్రైలర్‌లో హీరో తేజ సజ్జ, విలన్ కోసం వెతికే తొమ్మిది శక్తివంతమైన గ్రంథాలు, వాటిని అడ్డుకునే యోధుడి పోరాటం, ఎనర్జిటిక్ యాక్షన్ స్టంట్స్, అడ్వెంచర్ ఎలిమెంట్స్ అందించిన విధంగా సన్నివేశాలు ఉన్నాయి.యోధుడిగా కనిపించబోతున్న తేజ.. మరోసారి సూపర్ హీరోగా -ట్రైలర్‌తో సక్సెస్ అయ్యాడు. -ట్రైలర్ చివర్లో శ్రీరాముడు షాట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో సోషల్ మీడియాలో ప్రశంసలు పొందుతోంది. ఈ సినిమాలో డైనమిక్ హీరో మంచు మనోజ్, సీనియర్ హీరోయిన్ శ్రియ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మొత్తంగా, ఈ ఫాంటసీ యాక్షన్-అడ్వెంచర్ సినిమా పాన్ ఇండియా ప్రేక్షకులకు అంచనాలను పెంచుతూ, సెప్టెంబర్ 12న బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేయడానికి సిద్ధంగా ఉంది.

# అల్లు అరవింద్ ఇంట విషాదం

**అల్లు రామలింగయ్య సతీమణి కన్నుమూత**

**భౌతిక కాయం సదర్శించిన నివాళి**

**అర్పించిన ప్రముఖులు**





అల్లు అరవింద్ ఇంట విషాదం నెలకొంది. ఆయన తల్లి, దివంగత అల్లు రామలింగయ్య భార్య కనకరత్నమ్మ (94) కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతోన్న ఆమె శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఈ వార్త తెలిసిన వెంటనే చిరంజీవి కుటుంబం అల్లు అరవింద్ ఇంటికి చేరుకున్నారు. ప్రస్తుతం రామ్ చరణ్, అల్లు అర్జున్‌లు షూటింగ్ నిమిత్తం మైసూర్, ముంబయిలో ఉన్నారు. మధ్యాహ్నం వారు హైదరాబాద్ చేరుకున్నారు. కనకరత్నమ్మ మరణవార్త తెలుసుకున్న సినీ ప్రముఖులు ఆమె పార్థివదేహానికి నివాళులు అర్పించేందుకు అల్లు అరవింద్ ఇంటికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నివాసం వద్ద బందోబస్తు ఏర్పాటు-చేశారు. మా అత్తయ్య.. దివంగత అల్లు రామలింగయ్య భార్య కనకరత్నమ్మ శివైక్యం చెందడం ఎంతో బాధాకరం. మా కుటుంబాలపై ఆమె చూపిన ప్రేమ, ధైర్యం, జీవిత విలువలు ఎప్పటికీ మాకు ఆదర్శం. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని చిరంజీవి అన్నారు. మా అత్తయ్య.. దివంగత అల్లు రామలింగయ్య భార్య కనకరత్నమ్మ శివైక్యం చెందడం ఎంతో బాధాకరం. మా కుటుంబాలపై ఆమె చూపిన ప్రేమ, ధైర్యం, జీవిత విలువలు ఎప్పటికీ మాకు ఆదర్శం. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను' అని తెలిపారు. కనక రత్నమ్మ గారి జీవితం, కుటుంబం కోసం చూపిన సేవ, ప్రేమ, మరియు ధైర్యం ఎల్లప్పుడూ అల్లు కుటు-ంబం కోసం మార్గదర్శకంగా నిలుస్తుంది. దివంగత అల్లు రామలింగయ్య సతీమణి కనకరత్నమ్మ కన్నుమూశారని తెలిసి చింతిస్తున్నాను. చెన్నైలో ఉన్నప్పటినుంచి ఎంతో ఆప్యాయత చూపేవారు. చుట్టూఉన్నవారిపై అమితమైన ప్రేమాభిమానాలు చూపేలా తన కుమార్తె సురేఖను తీర్చిదిద్దారు. కనకరత్నమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. అల్లు అరవింద్‌కు, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని పవన్ కల్యాణ్ తెలిపారు. వార్తతెలిసిన వెంటనే అల్లు అర్జున్ కూడా చేరుకున్నారు. నానమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న అల్లు అర్జున్ ముంబైలో తన సినిమా షూటింగ్‌ను మధ్యలో ఆపేసి హుటాహుటిన హైదరాబాద్ వచ్చారు. అనంతరం నానమ్మ మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. ఈ క్రమంలోనే అల్లు అరవింద్ ఇంటికి చేరుకున్న మెగాస్టార్ చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ తన తల్లి మరణంతో శోకసంద్రంలో ఉన్న అల్లు అరవింద్, అలాగే తీవ్ర దుఃఖంలో ఉన్న అల్లు అర్జున్‌ను చిరంజీవి ఓదార్చారు. ఇక నానమ్మ మీద ఉన్న ప్రేమతో అల్లు అర్జున్ చిరంజీవి ఎదుట కంటతడి పెట్టు-కున్నారు. మరోవైపు అల్లు కనకరత్నమ్మ మృతి పట్ల సినీ ప్రముఖులు, అభిమానులు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787